సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 333


బుధవారం 16-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు వేళాయె



ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ నేడు తెర లేవనుంది. విశాఖ వేదికగా జరగనున్న ఈ టీ20 టోర్నీలో కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్, రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ జట్లు తలపడనున్నాయి. కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్ మధ్య బుధవారం తొలి మ్యాచ్ జరగనుంది. 12లో

ఔషధాల గని.. కచ్చిడి



మహారాష్ట్రకు చెందిన ఓ జాలరికి దొరికిన కచ్చిడి చేపలతో ఒక్క రోజులోనే మిలియనీర్ అయిపోయాడు. యాభై కేజీల కచ్చిడి చేప కలకత్తాలో రూ.13 లక్షలకు అమ్ముడుబోయింది. కాకినాడ కుంభాభిషేకం రేవులో కచ్చిడి చేప 4 లక్షల రూపాయలు పలికింది. కోనసీమలోని అంతర్వేది తీరంలో కచ్చిడి దొరికిన మత్స్యకారుడిపై కాసుల వర్షం కురిసింది. ఇలాంటి వార్తలు తరచూ చూస్తున్నాం. అసలేంటీ కచ్చిడి చేప. 10లో

ఇన్ఫీకి రూ.13,650 కోట్ల

కాంట్రాక్ట్

దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా వీడియో, బ్రాడ్‌బ్యాండ్, కమ్యూనికేషన్స్ సంస్థ లిబర్టీ గ్లోబల్ కాంట్రాక్టు దక్కించుకుంది. దీని కింద లిబర్టీ గ్లోబల్ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, కనెక్టివిటీ ప్లాట్‌ఫామ్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ఐటీ సేవలు అందించాల్సి ఉంటుంది. 13లో


ట్రంప్‌పై తీవ్రమైన అభియోగాలు



రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు.. జార్జియా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా గ్రాండ్ జ్యూరీ అభియోగాలు నమోదు చేసింది. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎన్నికల్లో రిగ్గింగ్ చేసిన వారిపై దృష్టిపెట్టండి. అసలేం జరిగిందని నిలదీసే మాపై కాదు. ఇదంతా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణ' అని ఖండించారు. 6లో

న్యూస్‌రీల్

అక్షయ్ కుమార్‌కు భారత పౌరసత్వం



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌కు భారత పౌరసత్వం లభించింది. తన హృదయం, పౌరసత్వం రెండూ హిందూస్తానీయే అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'(ట్విట్టర్)లో ఆయన ప్రకటించారు. 1990ల్లో వరుసగా సినిమాలు ఫ్లాప్ కావడంతో కెనడా పౌరసత్వానికి దరఖాస్తు చేసినట్లు అక్షయ్ కుమార్ గతంలో వెల్లడించారు.
వివరాలు 6లో ▸

53కు చేరిన 'హిమాచల్' మరణాలు



హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వర్షసంబంధిత ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 53కు చేరింది. సిమ్లాలోని శివాలయంపై కొండ చరియలు పడిన దుర్ఘటనలో ఘటనాస్థలి నుంచి మరో రెండు మృతదేహాలను వెలికితీశారు. సమ్మర్‌హిల్, ఫాగ్లీలో కొండ చరియలు పడిన ఘటనలో 16 మృతదేహాలను వెలికితీశారు.
వివరాలు 6లో ▸

'సులభ్' వ్యవస్థాపకుడు పాఠక్ కన్నుమూత



సులభ్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్ కన్నుమూశారు. స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత కొద్దిసేపటికి గుండెపోటు రావడంతో ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆయన సన్నిహితులు చెప్పారు. ప్రజా మరుగుదొడ్లను నిర్మించడంలో ఆద్యుడిగా ఆయనకు పేరుంది.
వివరాలు 6లో ▸

మళ్లీ నేనే!



ఎర్రకోటపై నుంచి ఎన్నికల భేరీ మోగించిన ప్రధాని మోదీ

- వచ్చే ఏడాదీ ఇక్కడినుంచి నేనే జాతినుద్దేశించి ప్రసంగిస్తా
- అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు.. మూడు చీడ పురుగులు
- ప్రజలంతా వాటిని తప్పనిసరిగా వదిలించుకోవాలి
- ప్రజలంతా నా వాళ్లే.. ప్రజల నుంచే వచ్చా.. ప్రజల కోసమే జీవిస్తా
- అవినీతి పార్టీల కూటమి 'ఇండియా'.. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా'
- స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ

6లో

2047 నాటికి సౌభాగ్యవంతమైన భారత్ అనే కలను సాకారం చేసుకునే దిశగా రాబోయే ఐదేళ్ల కాలం ఒక స్వర్ణయుగమే అవుతుంది. మరో ఐదేళ్లలో ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. ప్రజలకు ఇది 'మోదీ కీ గ్యారంటీ'.

దేశంలో 5జీ టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తోంది. ఇక 6జీ టెక్నాలజీ కోసం భారత్ సన్నద్ధమవుతోంది. ఈ విషయంలో ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది.

-ప్రధాని మోదీ



ఢిల్లీలోని ఎర్రకోటలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎం జగన్ ప్రసంగం

- భౌతికంగా దూరం పెట్టడం ఒక్కటే కాదు.. సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే
- గ్రామ స్వరాజ్యానికి సిసలైన అర్థాన్ని 50 నెలల్లోనే తీసుకొచ్చాం
- పౌర సేవలను ఇంటివద్దే అందించేలా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టాం.. ఎలాంటి అవినీతి, వివక్షకు తావులేకుండా రూ.2.31 లక్షల కోట్లను పారదర్శకంగా పేదలకు అందించాం
- స్వతంత్ర భారత చరిత్రలో మరే ప్రభుత్వానికి సాధ్యం కాని గొప్ప మార్పులను సాకారం చేశాం.. సామాజిక న్యాయం కేవలం నినాదం కాదు.. అది అమలు చేసే విధానమని నిరూపించాం
- 98.5 శాతం వాగ్దానాలను ఇప్పటికే అమలు చేసి ప్రింట్ తీసి మరీ గడప గడపకూ వెళ్లి చెప్పాం.. రాజధానులను మూడు ప్రాంతాల హక్కుగా వికేంద్రీకరణ చేయనున్న ప్రభుత్వం కూడా మనదే
- మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించిన సీఎం జగన్

2లో

అంటరానితనం అంటే ఫలానా వ్యక్తులు తాకటానికి వీల్లేదని భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు.. వారికి అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే.. అలాంటి రూపం మార్చుకున్న అంటరానితనంపై ఈ రోజు మనం యుద్ధం చేస్తున్నాం! పేదలు గెలిచేదాకా, వారి బతుకులు బాగుపడే వరకు ఇది కొనసాగుతుంది. - ముఖ్యమంత్రి వైఎస్ జగన్



విజయవాడలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

నవ చరిత్ర 3లో

కచ్చితత్వం.. పారదర్శకం

ఇక ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ సేవలు

సొసైటీలు, సంస్థలు, వివాహాల రిజిస్ట్రేషన్లను ఆఫీసుకు వెళ్లకుండానే చేసుకునే అవకాశం

వినతులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించిన రిజిస్ట్రేషన్ల శాఖ

త్వరలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు ఆన్‌లైన్‌కు అవకాశం




సాక్షి, అమరావతి: రిజిస్ట్రేషన్ సేవల్లో కచ్చితత్వం, పారదర్శకతను రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా రిజిస్ట్రేషన్ల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించాలని యోచిస్తోంది. ఇప్పటికే కొన్ని సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాగా త్వరలో మరికొన్ని కీలక సేవలను ఆన్‌లైన్ చేయనుంది. గతంలో వివాహాల రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లోనే వివాహ రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేస్తే నిర్దేశిత సమయంలో సర్టిఫికెట్లను ప్రభుత్వం జారీ చేస్తోంది. హిందూ, ఇతర మతాల వివాహాలను ప్రత్యేకంగా రిజిస్టర్ చేసేందుకు వెసులుబాటు కల్పించింది. హిందూ వివాహాల రిజిస్ట్రేషన్ కోసం ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి ఫాం-ఏ పూర్తి చేసి దానితో పాటుగా
మిగతా 5వ పేజీలో ▶

స్టెమీతో గుండె సేఫ్

గుండెపోటు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక

- గ్రామీణ ప్రజలకు గోల్డెన్ అవర్‌లో చికిత్స
- ఉచితంగా రూ.40 వేలు విలువైన థ్రాంబోలైసిస్ ఇంజక్షన్
- ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతిలో అమలు..
- వచ్చే నెలలో గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం జీజీహెచ్‌లలో ప్రారంభం
- గ్రామీణ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు టెలీ–ఈసీజీ
- దానిని పరిశీలించి ఏపీవీవీపీ వైద్యులకు జీజీహెచ్ కార్డియాలజిస్టుల సూచనలు
- అవసరమైన వారికి వెంటనే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్
- రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడేయటమే ప్రధానం.. ఆ తర్వాత తదుపరి వైద్యం కోసం పెద్దాస్పత్రులకు తరలింపు



- వివరాలు 5లో

ఇదండీ సంగతి



ఇటు చూడండి.. భారీగా పెంచాల్సింది ఆయుధాల ఉత్పత్తి కాదా్సర్ ఆహార ఉత్పత్తి!!

అటు చంద్రబాబు... ఇటు పవన్‌కళ్యాణ్. భాగస్వాములిద్దరూ ఒకేరోజు 'విజన్-2047' గురించి మాట్లాడారు. నారా వారు విశాఖలో 'విజన్-2047' అంటూ ఓ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తే... మంగళగిరిలో ఆయన దత్త పుత్రుడు పవన్ సైతం 'ఇదీ నా విజన్-2047' అంటూ చెప్పుకొచ్చారు. విచిత్రమేంటంటే 2014లో ఈ పార్ట్‌నర్స్ ఇద్దరూ కలిసి ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. కానీ గెలిచాక దాన్ని అమలు చేయటం పక్కన బెట్టి... కనీసం ప్రజలక్కూడా కనపడకుండా టీడీపీ వెబ్‌సైట్లోంచి కూడా తీసేశారు. కాకపోతే ఈ మోసానికి తగిన శిక్షే వేశారు జనం. 2019 ఎన్నికల్లో ఇద్దరూ వేరువేరు వేషాలేసుకుని రాగా జనం చీకొట్టి 24 (23+1) సీట్లకు పరిమితం చేశారు. అప్పుడు ఐదేళ్ల మేనిఫెస్టోనే మాయం చేసిన ఈ మోసగాళ్లిద్దరూ ఇప్పుడు 'విజన్-2047'ను ఆవిష్కరిస్తుండటమే విచిత్రమంటూ నవ్విపోతున్నారంతా. ఉప ప్రాంతీయ పార్టీగా మారిపోయిన టీడీపీ అధ్యక్షుడు... 'గ్లోబల్ ఫోరం' అని పెట్టి... 2047 నాటికి ఇండియాను ఎలా తయారు చేస్తానో చెబుతూ ఓ డాక్యుమెంట్‌ను విడుదల చేయటంపై టీడీపీ వర్గాలే విస్తుపోతున్నాయి. బాబు సభలో '2047' ప్రతిజ్ఞ చేసే సమయానికి టీడీపీ నేతలు తప్ప ఏ ఒక్కరూ మిగలకపోవటమే ఆయన విజన్‌పై జనానికున్న నమ్మకానికి ప్రత్యక్ష నిదర్శనం.

భాగస్వాముల విజన్ ఒక్కటే!


- విశాఖలో 'విజన్-2047'ని ఆవిష్కరించిన చంద్రబాబు
- ఇంజినీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలంటూ మతిలేని మాటలు
- కొన్ని గంటల తేడాతో.. మంగళగిరిలో పవన్ నోటా 'విజన్-2047'

2014లో ఇద్దరూ కలిసి ఇచ్చిన మేనిఫెస్టోకు.. ఆ తరవాత మంగళం
దాన్ని టీడీపీ వెబ్‌సైట్లో నుంచి మాయం చేసినా దత్తపుత్రుడు మౌనం
అందుకే 2019 ఎన్నికల్లో ఇద్దరినీ 24 సీట్లకు పరిమితం చేసిన ప్రజలు
ఇప్పుడు మళ్లీ కొత్త విజన్‌తో మోసం చేయడానికి సిద్ధమవుతున్న ద్వయం

2047 నాటికి ఏపీని నంబర్ వన్ చేస్తా

- హైదరాబాద్‌లో స్కూల్ నుంచి వర్సిటీ వరకు నేనే అభివృద్ధి చేశా.. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటే సంక్షేమం పరుగులు పెడుతుంది
- సంస్కరణల వల్ల కోవిడ్‌లోనూ గ్రోత్ వచ్చిన రాష్ట్రం ఇండియా.. ఇంజనీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలి
- ఇండియా విజన్–2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

10లో



ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ
- భవిష్యత్‌లో పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలు తెస్తామని వెల్లడి

10లో



ప్రథమ బహుమతి గెలుచుకున్న పాఠశాల విద్యా శాఖ శకటం



సీఎం చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు



1 ద్వితీయ బహుమతి గెలుచుకున్న వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శకటం



2 మూడో బహుమతి గెలుచుకున్న గ్రామ వార్డు సచివాలయాల శాఖ శకటం





కింద పడిపోయిన మెడల్‌ను తీసి పోలీస్‌కు పిన్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అవగాహన లేక హక్కులు కోల్పోతున్నారు

స్వాతంత్య్ర దిన వేడుకల్లో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



జెండా వందనం చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి/కర్నూలు(సెంట్రల్): నిరక్షరాస్యత, పేదరికం, వెనుకబాటుతనం తదితర కారణాల వల్ల పౌరులకు చట్టాలపై అవగాహన ఉండటం లేదని, దీంతో వారు తమ హక్కులను కోల్పోతున్నారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. చట్టాలపై పౌరులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. న్యాయాన్ని ప్రజలకు దగ్గర చేసేందుకు సైతం ప్రయత్నిస్తున్నామన్నారు. న్యాయ పాలన పరిరక్షణలో న్యాయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని స్పష్టం చేశారు. హైకోర్టు ప్రాంగణంలో 77వ స్వాతంత్య్ర దిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సీజే జస్టిస్ ఠాకూర్ హాజరయ్యారు. జాతీయ జెండాను ఎగుర వేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు పెండింగ్ కేసులు ఓ పెద్ద సమస్య అని, వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, ఢిల్లీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సురేష్ కుమార్ కెయిత్, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి అభినందనీయం

దేశంలో, రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలులోని లోకాయుక్త కార్యాలయంలో స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి, ఐజీ నరసింహారెడ్డి పాల్గొన్నారు. కాగా, కర్నూలులోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు.

మువ్వన్నెల కాంతుల్లో మురిసిన రాష్ట్రం

విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్

- ప్రత్యేక వాహనంలో పరేడ్ పరిశీలన.. ప్రతి ఒక్కరికి చిరునవ్వుతో అభివాదం
- సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన సీఎం
- ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రతిబింబించిన శకటాల ప్రదర్శన
- పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలకు అవార్డుల ప్రదానం



ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: స్వేచ్ఛామారుతంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రతి మదిలో పంద్రాగస్టు సంతోషం ఉప్పొంగింది. గుండెల్లో జాతీయ భావాన్ని నింపుకొని.. గుండెలపై జాతీయ జెండాను పెట్టుకున్నవారితో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మురిసిపోయింది. త్యాగధనుల స్మరణలో.. ప్రజాసంక్షేమ నాయకత్వంలో.. బంగారు భవిష్యత్తు థీమ్‌లో రాష్ట్రంలో 77వ స్వాతంత్య్రదిన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా సాగాయి. త్రివర్ణపతాక రెపరెపల నడుమ సాయుధదళాల కవాతు, దేశభక్తిని నింపిన పోలీసు అందరినీ ఉత్తేజితుల్ని చేశాయి. స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. గ్యాలరీల్లో ఆసీనులైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రత్యేక ఆహ్వానితులకు చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తర్వాత సాయుధదళాల గౌరవ వందనం స్వీకరించారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

వేడుకల్లో 14 ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్రంలో ప్రభుత్వ సేవలను ప్రతిబింబిస్తూ శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అగ్నిమాపక, పాఠశాల విద్య, వైద్యం, అటవీ, పరిశ్రమలు, రెవెన్యూ, గృహనిర్మాణ, సంక్షేమ, మహిళా అభివృద్ధి–శిశుసంక్షేమ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు, వ్యవసాయ, పశుసంవర్ధక, గ్రామ–వార్డు సచివాలయాల శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. పాఠశాల విద్య–సమగ్ర శిక్ష శకటానికి మొదటి బహుమతి దక్కగా వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ–వార్డు సచివాలయాలశాఖ రెండు, మూడు బహుమతుల్ని దక్కించుకున్నాయి.

ఉత్తమ ఫలితాలకు అవార్డులు

ఈ ఏడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం విద్యార్థుల ఉత్తీర్ణతతో పాటు విద్యార్థుల సరాసరి అత్యధిక మార్కులు సాధించిన స్కూళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులను అందజేశారు. సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పార్వతీపురం మన్యం జిల్లా), ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల (భీమునిపట్నం), భద్రగిరిలోని ఏపీ గిరిజన బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల–యూఆర్జేసీ (పార్వతీపురం మన్యం జిల్లా), మంచాల ఏపీ మోడల్ స్కూల్ (అనకాపల్లి జిల్లా), పెద్ద పవని ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (కర్నూలు), వీరఘట్టం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (పార్వతీపురం మన్యం జిల్లా) ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవార్డులను అందుకున్నారు.



వేడుకలను తిలకిస్తున్న సీఎం సతీమణి వైఎస్ భారతీరెడ్డి

దేశభక్తిని చాటిన సాయుధదళాల కవాతు

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సాయుధదళాల కవాతు స్వతంత్ర భారతావని రక్షణ, దేశభక్తిని, అమరవీరుల త్యాగనిరతిని చాటిచెప్పింది. తెలంగాణ రాష్ట్ర 17వ స్పెషల్ పోలీసు బెటాలియన్, ఏపీ ఎన్‌సీసీ బాలబాలికల బృందం పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు, యూత్ రెడ్‌క్రాస్, మాజీ సైనికుల కవాతు ప్రశంసలు అందుకుంది. ఏపీఎస్పీ బ్రాస్ బ్యాండ్, ఫైర్‌బ్రాండ్ బృందాల కళాప్రదర్శన ఆహూతుల్లో స్వాతంత్య్ర ఉద్వేగాన్ని పెంచింది. కవాతులో ఉత్తమ ప్రదర్శనగా సాయుధదళాల విభాగంలో 9వ ఏపీఎస్పీ విజయనగరం బెటాలియన్, ద్వితీయ స్థానంలో 16వ ఏపీఎస్పీ విశాఖ బెటాలియన్ నిలిచాయి. అన్ ఆర్మ్‌డ్ విభాగంలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రథమ స్థానం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి.

స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, మేయర్ భాగ్యలక్ష్మి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఆర్టీఐ ప్రధాన కమిషనర్ ఆర్ఎం బాషా, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: రూపం మార్చుకున్న అంటరానితనం, పేద వర్గాలను అణచివేస్తున్న పెత్తందారీ భావజాలం ధోరణులపై ఈ నాలుగేళ్ల పాలనలో యుద్ధాన్ని ప్రకటించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్ సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగనిరతి, స్వాతంత్య్ర సమరయోధుల బలి దానాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మరే ప్రభుత్వం, రాష్ట్రం చేయని గొప్ప మార్పులు, గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని నాలుగేళ్లలోనే తెచ్చామని చెప్పారు. '76 ఏళ్ల ప్రయాణంలో మన దేశం, రాష్ట్రం ఎంతో పురోగమించాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు కనిపిస్తాయి. ఆర్థిక వ్యవస్థకు మూలమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు లాంటి మూడు రంగాలలో ఎంతో ప్రగతి కనిపిస్తుంది. కానీ అదే సమయంలో ఈ వేగాన్ని అందుకోలేని, అందుకునే అవకాశాలు తగినంతగా లభించని కుటుంబాలు, వర్గాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో ఇంకా వెనకబడే ఉన్నాయి' అని పేర్కొన్నారు. సీఎం జగన్ తన ప్రసంగంలో ఇంకా ఏమన్నారంటే..

రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలం..

అంటరానితనం అంటే కేవలం భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు! పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్నమెంట్ బడిని పాడు పెట్టడం! డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేదల పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేదబిడ్డలు తెలుగు మీడియంలోనే చదవాలని బరితెగించి వాదించటం కూడా అంటరానితనమే! పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ ఉచిత సేవలు అందకుండా చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేట్‌కు విక్రయించాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇంటి స్థలం, ఇంటిని వారికి ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం, చివరికి కోర్టుల్లో రకరకాల కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వటానికి వీల్లేదని అడ్డుకోవటం కూడా అంటరానితనమే! పౌర సేవలు ఏవి కావాలన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల వారు కార్యాలయాలు, కమిటీల చుట్టూ తిరిగేలా వారి సహనాన్ని పరీక్షించటం, అవ్వాతాతలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతన్నలకు ఎరువులు కావాలన్నా పొద్దున్నే లేచి పొడవాటి క్యూల్లో నిలబడి, చివరికి ఆ క్యూ లైన్లలో మనుషులు చనిపోతున్నా పాలకుల గుండెలు కరగకపోవటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలంలో భాగాలే. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అలాగే మిగిలి ఉన్న, రూపం మార్చుకున్న అంటరానితనంపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వం మనది. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఈ యుద్ధం కొనసాగుతుంది.

అంబేడ్కర్ సాక్షిగా..

విజయవాడ నడిబొడ్డున వచ్చే నవంబర్ 26న రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం రోజు మనం ఆవిష్కరించబోతున్న ఒక మహానుభావుడి ఆకాశమంత వ్యక్తిత్వం సాక్షిగా, మనందరికీ కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన మాటలను మీ అందరి ముందు ఉంచుతున్నా. ''భౌతికంగా ఒక మనిషికి సంకెళ్లు లేకపోయినా భావాలపరంగా స్వేచ్ఛ లేకుంటే స్వతంత్రంగా బతుకుతున్నట్లు కాదు. అతడు బానిసగా బతుకుతున్నట్టే. భావాల పరంగా అతడు ఖైదీనే'' అని బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పారు. ఒక మనిషి అస్తిత్వానికి మూలం, స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు అర్థం ఏమిటంటే? ఆలోచనలు, భావాల పరంగా స్వాతంత్య్రం కలిగి ఉండటం. తన అభివృద్ధి, తన కుటుంబం అభివృద్ధికి అవకాశాలు ఉండటం. రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా స్వాతంత్య్రాలను వారు కలిగి ఉండటం.

వికేంద్రీకరణ మన విధానం..

సామాజిక న్యాయం అన్నది కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానమని నిరూపిస్తూ మంత్రి మండలిలో ఏకంగా 68 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. ఆలయ బోర్డులు మొదలు వ్యవసాయ మార్కెట్ కమిటీల వరకు అన్నింటా చట్టం చేసి మరీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం పదవులు ఇచ్చిన తొలి ప్రభుత్వం మనదే. వికేంద్రీకరణను విధానంగా మార్చుకుని రాష్ట్రం ఏర్పడిన తరవాత మరో 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా వికేంద్రీకరణ చేయబోతున్న ప్రభుత్వం కూడా మనదే. ఏకంగా 15 వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయటం ద్వారా వికేంద్రీకరణలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది కూడా మనందరి ప్రభుత్వమే.

తరతరాల పెత్తందారీ సంకెళ్ల నుంచి పేదలు బయట పడి ఎదిగే వాతావరణం ఉండటం. పేద వర్గాలకు అటువంటి భావపరమైన, ఆలోచనల పరమైన స్వేచ్ఛ, స్వాతంత్య్రాలను కల్పించేందుకు త్రికరణ శుద్ధిగా కట్టుబడి ఉన్నాం.

దుష్ట సంప్రదాయాన్ని తుదముట్టించాం

ఎన్నికల సమయంలో ప్రకటించే మేనిఫెస్టోను ఆ తరువాత చెత్తబుట్టలో పడేసే దుష్ట సంప్రదాయాన్ని మనం తుదముట్టించాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఇందులో ఇవి చెప్పాం.. ఇవి చేశాం.. 98.5% వాగ్దానాలను ఇప్పటికే అమలు చేశామని ప్రింట్ తీసి మరీ గడప గడపకూ వెళ్లి చూపిస్తూ ప్రజల ఆశీస్సులు తీసుకుంటున్నాం. అర్హత ఉండి కూడా సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోవటం, వెరిఫికేషన్ సమయంలో అందుబాటులో లేకపోవటం, ఇతరత్రా మరే కారణాలతోనైనా సంక్షేమ పథకాలను అందుకోలేకపోయిన వారందరికీ మళ్లీ అవకాశం కల్పిస్తూ మిగిలిపోయిన వారికీ లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వం దేశ చరిత్రలో మనది మాత్రమే.

ప్రజల అవసరాలు, ప్రగతి లక్ష్యంగా..

గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆర్బీకేలు, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, విలేజ్ క్లినిక్స్, బ్రాడ్ బ్యాండ్ సదుపాయంతో డిజిటల్ లైబ్రరీలు గ్రామాల్లో మన కళ్ల ఎదుటే నిర్మాణంలో ఉన్నాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి ఇది నిదర్శనం. బర్త్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, పెన్షన్, రేషన్, ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితిని తొలగించి ఇంటివద్దే డెలివరీ చేసే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తెచ్చాం. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో 15 పైసలు మాత్రమే లబ్ధిదారులైన ప్రజలకు చేరుతున్నాయని 38 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. 50 నెలల్లో ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావులేకుండా ఏకంగా రూ. 2.31 లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించాం. డీబీటీతో నేరుగా ఖాతాల్లోకి జమ చేశాం. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. మహిళా సాధికారతకు బాటలు వేశాం. సోషల్ ఆడిట్‌ను తప్పనిసరి చేసి పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్నాం.

రాజ్‌భవన్‌లో సందడిగా 'ఎట్ హోం'

- హాజరైన సీఎం వైఎస్ జగన్, భారతి దంపతులు
- హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సహా పలువురు ప్రముఖుల హాజరు



ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులు

సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రముఖులకు విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం తేనీటి విందు ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, గుడియా ఠాకూర్ దంపతులతోపాటు పలు రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్న ఈ తేనీటివిందు సందడిగా సాగింది. స్వాతంత్య్ర దినోత్సవం నాడు రాష్ట్రానికి చెందిన ప్రముఖుల గౌరవార్థం గవర్నర్ 'ఎట్ హోం' పేరిట తేనీటివిందు ఇవ్వడం సంప్రదాయం. సాయంత్రం 5.30గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం మొదలైంది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, గుడియా ఠాకూర్ దంపతులు కొద్దిసేపు సంభాషించుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ అతిథులు అందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయ మూర్తులు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన, చెల్లుబోయిన, జోగి రమేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వాతంత్య్ర సమరయోధులు, పద్మ అవార్డు గ్రహీతలు, వివిధ రంగాల ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.

పోలీసు సేవలకు సలాం

- విధి నిర్వహణలో విశిష్ట సేవలకు గాను పతకాలు అందజేసిన సీఎం జగన్



పతకాలు అందుకున్న పోలీసులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో విశిష్ట సేవలు, ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఏపీ పోలీసులకు మంగళవారం విజయవాడలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎం జగన్ పతకాలు అందజేశారు. 2021, 2022, 2023కు సంబంధించి 65 మంది పోలీసులు కేంద్రం పరిధిలో ప్రకటించిన ప్రెసిడెంట్ పోలీస్ మెడల్(పీపీఎం), పోలీస్ మెడల్ మెరిటోరియస్ సర్వీస్(పీఎం), పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంటరీ (పీఎంజీ), అసాధారణ్ ఆసూచన కుశ లత పదక్‌తో పాటు ముఖ్యమంత్రి శౌర్య పతకాలను అందుకున్నారు.

పీపీఎం 2021–22: భావనాసక్సేనా (జాయింట్ సెక్రటరీ, విదేశాంగ శాఖ, న్యూఢిల్లీ), వెంకటరామిరెడ్డి, (ఐజీపీ–శిక్షణ), పి.సీతారాం(గ్రేహౌండ్స్ కమాండెంట్), ఎస్.సుధాకర్‌రెడ్డి (ఎస్‌డీపీఓ, పలమనేరు)

పీఎం 2021–22: ఎస్వీ రాజశేఖరబాబు (డీఐజీ, లా అండ్ ఆర్డర్), ఎం.రవీంద్రనాథ్‌బాబు(ఏఐజీ, లా అండ్ ఆర్డర్), కె.రఘువీర్‌రెడ్డి(ఎస్పీ, నంద్యాల), కేఎస్‌వీ సుబ్బారెడ్డి(కమాండెంట్, 6 బెటాలియన్), కె.నవీన్‌కుమార్(ఏఎస్పీ, గ్రేహౌండ్స్), కె.సుబ్రహ్మణ్యం (ఏడీసీపీ, విశాఖ), వి.వి.నాయుడు(ఏసీపీ దిశ, విజయవాడ), సీహెచ్.రవికాంత్ (ఏసీపీ, ఎస్‌బీ విజయవాడ), జి.రవికుమార్(డీఎస్పీ, సీఐడీ), కె.వి.రాజారావు, (డీఎస్పీ పీటీఓ), జె.శ్రీనివాసులురెడ్డి (ఎస్‌డీపీఓ, నెల్లూరు), వి.శ్రీరాంబాబు(డీఎస్పీ, సీఐడీ), కె.విజయపాల్ (ఎస్‌డీపీఓ, రాజమండ్రి), సి.శ్రీనివాసరావు (డీఎస్పీ దిశ, ప్రకాశం), జి.వీరరాఘవరెడ్డి (ఎస్‌డీపీఓ, మార్కాపురం), వై.రవీంద్రరెడ్డి (ఏఆర్ డీఎస్పీ, తిరుపతి), పి.వి.హనుమంతు(అసిస్టెంట్ కమాండెంట్, 6వ బెటాలియన్), బి.విజయ్‌కుమార్ (అసిస్టెంట్ కమాండెంట్, గ్రేహౌండ్స్), బి.గుణరాము (సీఐ, విజయవాడ), ఎం.కోటేశ్వరరావు (ఎస్ఐ, శ్రీకాకుళం), జి.కృష్ణారావు(ఎస్ఐ, విజయవాడ), ఆర్.రామనాథం, (ఆర్ఎస్ఐ, విజయవాడ), ఇ.శివశంకర్‌రెడ్డి (ఆర్ఎస్ఐ, 2వ బెటాలియన్), ఎం.వెంకటేశ్వర్లు(ఏఆర్ఎస్ఐ, నెల్లూరు), ఎస్.సింహాచలం (ఏఆర్ఎస్ఐ, 3వ బెటాలియన్), టి.నరేంద్రకుమార్ (ఏఎస్ఐ, గుంటూరు), పి.భాస్కర్(ఏఎస్ఐ, కడప), ఎన్.శ్రీనివాస్(ఏఎస్ఐ, కొవ్వూరు), ఎస్.వీరాంజనేయులు(ఏఎస్ఐ, విజయవాడ).

పీఎంజీ 2021: ఆర్.రాజశేఖర్ (డీఏసీ), సీహెచ్.సాయిగణేశ్ (డీఏసీ), కె.పాపినాయుడు (ఎస్ఐ, అనకాపల్లి), డి.మబాషా (ఏఏసీ), టి.కేశవరావు(హెచ్‌సీ, ఎస్ఐబీ), ఎం.మునేశ్వరరావు (గ్రేహౌండ్స్ ఎస్పీ), గ్రేహౌండ్స్ జేసీల్లో ఎస్.బుచ్చిరాజు, జి.హరిబాబు, బి.చక్రధర్, ఎం.నాని, పి.అనిల్ కుమార్.

అసాధారణ్ ఆసూచన కుశలత పదక్ 2022: సి.శ్రీకాంత్ (ఐజీపీ, సీఐడీ), ఎ.బాబ్జీ (ఎస్ఐబీ, ఎస్పీ), ఇ.జి.అశోక్ కుమార్(ఏఎస్పీ, ఎస్ఐబీ), ఎ.వెంకటరావు(డీఎస్పీ, తీవ్రవాద విభాగం, విశాఖ), కె.నిరీక్షణరావు(ఎస్ఐ, ఎస్ఐబీ).

ముఖ్యమంత్రి శౌర్య పతకం(2023): బి.సుధాకర్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్), కె.విజయశేఖర్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్ఐబీ), కె.హరీష్ (ఆర్ఎస్ఐ), పి.రమేశ్(ఆర్ఎస్ఐ, ఎస్ఐబీ), టి.రవికుమార్(ఎస్ఐ, గ్రేహౌండ్స్), గ్రేహౌండ్స్ ఆర్ఎస్ఐలు టి.సత్యనారాయణ, పి.సతీశ్‌కుమార్, సీహెచ్.శివ, గ్రేహౌండ్స్ ఏఎస్పీలు శ్యామలరావు, రవి, నాగరాజు, గ్రేహౌండ్స్ జేసీలు ఎస్‌కే కరీం బాషా, బి.వాసుదేవ రెడ్డి, సయ్యద్ హబీబుల్లా, ఎస్.సిద్ధయ్య, ఎం.గౌరునాయుడు.

క్లుప్తంగా...

ప్రధానితో పొందూరు వాసి ముచ్చట



ప్రధానితో ముచ్చటిస్తున్న సూర్యకాంతం

పొందూరు: ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన ఖాదీ కార్మికులు బల్ల భద్రయ్య-లక్ష్మి దంపతులు, జల్లేపల్లి సూర్యకాంతం హాజరయ్యారు. వీరిలో జల్లేపల్లి సూర్యకాంతంతో ప్రధాని మోదీ కాసేపు ముచ్చటించారు. ప్రత్యేక గ్యాలరీలో కూర్చొన్న వీరిని అధికారులు ప్రధానికి పరిచయం చేస్తున్న సమయంలో ప్రధాని ఖాదీ కార్మికురాలు సూర్యకాంతంను ఆప్యాయంగా పలకరించి ఖాదీ ప్రత్యేకతపై కాసేపు మాట్లాడారు.

'ప్రకృతిని దైవంగా భావిస్తే పచ్చని ప్రపంచం సాధ్యం'

సాక్షి, అమరావతి: రాష్ట్ర అవృద్ధిలో పర్యావరణానిదీ ప్రధాన పాత్ర ఉందని కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యదర్శి బి.శ్రీధర్ అన్నారు. సమర్థవంతమైన పర్యావరణ నిర్వహణతో ఆర్థిక వృద్ధి పెంపొందించడమే ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన ఉద్దేశమన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజవాయడలోని ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అధిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ.. పర్యావరణ విధానాలు చట్టాలు, నిబంధనలు సమర్థవంతంగా అమలు చేసి సకల జీవరాశులకు మానవాళికి ఆవాసమైన భూమాత పట్ల గౌరవాన్ని, బాధ్యతను కలిగి ఉండాలన్నారు. ప్రకృతిని దైవంగా భావించినప్పుడే కాలుష్యరహిత పచ్చని ప్రపంచాన్ని చూడగలమని, అందుకోసం అందరూ పాటుపడాలని పిలుపు విచ్చారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ టివిఎస్‌జీ కుమార్, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎస్.వి.భాస్కరరావు, జోనల్ ఆఫీస్ అధికారి బి.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో స్వాతంత్య్ర దిన వేడుకలు



ఏపీ భవన్‌లో జెండా వందనం చేస్తున్న ఆదిత్యనాథ్ దాస్, హిమాన్షు కౌశిక్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మంగళవారం 77వ స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవన్ నలువైపులా మువ్వన్నెల జెండాలతో, ఎలక్ట్రిక్ బల్బులతో అలంకరించారు. ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ (పీఆర్ సీ) ఆదిత్యనాథ్ దాస్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ (ఏ.ఆర్.సీ) హిమాన్షు కౌశిక్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సీఎం జగన్ పాలన



జెండా వందనం చేస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలి, శాసనసభ ప్రాంగణాల్లో మంగళవారం స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. శాసనమండలి ప్రాంగణంలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ తమ్మినేని సీతారామ్ జాతీయ జెండాలను ఎగురవేశారు. వారు తొలుత ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రజలకు, వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన భారతరాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతో చక్కగా జరుగుతోందని అభినందించారు. స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ స్వాతంత్య్ర ఫలాలను రాష్ట్రంలోని నిరుపేద ప్రజలందరికీ అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు వినూత్న పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామ సచివాలయాలతో పాటు రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళా సాధికారత, స్వావలంబన కోసం పలు మహిళా సంక్షేమ, అభివృద్ధి పథకాలను కూడా అమలు చేస్తున్నారన్నారు. శాసనసభ సెక్రటరీ జనరల్ రామాచార్యులు, అసెంబ్లీ చీఫ్ మార్షల్, శాసనమండలి, శాసనసభ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడల

ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం..

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఎగిరిన జాతీయ జెండా

స్వాతంత్య్ర పోరాట యోధులకు నివాళులు

త్రివర్ణ పతాక రెపరెపలు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం స్వాతంత్ర్యదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, ఇతర స్వాతంత్య్ర పోరాట వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వతంత్ర పోరాటం గురించి, ఇన్నేళ్లలో సాధించిన ప్రగతి గురించి పలువురు ప్రసంగించారు. మిఠాయిలు పంచి పరస్పరం అభినందించుకున్నారు.

సీఎం క్యాంప్ ఆఫీస్‌లో..



సీఎం క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం జాతీయ జెండా ఎగురవేశారు. ముఖ్యమంత్రి జగన్ అదనపు కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణసంస్థ ప్రధాన కార్యాలయంలో..

విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, సచివాలయాల విభాగం డైరెక్టర్ లక్ష్మీషా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సచివాలయాల విభాగం అదనపు డైరెక్టర్‌లు ధ్యానచంద్ర, భావన వశిష్ట పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు అభివృద్ధి, సంక్షేమం: సీఎస్ జవహర్‌రెడ్డి



రాష్ట్ర సచివాలయం మొదటి భవనం వద్ద రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికి స్వాతంత్య్ర ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పేదల సంక్షేమానికి.. ముఖ్యంగా పేదరిక నిర్మూలనకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. ఈ పథకాలు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పేదవానికి సక్రమంగా అందించడంలో మనమంతా చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణమూర్తి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రావిరెడ్డి, జీఏడీ డిప్యూటీ సెక్రటరి రామసుబ్బయ్య, పలువురు సచివాలయ అధికారులు, సిబ్బంది, ఎస్పీఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో..

విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు, ఈడీలు కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి, ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌధలో..

విజయవాడలోని విద్యుత్ సౌధలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఏపీ జెన్‌కో ఎండీ కె.వి.ఎస్.చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి, జెన్‌కో విజిలెన్స్ ఆఫీసర్ పనసరెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో వంద అడుగుల ఎత్తైన జాతీయ పతాకం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

జిల్లా కేంద్రం తిరుపతిలోని సామవాయి మార్గంలో వంద అడుగుల ఎత్తైన జాతీయజెండాను ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో కలిసి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో శ్రీనివాససేతు వారధిని సెప్టెంబర్ 18న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తారని చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల జాతీయ పతాకం

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లాలో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు వెయ్యి అడుగుల జాతీయ పతాకాన్ని తమ కళాశాల వద్ద జాతీయ రహదారి వెంట ప్రదర్శించారు. – ఒంగోలు



వెయ్యి అడుగుల జాతీయ పతాకాన్ని జాతీయ రహదారి వెంట ప్రదర్శిస్తున్న పేస్ విద్యార్థులు

సాగరగర్భంలో..

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రుషికొండ బీచ్‌లో లివిన్ అడ్వెంచర్స్ డైరెక్టర్ బలరామ్ నాయుడు ఆధ్వర్యంలో స్కూబా డైవింగ్ వారు 60 అడుగుల సముద్రగర్భంలో జాతీయ జెండాను ఎగురవేశారు. – కొమ్మాది



సముద్ర గర్భంలో జాతీయ జెండా రెపరెపలు

విజయవాడ రైల్వేస్టేషన్‌లో క్లీన్ ఇండియా–న్యూ ఇండియా సెల్ఫీ పాయింట్



విజయవాడ రైల్వే స్టేషన్‌లో జెండా వందనం

విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ జాతీయ జెండాను ఎగురవేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'క్లీన్ ఇండియా–న్యూ ఇండియా' సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎమ్.శ్రీకాంత్, సీనియర్ డీపీవో బాలమురళీధర్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, ఏసీఎం డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో స్విమ్మర్ల జెండా వందనం



కృష్ణానదిలో జాతీయ జెండాకు వందనం చేసిన స్విమ్మర్లు

కృష్ణాజిల్లా నాగాయలంకలోని శ్రీరామ పాద క్షేత్రం ఘాట్ వద్ద గ్రామానికి చెందిన కొందరు స్విమ్మర్లు కృష్ణానదిలో జాతీయ పతాకానికి వందనం సమర్పించారు. రేమాల చంటి, వేములపల్లి ప్రసాద్, సనకా మురళి, తలశిల రఘుశేఖర్ తదితరులు పాల్గొన్నారు. – నాగాయలంక

నవ చరిత్ర

ఆరు ప్రధాన రంగాలలో నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు: సీఎం జగన్

- వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, పారిశ్రామిక, సంక్షేమం–సాధికారతలో అగ్రపథం
- 2025 నాటికి పోలవరం, 2024కు తోటపల్లి, తారకరామ తీర్థ సాగర్ పనులు పూర్తి
- ప్రపంచంతో పాటు అడుగులు ముందుకు వేసేలా మన విద్యా విధానం
- వైద్య, ఆరోగ్య రంగంలో ఏకంగా 53 వేలకుపైగా పోస్టుల భర్తీ
- అక్కచెల్లెమ్మల కోసం చట్టంలో మార్పులు, కొత్త చట్టాలు
- నామినేటెడ్ పదవులతో సామాజిక న్యాయానికి సిసలైన అర్థం
- పారిశ్రామిక ప్రోత్సాహకాలతో దేశంలోనే నంబర్ వన్‌గా రాష్ట్రం

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో వందేళ్లుగా సాధ్యం కాని భూముల సర్వే లాంటి బృహత్తర కార్యక్రమాలను సైతం నాలుగేళ్లలోనే సాకారం చేసినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నవరత్నాల పథకాల ద్వారా గత 50 నెలల్లో డీబీటీతో పేదలకు రూ.2.31 లక్షల కోట్లను ఎక్కడా లంచాలు, వివక్షకు చోటు లేకుండా పూర్తి పారదర్శకంగా అందించినట్లు చెప్పారు. పలు రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవాల్లో పాల్గొన్న సీఎం జగన్ గత నాలుగేళ్లలో ఆరు ప్రధాన రంగాల్లో తెచ్చిన మార్పులను వివరించారు.

వ్యవసాయం..

రాష్ట్రంలో 52 లక్షల మంది రైతన్నలకు ఏటా రూ.13,500 చొప్పున రైతు భరోసా పెట్టుబడి సాయం అందిస్తున్నాం. ఆర్బీకే స్థాయిలో ఈ క్రాప్, ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నాం. పంట నష్టపోతే సీజన్ ముగిసేలోగానే రైతులకు పరిహారం అందిస్తున్నాం. వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు నాణ్యమైన ఉచిత కరెంట్‌తోపాటు ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే ఇస్తున్నాం. పాలవెల్లువ ద్వారా అదనంగా ఆదాయాన్ని సమకూర్చాం. మూతపడిన చిత్తూరు డెయిరీ సహా సహకార సంఘాలకు జీవం పోశాం. వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి భూ వివాదాలకు శాశ్వతంగా పరిష్కారం చూపుతున్నాం. అసైన్డ్ భూములపై సాగుదారులకు పూర్తి హక్కులు కల్పించాం. వీరిలో ఎస్సీ, బీసీ వర్గాల వారే ఎక్కువగా ఉన్నారు. 1.54 లక్షల మంది ఎస్టీ రైతులకు 3.23 లక్షల ఎకరాలను డీకేటీ, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలుగా ఇచ్చాం. చుక్కల భూముల జాబితా నుంచి 1.07 లక్షల రైతులకు చెందిన 2.06 లక్షల ఎకరాల భూముల్ని తొలగించాం. షరతులు గల పట్టాలు కలిగిన మరో 22 వేల మంది రైతులకు 33 వేల ఎకరాలపై పూర్తి హక్కులు కల్పించాం.

వడివడిగా ప్రాజెక్టులు..

గత ప్రభుత్వంలో మాదిరిగా ఫలితాలు లేకుండా, ఇష్టారాజ్యంగా ఖర్చుపెట్టకుండా జలయజ్ఞం ప్రాజెక్టులన్నీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ, అవుకు టన్నెల్ పూర్తి చేశాం. పులిచింతల, గండికోట, చిత్రావతి, పైడిపాలెం, బ్రహ్మం సాగర్ రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని నింపగలుగుతున్నాం. కాలువల సామర్థ్యం పెంచటంతోపాటు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వెలిగొండలో మొదటి టన్నెల్‌ను మనమే పూర్తి చేయగా రెండో టన్నెల్ పనులు మరో రెండు నెలల్లో పూర్తికానుంది. ఉత్తరాంధ్రలో వంశధార ఫేజ్–2, వంశధార–నాగావళి నదుల అనుసంధానం పనులను పూర్తి చేసి డిసెంబర్ కల్లా ప్రారంభించనున్నాం. తోటపల్లి, తారకరామ తీర్థ సాగర్ పనులు 2024కి పూర్తి చేయనున్నాం. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు, సాంకేతిక సమస్యలన్నింటినీ అధిగమించి వడివడిగా పనులు చేపట్టాం. ఈ ప్రాజెక్టును 2025 జూన్ నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ఏటా దాదాపు 83 లక్షల మంది పిల్లలకు మంచి చేస్తూ అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నాం. నాడు–నేడుతో 45 వేల ప్రభుత్వ బడుల రూపురేఖల్ని మారుస్తున్నాం. ఇంగ్లిష్ మీడియం, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలు పిల్లలకు అందజేస్తున్నాం. ప్రత్యేకంగా ఆడపిల్లల కోసం ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ ఏర్పాటు చేశాం. 3వ తరగతి నుంచే టోఫెల్‌కు శిక్షణ ఇచ్చేలా ఈటీఎస్ ప్రిన్స్‌టన్‌తో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాం. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేస్తున్నాం. బైజూస్ కంటెంట్‌ను ఉచితంగా ఇచ్చాం. ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్నాం. రోజుకో మెనూతో గోరుముద్ద రుచికరంగా అందిస్తున్నాం. రూ. 20 వేల వరకు వసతి దీవెన ఇస్తున్నాం. ప్రపంచ స్థాయిలో టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న దాదాపు 330 కాలేజీల్లో, 21 ఫ్యాకల్టీల్లో సీటు తెచ్చుకున్న పిల్లలకు రూ.1.25 కోట్ల వరకూ విదేశీ విద్యా దీవెన ఇస్తున్నాం. డిగ్రీ కరిక్యులమ్‌ను జాబ్ ఓరియంటెడ్‌గా మార్పు చేశాం. నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులను తీసుకొచ్చాం. 10 నెలల ఇంటర్న్‌షిప్ విధానాన్ని తెచ్చాం. వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 3,295 టీచింగ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాం. ఏఐ, మెషిన్ లెర్నింగ్, వర్చువల్ రియాల్టీ, ఆగ్‌మెంటెడ్ రియాల్టీ సహా ప్రతి మార్పును విద్యారంగంతో అనుసంధానిస్తూ ప్రపంచంతో పాటు అడుగులు వేస్తున్నాం.

అందరికీ వైద్యం, ఆరోగ్యం

వందేళ్ల చరిత్రలో రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా ఈ 50 నెలల్లోనే ఏకంగా 17 కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. 108, 104 సేవల కోసం మరో 1,514 వాహనాలను కొనుగోలు చేశాం. తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌తో కలిపి ఏకంగా 2,204 వాహనాలను నడుపుతున్న ఏకైక రాష్ట్రం మనది మాత్రమే. రికార్డు స్థాయిలో 53,126 వైద్య సిబ్బంది నియామకాలు జరిపాం. స్పెషలిస్టు డాక్టర్లు దొరక్క జాతీయ స్థాయిలో 61 శాతం పోస్టులు ఖాళీగా ఉంటే రాష్ట్రంలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ల ద్వారా 96.04 శాతం స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేశాం. జాతీయ స్థాయిలో 27 శాతం నర్సులు, 33 శాతం ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలేస్తే మన రాష్ట్రంలో 100 శాతం పోస్టుల్ని భర్తీ చేశాం. గతంలో ప్రమాణాలు లేని 292 రకాల మందులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటే ఈ రోజు ఏకంగా 562 రకాల డబ్ల్యూహెచ్ఓ, జీఎంపీ ప్రమాణాలు కలిగిన నాణ్యమైన ఔషధాలను అందుబాటులోకి తెచ్చాం. 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 560 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశాం. ప్రతి విలేజ్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు గ్రామస్థాయిలోనే అందిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నాం. ప్రివెంటివ్ కేర్‌లో ఇది నూతన అధ్యాయం. 95 శాతం జనాభాను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవడంతోపాటు ప్రొసీజర్లను 3255కి విస్తరించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు రూ.5 వేల వరకూ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా సాయం చేస్తున్నాం.

సామాజిక మార్పులు

మంత్రి మండలిలో 68 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చాం. శాసన సభ స్పీకర్‌గా బీసీకి, మండలి చైర్మన్‌గా ఎస్సీకి,మండలి డిప్యూటీ చైర్మన్‌గా మైనార్టీ మహిళకు అవకాశం కల్పించాం. నామినేటెడ్ పోస్టుల్లో చైర్మన్లుగా, డైరెక్టర్లుగా 50 శాతం పదవులను చట్టం చేసి మరీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించాం. నామినేషన్ కాంట్రాక్టుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు దక్కేలా చట్టం చేశాం. 139 బీసీ కులాలకు 56 ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. శాశ్వత బీసీ కమిషన్‌ను నియమించిన తొలి రాష్ట్రంగా నిలిచాం. మాల, మాదిగ, రెల్లి కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశాం. గత 50 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీతో పేదలకు రూ.2.31 లక్షల కోట్లను పారదర్శకంగా అందించగా, అందులో ఏకంగా 76 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే లబ్ధి చేకూరింది. గతంలో ఎన్నడూ చూడని విధంగా 2,06,638 శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. వీరిలో 80 శాతం ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలే.

మహిళా సాధికారతకు పెద్దపీట..

నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ కాంట్రాక్టుల్లో 50 శాతం చట్టం చేసి మరీ అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నాం. అమ్మ ఒడితో 44 లక్షల తల్లులకు ఏటా రూ.15 వేలు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, కల్యాణమస్తు–షాదీ తోఫా వంటి పథకాలను అందిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా ద్వారా పొదుపు సంఘాల ఉద్యమానికి మళ్లీ ఊపిరిపోసి 99.67 శాతం రుణాల రికవరీతో, దేశంలోనే అక్కచెల్లెమ్మలు అగ్రగామిగా నిలబడేలా ఆర్థిక సాధికారతకు సహకరించాం. వైఎస్సార్ చేయూత ద్వారా 26.39 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు రూ.14,129 కోట్లు సహాయం అందించాం. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం కూడా ఇస్తున్నాం. అక్కచెల్లెమ్మల పేరుతో 30 లక్షలకుపైగా ఇళ్ల పట్టాలు అందజేశాం. తొలిదశలో 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వ్యవస్థ నెలకొల్పాం. ఇప్పటివరకు 1.24 కోట్ల మంది దిశ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోగా 30,369 మందిని అత్యవసర సమయంలో ఆదుకున్నాం. సచివాలయాల్లో దాదాపు 15 వేల మంది మహిళా పోలీసుల్ని తీసుకువచ్చాం. 60 శాతం మంది వలంటీర్లు మన ఆడపిల్లలే ఉన్నారు.


మూడేళ్లుగా మనమే నంబర్ వన్



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరసగా మూడేళ్లుగా మన రాష్ట్రమే దేశంలో నంబర్ వన్ స్థానంలో ఉంది. రాష్ట్ర విభజన నాటికి కేవలం నాలుగు చోట్ల మాత్రమే పోర్టులు ఉండగా ఈ నాలుగేళ్లలోనే మరో నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపట్టాం. మరో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నాం. విశాఖలో ఇప్పటికే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు ప్రారంభించాం. కర్నూలు ఎయిర్‌పోర్టును ప్రారంభించాం. కడప విమానాశ్రయాన్ని విస్తరించాం. దేశంలో నిర్మిస్తున్న 11 పారిశ్రామిక కారిడార్లలో మూడు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. గతంలో ఏనాడూ మన రాష్ట్రానికి రాని పారిశ్రామిక దిగ్గజాలు ఈ నాలుగేళ్లలోనే వచ్చారు. 2019 జూన్ నుంచి నేటి వరకు రాష్ట్రంలో నెలకొల్పిన భారీ పరిశ్రమలు 127. వచ్చిన పెట్టుబడులు రూ.67,196 కోట్లు. ప్రత్యక్ష ఉద్యోగాలు 84,607. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ఏకంగా రూ.13.42 లక్షల కోట్ల మేర ఎంవోయూలు కుదిరాయి. తద్వారా రానున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు 6 లక్షలు. కొత్తగా ప్రారంభమైన ఎంఎస్ఎంఈ యూనిట్లు 2,00,995. ఉద్యోగాలు, ఉపాధి పొందినవారు 12.61 లక్షలు. కోవిడ్ విసిరిన పెను సవాళ్లను తట్టుకుని మన రాష్ట్ర పారిశ్రామిక ర్యాంకును, ముఖ్యంగా ఎంఎస్ఎంఈని రక్షించుకోగలిగాం. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందిస్తున్నాం. తమ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టాలని స్థానికులే ఆహ్వానించేలా, తద్వారా 75 శాతం ఉద్యోగాలదను స్థానికులకు కేటాయించింది మన ప్రభుత్వమే.

విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం



వైఎస్సార్‌సీపీ కేంద్రకార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న విజయసాయిరెడ్డి, తదితరులు

సాక్షి, అమరావతి: వేర్పాటువాద శక్తులను బలపరుస్తున్న విపక్షాల కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి అన్నారు. సీఎం జగన్ దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దేశ భక్తి కలిగిన పార్టీ అని.. దేశం కోసం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొని.. స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం. వారి త్యాగాలను మర్చిపోకూడదు. మనకు దక్కిన స్వాతంత్య్రాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది' అని అన్నారు. శాసన మండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. ఎందరో మహానుభావులు ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి, దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చారని చెప్పారు. వారితో పాటు దేశ సరిహద్దుల్లో ప్రాణాలర్పిస్తున్న జవాన్ల సేవలను కూడా ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో తాడేపల్లి నుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హిమాలయాలలో స్వాతంత్ర వేడుకలను నిర్వహిస్తున్న రజనీకాంత్

హిమాలయాల్లో సూపర్ స్టార్ స్వాతంత్య్ర వేడుకలు

చెన్నై: రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం జైలర్ ఈనెల 10న విడుదలై వసూళ్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. కాగా తాను నటించిన చిత్రం విడుదల సమయంలో హిమాలయాలకు వెళ్లడం రజనీకాంత్ ఆనవాయితీ. నాలుగేళ్లుగా అనివార్య కారణాల వల్ల ఆయన హిమాలయాలకు వెళ్లలేదు. జైలర్ చిత్రం విడుదల సందర్భంగా ఈ నెల 9న ఆయన హిమాలయాలకు పయనమయ్యారు. అక్కడ ద్వారకా, రిషికేష్ లాంటి పవిత్రమైన స్థలాలను సందర్శిస్తున్నారు. తన ముగ్గురు మిత్రులతో కలిసి వారం పాటు ధ్యానం, యోగ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దయానంద సరస్వతి ఆశ్రమాన్ని, బాబా ఆశ్రమాన్ని సందర్శించారు. రజినీకాంత్ తన మిత్రులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ నెల 17న ఆయన చెన్నైకి తిరిగి రానున్నారు.



నువ్వు మరొకరి కోసం దీపాన్ని వెలిగిస్తే,
అది నీ దారినీ కాంతిమంతం చేస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 16 ఆగస్టు 2023

ప్రక్షాళన అవసరమే కానీ...

ఎప్పుడో 19వ శతాబ్దంలో తొలిసారిగా చట్టంగా రూపుదాల్చిన భారత నేరసంహితను సమూలంగా మార్చేందుకు ఒక అడుగు ముందుకు పడింది. భారత క్రిమినల్ న్యాయ వ్యవస్థను మారుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆగస్ట్ 11న లోక్‌సభలో మూడు కొత్త బిల్లుల్ని ప్రవేశపెట్టింది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) –1860 స్థానంలో 'భారతీయ న్యాయ సంహిత', తొలిసారిగా 1898లో చట్టమై ఆనక కొద్దిగా మార్పులు జరిగిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) – 1973 బదులు 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ – 1872 స్థానంలో 'భారతీయ సాక్ష్య బిల్లు' రానున్నాయి. మధ్యలో కొద్ది మినహా గణనీయమైన మార్పులేమీ చేయని భారత సర్కార్ 160 ఏళ్ళ పైచిలుకు క్రితం బ్రిటీషు వారి చట్టాలను సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మార్చాలను కోవడం సహేతుకమే. అయితే, కొత్త బిల్లుల్ని తీసుకొచ్చే ముందు న్యాయనిపుణులతో, ప్రతిపక్షాలతో ఎంత లోతుగా చర్చించారు? ఇది ప్రశ్నార్థకం. ఈ పరిస్థితుల్లో 3 బిల్లుల్నీ సమీక్షించి, సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం వాటిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపడం స్వాగతనీయం.

బిల్లుల్లోని అంశాలపై ప్రజలతో సంప్రతింపులు జరిపి, సిఫార్సులు చేసేందుకు కరోనా కాలంలో 2020 మేలో ప్రభుత్వం నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ సంప్రతింపుల ప్రక్రియ విధి విధానాలు అయోమయమే. వచ్చిన అభ్యర్థనల్ని పరిశీలించి, విశ్లేషించడానికి సదరు నిపుణుల సంఘం ఏ పద్ధతిని అనుసరించిందీ తెలీదు. ఆ నిపుణుల సంఘం ప్రభుత్వానికి ఇచ్చిన సిఫార్సుల్ని ప్రజాక్షేత్రంలో పెట్టనేలేదు. వచ్చిన సిఫార్సులకూ, ప్రభుత్వం బిల్లుల్లో పెట్టిన అంశాలకూ పొంతన ఉండివుండదని కూడా నిపుణుల మాట. ఇన్ని లోపాలున్నాయి గనకే కొత్త బిల్లుల సామర్థ్యం సందేహాస్పదం. బ్రిటీషు పాలనా అవశేషాలను తొలగించడమే ధ్యేయమంటూ మోదీ సర్కార్ చెబుతున్న మాటలకూ, కొత్త చట్టాల్లో నిజంగా ఉన్న అంశాలకూ మధ్య ఎంత పొంతన ఉందో చెప్పలేం. క్రిమినల్ న్యాయ వ్యవస్థకు ఈ ప్రక్షాళన సర్వరోగ నివారణి అంటున్నా అదీ అనుమానమే. ఎందుకంటే, పాత చట్టాల్లోని అనేక అంశాలు యథాతథంగా ఈ కొత్త బిల్లుల్లోనూ చోటుచేసుకున్నాయి. కొన్ని మార్పులు ప్రతిపాదించారు కానీ, అవి వ్యవస్థలోని సంక్షోభంపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో చెప్పలేం. పైపెచ్చు, కొత్త బిల్లులు ప్రతిపాదించిన కొన్ని మార్పులు ఆందోళన రేపుతున్నాయి.

పాత రాజద్రోహ చట్టాన్ని తొలగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. నిజానికి, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులపై తరచూ దుర్వినియోగమవుతున్న ఈ చట్టానికి గత ఏడాది మేలోనే సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేసి, సమీక్షను పెండింగ్‌లో పెట్టింది. లా కమిషన్ మాత్రం ఐపీసీలో రాజద్రోహానికి సంబంధించిన 'సెక్షన్ 124ఏ'ను కొనసాగించాలనీ, శిక్షను పెంచాలనీ రెండునెలల క్రితం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ సెక్షన్‌ను తొలగించాలని సర్కార్ నిర్ణయించడం ఆశ్చర్యమే. లార్డ్ మెకాలే 1837లో రూపకల్పన చేయగా, 1862లో అమలులోకి వచ్చిన ఐపీసీలో రాజద్రోహ చట్టం లేదు. 1870లో దాన్ని చేర్చి, స్వాతంత్ర్య సమరాన్ని అణిచేసేందుకు విస్తృతంగా వినియోగించారు. 1898లో పరిధిని విస్తరించారు. స్వాతంత్ర్యం వచ్చాకా ఈ చట్టం కొనసాగుతూ వచ్చింది. దాని రాజ్యాంగబద్ధతపై కోర్టులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. కొత్త బిల్లులో రాజద్రోహమనే పేరు తొలగించినా, సార్వభౌమాధికారానికి హానికారక చర్యలు శిక్షార్హమంటూ కొత్త మాట తగిలించారు. ఏ చర్యలు ఈ నేరమనేది స్పష్టత లేనందున పోలీసుల ఇష్టారాజ్యపు అరెస్టులకు అధికారం దఖలు పడుతోంది. అలాగే, ఇప్పటి దాకా ఐపీసీలో లేని వ్యవస్థీకృత నేరం, తీవ్రవాద నేరాలు, మూకదాడి లాంటివీ కొత్తగా చేర్చారు. వివాదాస్పద 'ఉపా' చట్టం నుంచి తీసుకున్నవీ ఇందులో ఉండడం విషాదం.

అలాగే, సీఆర్‌పీసీ కింద అరెస్టయిన వ్యక్తిని గరిష్ఠంగా 15 రోజులే పోలీస్ కస్టడీలో ఉంచవచ్చు. కొత్త చట్టంలో చేసిన నేరాన్ని బట్టి 60 నుంచి 90 రోజుల దాకా కస్టడీని పొడిగించవచ్చు. ఇదీ దుర్వినియోగమయ్యే ముప్పుంది. అయితే ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఎఫ్ఐఆర్ నమోదు అవకాశమివ్వడం, పోలీసు సోదా – స్వాధీనాల వేళ తప్పనిసరి వీడియో రికార్డింగ్ లాంటివి బాధితుల హక్కుల్ని కాపాడతాయి. ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాల్ని వినియోగిస్తూ, ఫోరెన్సిక్స్‌కు పెద్ద పీట వేయడం బాగానే ఉన్నా, ఆ సాక్ష్యాల సేకరణ, విశ్లేషణ, వాటిని కోర్టుల్లో వినియోగించే తీరుపై స్పష్టత లేదు. విచారణతోనే జైళ్ళలో మగ్గుతున్న జనం, క్రిక్కిరిసిన జైళ్ళ లాంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దిశగా ఆలోచించ లేదు. బెయిల్ నిర్ణయంలో చేపట్టాల్సిన సంస్కరణల్ని పట్టించుకోలేదు.

ప్రస్తుతం మన కోర్టుల్లో 4.7 కోట్లపైగా కేసులు పెండింగ్‌లో ఉంటే, మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులే. క్రిమినల్ న్యాయవ్యవస్థలో సంస్కరణలపై జస్టిస్ మలిమత్ కమిటీ తన నివేదికను సమర్పించి రెండు దశాబ్దాలు దాటింది. 2007లో మాధవ్ మీనన్ కమిటీ సహా అనేకం వచ్చాయి. చివరకిప్పుడు రథం కదిలింది. కానీ, ఇంగ్లీష్ పేర్లు తీసేసి సంస్కృత, హిందీ పేర్లు పెట్టి, కొత్త సీసాలో పాత సారా నింపితే లాభం లేదు. దశాబ్దాల తర్వాతి ఈ ప్రయత్నమూ చిత్తశుద్ధి లోపించి, అసంతృప్తినే మిగిలిస్తే అంతకన్నా అన్యాయం లేదు. కొత్త చట్టాలకు సర్కార్ మరింత కసరత్తు చేయాలి. పార్లమెంట్‌లో క్షుణ్ణంగా చర్చించాలి. నేరన్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమే కానీ, వట్టి చట్టాలు మారిస్తే సరిపోదు. వ్యవస్థకూ, పౌరులకూ మధ్య బంధంలో మార్పు తేవాలి. అప్పుడే వలసవాద వాసనలు వదులుతాయి. అలాకాక ఎన్నేళ్ళయినా పాత పాలకులనే నిందించడం అసమంజసం. అది ఇన్నేళ్ళ సొంత తప్పుల్ని కాలమనే తివాచీ కిందకు నెట్టేసే విఫలయత్నమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య ప.1.50 వరకు, తదుపరి నిజశ్రావణ శు.పాడ్యమి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.55 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.40 నుండి 12.28 వరకు, **అమృత ఘడియలు:** ప.3.04 నుండి 4.56 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

అడవులను సరిగ్గానే పెంచుతున్నామా?

విశ్లేషణ



ధనపాల్ గోవిందరాజులు

దాదాపు 200 సంవత్సరాలకు పైగా భారతదేశం చెట్ల పెంపకంపై ప్రయోగాలు చేసింది. అడవులను పునరుద్ధరించే వివిధ విధానాలు... అవి స్థానిక సమాజాలపై, విస్తృత పర్యావరణంపై చూపే పరిణామాల గురించి మన దేశం ముఖ్యమైన పాఠాలను అందిస్తోంది. అందుకే గత తప్పిదాలు పునరావృతం కాకుండా అటవీశాఖాధికారులు చూసుకోవాలి. చెట్లను నాటడం అనగానే కచ్చితంగా అడవిని పునరుద్ధరించినట్టు అర్థం కాదు. చెట్ల కొరత ఉన్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం కూడా ముఖ్యం. పై నుండి అటవీ పందిరిని చూసి మురవడం కంటే కూడా దానివల్ల పర్యావరణం, స్థానిక ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలను నిర్ణయించడం విజయానికి మరింత సహాయ ప్రమాణంగా ఉంటుంది.

అడవులను తమకు తాముగా పునరుత్పత్తి చేసుకునేలా చేయడం అనేది, వాతావరణంలో భూమిని వేడెక్కించే కార్బన్‌ను తగ్గించడం కోసం చేసే ఒక వ్యూహంగా ఉంటోంది. అదే సమయంలో జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థలు అందించే ప్రయోజనాలతోపాటు జీవనోపాధికి చెందిన ఫలవంతమైనదాన్ని కూడా అవి పెంచుతూ వచ్చాయి.

కానీ వాతావరణ మార్పును పరిమితం చేసే ఉద్దేశంతో చెట్ల విస్తృతిని పెంచే ప్రయత్నాలు చివరకు వేగంగా పెరిగే ఉద్యానవనాలను నిర్మించడం వైపు మొగ్గు చూపాయి.

పొలాలు, బంజరు భూముల్లో తోటలను పెంచితే అవి కలపను, వంటచెరుకును అందించగలవు. ఇవి సహజ అడవులపై ఒత్తిడిని తగ్గించి, వాటి పునరుత్పత్తికి సహాయపడతాయి. కానీ సరైన రీతిలో జరగని చెట్ల పెంపకం తొలగించలేని జాతులను పెంచుతుంది. అవి ప్రజలను తమ భూమికి దూరమయ్యేట్టు చేస్తాయి.

దాదాపు 200 సంవత్సరాలకు పైగా భారతదేశం చెట్ల పెంపకంపై ప్రయోగాలు చేసింది. అడవులను పునరుద్ధరించడంలో వివిధ విధానాలు... అవి స్థానిక సమాజాలపై, విస్తృత పర్యావరణంపై చూపే పరిణామాల గురించి మన దేశం ముఖ్యమైన పాఠాలను అందిస్తోంది. గత తప్పిదాలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, ఈ అరుదైన దీర్ఘకాలిక దృక్పథాన్ని నేడు అటవీశాఖాధికారులు గమనించాలి.

దురాక్రమణ చెట్లు

18వ శతాబ్దం మధ్యకాలం నుండి ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా మన దేశానికి చెందిన అనేక వ్యవహారాలను బ్రిటన్ నియంత్రించింది. 1857 నుండి 1947 మధ్య బ్రిటిష్ రాణి నేరుగా దేశాన్ని పాలించింది.

భారతదేశం నుండి కొల్లగొట్టిన పత్తి, రబ్బరు, తేయాకును రవాణా చేయడం కోసం, బ్రిటన్‌కు రైల్వే స్లీపర్‌లను వేయడానికి, ఓడలను నిర్మించడానికి పెద్ద మొత్తంలో కలప అవసరమైంది. 1865 భారత అటవీ చట్టం ద్వారా, టేకు, సాల్, దేవదారు వంటి అధిక దిగుబడినిచ్చే కలప చెట్లతో కూడిన అడవులను ప్రభుత్వం ఆస్తిగా మార్చుకొంది.

ఈ అడవుల్లో ఈ కలప దిగుబడిని అధికం చేసేందుకు బ్రిటిష్ వలసపాలనాధికారులు గడ్డి, వెదురు కంటే మించిన రకాలను వేయకుండా స్థానిక ప్రజల హక్కులపై పరిమితులను విధించారు. ఆఖరికి పశువుల మేతపై కూడా ఆంక్షలు విధించారు. దీంతో భారతీయ సమాజాలు కొన్నిసార్లు అడవులను తగలబెట్టడం ద్వారా ప్రతీకారం తీర్చుకున్నాయి.

ఈలోగా వేడి, తేమతో కూడిన భారతదేశ వాతావరణానికి బాగా అలవాటుపడిన, మన్నికైన, ఆకర్షణీయమైన కలపకు మూలమైన టేకు తోటలు (టెక్టోనా గ్రాండిస్) దూకుడుగా వ్యాపించాయి. దాంతో సహజమైన గడ్డి భూములు, పొదలతో కూడిన అడవులు ఏకరూప టేకు పంటలకు దారితీశాయి.



భారతదేశంలో లేని యూకలిప్టస్, ఇతర అన్యదేశ చెట్లను సుమారు 1790 నుండి బ్రిటిష్‌వాళ్లు పరిచయం చేశారు. ఐరోపా, ఉత్తర అమెరికా నుండి తెచ్చిన దేవదారు చెట్లను హిమాలయ ప్రాంతంలో జిగురు కోసం; ఆస్ట్రేలియా నుండి తెచ్చిన అకేసియా చెట్లను కలప, మేత కోసం నాటారు. ఈ జాతులలో ఒకటైన, 'వాటిల్' (అకేసియా మియర్న్‌సి– ఒక తుమ్మ రకం)ని 1861లో కొన్ని లక్షల మొక్కలతో పశ్చిమ కనుమలలోని నీలగిరి జిల్లాలో ప్రవేశపెట్టారు. వాటిల్ అప్పటి నుండి ఆక్రమించే మొక్కగా మారి, ఈ ప్రాంతంలోని గడ్డి భూములను స్వాధీనం చేసుకుంది. అదేవిధంగా, దేవదారు హిమాలయాలలో చాలావరకు వ్యాపించి, స్థానిక ఓక్(సిందూర) చెట్లను స్థానభ్రంశం చేసింది. మధ్య భారతదేశంలోని స్థానిక గట్టి చెక్క అయిన సాల్ స్థానంలోకి టేకు వచ్చింది. ఓక్, సాల్ రెండూ ఇంధనం, మేత, ఎరువులు, ఔషధం, నూనె కోసం విలువైనవి. వీటినీ, మేత భూమినీ కోల్పోవడం చాలా మందిని పేదలుగా మార్చింది.

ఏవి పనికొస్తాయి?

'బాన్ ఛాలెంజ్' కింద 2030 నాటికి సుమారు 2.1 కోట్ల హెక్టార్ల అడవులను పునరుద్ధరిస్తామని భారతదేశం ప్రతిజ్ఞ చేసింది. భారత ప్రభుత్వం, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) 2018లో విడుదల చేసిన ప్రోగ్రెస్ రిపోర్టులో దాదాపు ఒక కోటి హెక్టార్ల మేరకు అడవులు పునరుద్ధరణలో ఉన్నాయని పేర్కొన్నారు.

చెట్లతో కప్పబడిన భూమి విస్తీర్ణాన్ని పెంచడంపై పెడుతున్న ఈ దృష్టి, భారత జాతీయ అటవీ విధానంలో ప్రతిఫలిస్తోంది. ఇది దేశంలోని 33 శాతం విస్తీర్ణంలో చెట్లను పెంచడాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ విధానంలోని పథకాలలో యూకలిప్టస్ లేదా వెదురు వంటి ఒకే జాతితో కూడిన తోటలు ఉంటాయి. ఇవి వేగంగా పెరుగుతాయి, చెట్లు కప్పే స్థలాన్ని త్వరగా పెంచుతాయి. కొన్నిసార్లు ఈ చెట్లను గడ్డి భూములు, చెట్ల వ్యాప్తి సహజంగా తక్కువగా ఉన్న ప్రాంతాలలో నాటారు. ఫలితంగా మేతకోసం, ఇతర ఉత్పత్తుల కోసం ఈ పర్యావరణ వ్యవస్థలపై ఆధారపడిన గ్రామీణ, స్థానిక ప్రజలకు హాని కలుగుతోంది. అన్యదేశ చెట్లను నిరంతరం నాటడం వల్ల 200 ఏళ్ల క్రితం వాటిల్ మాదిరిగానే కొత్త ఆక్రమణ జాతులు వచ్చే ప్రమాదం ఉంది.

దీనికి సంబంధించి సానుకూల కేస్ స్టడీస్ కూడా ఉన్నాయి. 2006 అటవీ హక్కుల చట్టం ఒకప్పుడు సాంప్రదాయ వినియోగంలో ఉన్న అటవీ ప్రాంతాలను నిర్వహించేందుకు గ్రామసభలకు అధికారం ఇచ్చింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో అనేక గ్రామసభలు క్షీణించిన అడవులను పునరుద్ధరించాయి. పైగా వాటిని బీడీలు చుట్టడానికి ఉపయోగించే తునికి ఆకులకు స్థిరమైన వనరుగా మార్చాయి. అలాగే గుజరాత్ కఛ్ గడ్డి భూముల్లో, 19వ శతాబ్దం చివరలో బ్రిటిష్ అటవీ అధికారులు ప్రవేశపెట్టిన 'పిచ్చి చెట్లను' తొలగించడం ద్వారా అక్కడి సమాజాలు గడ్డి భూములను పునరుద్ధరించగలిగాయి.

ప్రయోజనాలూ ముఖ్యమే!

అటవీ పునరుద్ధరణ ప్రయత్నాల విజయాన్ని చెట్ల విస్తృతితో మాత్రమే కొలవలేము. 'అడవి' గురించిన భారత ప్రభుత్వ నిర్వచనం ఇప్పటికీ ఏకరూప చెట్టు జాతులు, పళ్ల తోటలు, ఆఖరికి వెదురు (నిజానికి ఇది గడ్డి కుటుంబానికి చెందినది) లాంటిదానికి మాత్రమే పరిమితమై ఉంది. దీనర్థం ద్వైవార్షిక అటవీ సర్వేలు ఎంత సహజ అడవులను పునరుద్ధరించారో లెక్కించలేవు; స్థానిక చెట్లను పోటీ జాతులతో స్థానభ్రంశం చేయడం వల్ల కలిగిన పరిణామాలను తెలియజేయలేవు; అన్యదేశ చెట్లు మన సహజమైన గడ్డి భూములను ఎంత ఆక్రమించాయో గుర్తించలేవు. పైగా అవి పునరుద్ధరించిన అడవులుగా తప్పుగా నమోదు అవుతాయి.

సహజ అటవీ పునరుత్పత్తిని, అలాగే కలప, ఇంధనం కోసం చెట్ల పెంపకాన్ని రెండింటినీ ప్రోత్సహించాలి. అయితే ఇతర పర్యావరణ వ్యవస్థలు, ప్రజల మీద వీటి ప్రభావాన్ని తప్పక పరిశీలించాలి. నాటుతున్న రకాలు దురాక్రమించేవిగా మారకుండా జాగ్రత్తగా ఎంచుకోవడం దీంట్లో భాగం. అటవీ హక్కులు, స్థానిక జీవనోపాధి, జీవవైవిధ్యం, కర్బన నిల్వలపై దాని ప్రభావాల పరంగా చెట్ల కవరేజిని పెంచడానికి సంబంధించిన లక్ష్యాన్ని అంచనా వేయాలి.

చెట్లను నాటడం అనగానే కచ్చితంగా అడవిని పునరుద్ధరించినట్టు అర్థం కాదు. చెట్ల కొరత ఉన్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం కూడా ముఖ్యం. పై నుండి అటవీ పందిరిని చూసి మురవడం కంటే దానివల్ల పర్యావరణం, స్థానిక ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలను నిర్ణయించడం విజయానికి మరింత సహాయ ప్రమాణంగా ఉంటుంది.

వ్యాసకర్త పరిశోధకుడు, మాంచెస్టర్ యూనివర్సిటీ
('ది కాన్వర్జేషన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పొరుగుకు శుభాకాంక్షలు



స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మా గొప్ప పొరుగు దేశమైన ఇండియాకూ, భారతీయులకూ శుభాకాంక్షలు, శుభాభినందనలు. జై హింద్!

– అమరుల్లా సలేహ్, అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

నిర్భయంగా తినండి



డోనట్స్, పాన్‌కేక్స్ తినండి; ఎవరూ పట్టించుకోరు. అదే ఒక్క మామిడిపండు తినగానే, అంత చక్కెరా అంటారు. పళ్లతో వచ్చే చక్కెరనూ, ప్రాసెస్డ్ ఫుడ్స్‌తో వచ్చే చక్కెరనూ మన శరీరం జీర్ణించుకోవడంలో, రక్తంలో చక్కెరను నియంత్రించుకోవడంలో ఎంతో తేడా ఉంటుంది. పళ్లు ఎక్కువ తినడం వల్ల లావయిన మనిషిని నేను ఒక్కరిని కూడా చూడలేదు.

– డ్యాన్ గో, ఫిట్‌నెస్ కోచ్

ఇక్కడి వాడినే!



ఇప్పుడిక నా మనసు, నా పౌరసత్వం... రెండూ హిందుస్థానీయే! అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. జై హింద్!

– అక్షయ్ కుమార్, నటుడు

వీళ్లు పిల్లలా?



జనాల మీదికి లాఘవంగా రాళ్లు విసిరేవాడు పిల్లాడు కాదు. జనాల వైపు త్రిశూలాలను ఊపేవాడు పిల్లాడు కాదు. అల్లర్లలో పాలుపంచుకునే మైనర్... 'మైనర్' కాదు. అతడి మనసును మార్చారు అనేది ఒప్పుకోగలిగే సమాధానం కాదు.

– అమిత్ శాండీలియా, కాలమిస్ట్

అనుభవిస్తున్నాం!



హిమాచల్ ప్రదేశ్ వరదల గురించి ఎవరూ ఎందుకు మాట్లాడడం లేదు? ఇంకా దిగువ ప్రాంతాలు వరదలతో పోటెత్తుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. చాలా ప్రదేశాల్లో కరెంట్ లేదు. ప్రతి ఒక్కరి జీవితం ప్రమాదంలో ఉంది. ఇదంతా ఘోరమైన వాతావరణ మార్పు ఫలితమే!

– సృష్టి, జర్నలిస్ట్

పాడు గాలి



నేను దాదాపు ప్రతిరోజూ ఒకరిద్దరికి కొత్తగా పల్మనరీ టీబీ ఉందని నిర్ధారిస్తాను. ఆ వ్యాధిని నియంత్రించడంలో మనం కనీసం దగ్గరగా కూడా లేము. దీనికి పోషణ అనేది ఒక్కటే కారకం కాదు. ఢిల్లీ లాంటి చోట్ల వాయు కాలుష్యం (ఇండోర్, ఔట్‌డోర్) ప్రధాన పాత్ర పోషిస్తోంది.

– పార్థ్ శర్మ, కమ్యూనిటీ ఫిజీషియన్

భిన్న వేదికలుండాలి



కళా ప్రదర్శనల కోసం చెన్నై నగర వ్యాప్తంగా చిన్న, మధ్యమ పరిమాణం గల చాలా ప్రదేశాలు ఉండాలి. అంతే గానీ మెగా షోల పేరుతో ఒకేచోట పెట్టుబడి పెట్టడం డబ్బును పూర్తిగా వృథా చేయడమే! కళలకు భిన్నమైన, బహుళ వేదికలు ఉండాలి. అది లేకపోతే పెద్దవి చిన్నవాటిని మింగేస్తాయి.

– టి.ఎం. కృష్ణ, గాయకుడు

అతిక్రమించిన వారిని వదిలేసి...

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ నుంచి మరో ప్రహసన యాత్ర ప్రారంభించారు. ఈ ప్రహసనంలో భాగంగా ఆయన కోర్టు విచారణలో ఉన్న రుషి కొండ అంశంపై యథేచ్ఛగా మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నం చేశారు. అక్కడ పర్యావరణానికి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందంటూ ప్రకటనలు గుప్పించారు. పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత. అయితే కొందరు మాత్రం ఈ పరిరక్షణ విషయంలో రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారు. తమ కిష్టమైన వారు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తారు. అదే తమకు గిట్టని వ్యక్తులు పర్యావరణానికి హాని కలిగించకపోయినా అక్కడేదో జరిగిపోతోందంటూ నానా యాగీ చేస్తారు.

చంద్రబాబు నాయుడు కరకట్ట ప్రక్కనే పర్యావరణ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన ఇంట్లో తిష్ట వేస్తే అది తప్పుకాదు. పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే తిరగడానికి క్యాంపర్ వ్యాన్‌గా పర్మిషన్ తీసుకున్న 'వారాహి' వాహనంతో రాజకీయ యాత్రలు చేయడం నిషిద్ధం. ఇటువంటి నిబంధనలు అతిక్రమిస్తున్న పవన్ రుషికొండలో ప్రభుత్వం పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలే నిజమైతే అందుకు పూర్తి బాధ్యత ఆనాటి ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, చంద్రబాబు వహించవలసి ఉంటుంది.

1987లో ఎన్టీఆర్ హయాంలో 'రుషి కొండ'ను పర్యాటక కేంద్రంగా మార్చాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా అప్పటి ప్రభుత్వం 1987 మే 9న జీఓ విడుదల చేస్తూ సర్వే నంబరు 19/1లోని 2.88 ఎకరాలు, 19/3 సర్వే నంబర్‌లో ని 15 ఎకరాలు, 19/4 సర్వే నంబర్‌లోని 51.77 ఎకరాలు ఏపీ టూరిజం శాఖకు అప్పగించింది. టూరిజం శాఖ 19/3 సర్వే నంబర్‌లోని భూమిపై మాత్రమే 'హరిత' రిసార్ట్స్ నిర్మించి మిగిలిన భూమిని భవిష్యత్ అవసరాల కోసం ఉంచింది. ఆనాటి నిర్మాణాలపై ఎవరూ నోరు మెదపలేదు.

2015లో చంద్రబాబు హయాంలో ఏపీ టూరిజం శాఖ ఇదే రుషికొండపై చెట్లను నరికి, కొండను తొలిచి సుమారు 15 కోట్ల రూపాయలతో 35 షాపులతో కూడిన కాంప్లెక్స్, యాంఫిథియేటర్, పార్కింగ్ కాంప్లెక్స్, టాయ్‌లెట్స్ నిర్మించినప్పుడు విచిత్రంగా ఎవరూ కోర్టును ఆశ్రయించలేదు. కాని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇదే రుషికొండపై పాత నిర్మాణాలు తొలగించి కొత్త నిర్మాణాలు చేస్తుంటే కోర్టులో వ్యాజ్యాలు, ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం టూరిజం శాఖ రుషికొండపై సుమారు 240 కోట్లతో హోటల్ కమ్ రిసార్ట్ నిర్మిస్తోంది.

రుషికొండపై 9.88 ఎకరాల్లో మాత్రమే నిర్మాణాలు జరుగుతున్నాయి. అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతం 'కోస్టల్ రెగ్యులేటరీ జోన్' (సీఆర్‌జడ్) 2 కిందికి వస్తుందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఛాయాచిత్రాలు, అన్నా విశ్వవిద్యాలయం నివేదికలు నిర్ధారించాయి. జోన్ 2లో ఇప్పటికే ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఉంటే అక్కడ అనుమతులు పొందిన కట్టడాలను నిర్మించవచ్చు.

పర్యావరణ మంత్రిత్వ శాఖ 2021 మార్చి 22వ తేదీన జోన్2పై తన క్లియరెన్స్‌ను కూడా పర్యాటక శాఖకు ఇచ్చింది. 2021 నవంబర్ 8న అటవీశాఖ ఇచ్చిన నివేదికలో ఇది రిజర్వ్ ఫారెస్ట్ కాదని తేల్చింది. అన్ని అనుమతులతో టూరిజం శాఖ అక్కడ నిర్మాణాలు ప్రారంభించినప్పటి నుంచి అడ్డంకులు వస్తున్నాయి.

పర్యావరణంపై అనురక్తి ఉన్న పవన్ కల్యాణ్ కృష్ణా కరకట్టపై చంద్రబాబు తదితరులు చేసిన అతిక్రమణలపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. కృష్ణా కరకట్ట ప్రాంతంలో గుంటూరు జిల్లా పరిధిలో 48 భవనాలు, కృష్ణా జిల్లా పరిధిలో 18 భవనాలు ఉన్నాయి. వీటిలో చంద్రబాబు నివాసంతో పాటు వందలాది మంది రోగులకు నిలయమైన ప్రకృతి వైద్యశాల కూడా అక్కడే ఉన్నాయి. ఇక్కడ నిర్మించిన కట్టడాలన్నీ నదీ 'పరిరక్షణ చట్టం 1884' నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేనని స్వయానా అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు 2015 జనవరిలో చెప్పారు.



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ 1996 మార్చి ఎనిమిదో తేదీన విడుదల చేసిన జీఓ నంబర్ 111 ప్రకారం నదికి సమీపాన ఎటువంటి నిర్మాణాలూ చేయకూడదు. ఎటువంటి వ్యర్థ పదార్థాలూ నదిలో వదల కూడదు. భారత శిక్షాస్మృతి సెక్షన్ 277 ప్రకారం నీటి వనరులను కలుషితం చేసే వారికి మూడు నెలల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించవచ్చు. ఆశ్చర్యకమైన విషయం ఏమిటంటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలకు డ్రైనేజ్ సదుపాయం లేదు. వీరు వాడే నీరంతా కృష్ణా బరాజ్ వద్ద గల నీటిలోనే కలిసిపోతోంది. ఫలితంగా ఈ జలాలు కలుషితమవుతున్నాయి. కేంద్ర పొల్యూషన్ బోర్డు 'వాటర్ క్వాలిటీ ఆఫ్ రివర్స్ 2021' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం నదీజలాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ఐదు రోజుల సగటు విశ్లేషణల్లో లీటర్‌కు రెండు మిల్లీ గ్రాముల కన్నా తక్కువ ఉండాలి. గుంటూరు జిల్లా అమరావతి వద్ద కృష్ణా జలాల్లో బీఓడీ 1.4 మిల్లీగ్రాములుండగా, చంద్రబాబు నివాస ప్రాంతంలో ఇది 2.6 మిల్లీ గ్రాములకు పెరిగిపోయింది.

గతంలో 'బెటర్ ఆంధ్రప్రదేశ్' అనే సంస్థ కరకట్ట సమీపంలోని కృష్ణాజలాల కాలుష్యంపై ఒక నివేదిక ఇచ్చింది. నదీజలాల్లో టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్ లీటరు నీటిలో రెండు మిల్లీ గ్రాములు మించి ఉండకూడదు. ఈ సాలిడ్స్ అయిదు మిల్లీ గ్రాములుంటే వాటిని కలుషిత జలాలుగా పరిగణిస్తారు. కరకట్ట వద్ద జలాలను పరీక్షించినప్పుడు టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్ లీటరు నీటిలో 12 మిల్లీ గ్రాములు ఉన్నట్లు తేలింది. ఇటువంటి అరాచకాలన్నీ చంద్రబాబుకూ, పవన్ కల్యాణ్‌కూ కనిపించవు. ఎందుకంటే వారు పాలలో నీళ్ళలాగా కలిసిపోయి ప్రజలను మోసగిస్తున్నారు గనుక! పర్యావరణ ప్రేమికులు కూడా పక్షపాత ధోరణులతో కాకుండా నిజాయతీగా పాలను పాలు, నీళ్లను నీళ్ళు అని చెప్పగలిగితే సమాజానికి మేలు కలుగుతుంది.

వ్యాసకర్త ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు
మొబైల్: 95052 92299

మనోహరం

ఎవరి చేతిలోనూ తనకు మరణం లేకుండా చేసుకునే ఉద్దేశంతో, అత్యంత కఠినమైన తపస్సుకు పూనుకుంటాడు రావణుడు. ఆ తపస్సులో వెయ్యేళ్ళకు ఒక శిరస్సు చొప్పున తనకున్న పది శిరస్సులలో తొమ్మిదింటిని సమర్పించుకుంటాడు. మరో వెయ్యేళ్ళు గడిచి, తన పదవ శిరస్సును కూడా సమర్పించుకోవడానికి రావణుడు సిద్ధపడుతూండడం చూసి, ప్రీతితో బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. అంతగా శక్తిమంతులు కాని మానవుల వలన, వారి కంటె హీనజాతివారైన వానరుల వలన తనకు ముప్పేమీ వాటిల్లదు కనుక వారిని గురించిన చింతేమీ తనకు లేదనీ, దేవ దానవ యక్ష కిన్నర కింపురుషాది మరే జాతికి చెందినవారి చేతిలోనూ తనకు మరణం కలగని వరం ఇమ్మంటాడు రావణుడు.



అలాగే ఇస్తాడు బ్రహ్మ. అంతే కాకుండా రావణుడు తపస్సులో అర్పించిన తొమ్మిది తలలను కూడా తిరిగి ఇచ్చేస్తాడు.

బ్రహ్మ అలా వరం ఇవ్వగానే, రావణుని తొమ్మిది తలలు ఒకటొక టిగా వచ్చి మిగిలివున్న శిరస్సు చెంతనే చేరతాయి. తపస్సనే సాధనంతో బ్రహ్మను సైతం మెప్పించి తాను కోరుకున్నది సాధించుకున్న రావణుడి శిరస్సులు ఒకటొకటిగా మళ్ళీ వచ్చి చేరే అద్భుతమైన ఆ సందర్భాన్ని

'వెల్లువ ముంచి పిదప నీ
రెల్లను వెన దొంక గొలన నెసగెడు చంచ
త్పుల్లారవిందముల క్రియ
నల్లన వదనములు దోచె నాశ్చర్యముగాన్'

అని అంతే అద్భుతంగా, మనోహరమైన పోలికతో వర్ణించి చెప్పాడు తిక్కన తన రచనయైన 'నిర్వచనోత్తర రామాయణము' తృతీయాశ్వాసంలో!

పెద్ద వాన పడిన కారణంగా వెల్లువ వచ్చి కొలను మునిగిపోయింది. వాన వెలిసిన కొంతసేపటికి, వచ్చిన వెల్లువ తగ్గి, అధికంగా వచ్చి చేరిన నీరు కొలనులోంచి బయటకు వెళ్ళిపోయి, కొలనుకు పూర్వస్థితి రాగా, ఆ కొలను నీటిలోంచి ఒకటొకటిగా మళ్ళీ వికసిస్తూ ప్రత్యక్షమైన కమలముల వలె, దశకంధరుడైన రావణుని తలలు ఒకటొకటిగా మళ్ళీ వచ్చి చేరి, చూసే వారికి ఆశ్చర్యము, ఆనందము కలుగజేశాయి అని పై పద్యం భావం. భావం మనసుకు హత్తుకుని, 'ఆహా!' అనిపించేలా చెప్పడం మహాకవుల లక్షణం. అందులో ఆరితేరినవాడు తిక్కన మహాకవి.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

నెట్టికంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో జస్టిస్ మన్మథరావు దంపతులు

గుంతకల్లు రూరల్: అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఈవో డి.వెంకటేశ్వరరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన వీరు అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, జ్ఞాపికలను అందజేశారు. వీరి వెంట అనంతపురం జిల్లా మొబైల్ మేజిస్ట్రేట్ సుజన్ కుమార్, గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల తదితరులు ఉన్నారు.

కాణిపాకం వినాయకుడి సన్నిధిలో జస్టిస్ ఉమా



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకుడిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమా మంగళవారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆశీర్వాద మండపంలో వేద ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు. కాగా, ప్రముఖ సినీ దర్శకుడు బీఎస్వీ రవి కూడా ఘణనాథుడిని దర్శించుకున్నారు.

రోజుకొక పెగ్గేసినా.. అనర్థమే

- ప్రతిరోజూ తక్కువ మోతాదులో మద్యం సేవించినా అధిక రక్తపోటు
- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లో అధ్యయనం
- 1997–2021 మధ్య 19 వేల మంది డేటా విశ్లేషణ
- రక్తపోటు స్థాయిల్లో నిరంతర పెరుగుదల నమోదు



సాక్షి, అమరావతి: ప్రతిరోజూ ఒక పెగ్గు చొప్పున తక్కువ మోతాదులో మద్యం తీసుకుంటే ఏం కాదు అనుకుంటే.. అది పొరపాటేనని ఓ అధ్యయనం హెచ్చరించింది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించిన ఇటలీ, అమెరికాకు చెందిన ఓ మల్టీ నేషనల్ టీమ్ అధ్యయనం ప్రకారం.. తక్కువ మోతాదులో మద్యం సేవించే వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, అధిక రక్తపోటు బారినపడుతున్నారని వెల్లడైంది. 1997 నుంచి 2021 మధ్య కాలంలో జపాన్, అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో మద్యపానం వల్ల సంభవించే పర్యవసానాలపై ఏడు అధ్యయనాలు నిర్వహించారు. 20 నుంచి 70 ఏళ్ల వయసుతో పాటు అధిక రక్తపోటు లేని 19,548 మందిపై అధ్యయనం చేపట్టారు. ఈ సందర్భంగా 4 నుంచి 12 ఏళ్ల అనంతరం వీరి రక్తపోటు స్థాయిల్లో నిరంతర పెరుగుదలను కనుగొన్నారు. రోజుకు సగటున 12 గ్రాముల మద్యం సేవించే వ్యక్తుల్లో ఐదేళ్లలో సిస్టోలిక్ రక్తపోటు 1.25 ఎంఎం హెచ్‌జీ పెరిగినట్టు గుర్తించారు. రోజుకు సగటున 48 గ్రాముల మద్యం సేవించే వ్యక్తుల్లో సిస్టోలిక్ రక్తపోటు 4.9 ఎంఎం హెచ్‌జీ పెరిగినట్లు తేలింది..

ఒక్క రక్తపోటే కాదు.. అనేక సమస్యలు




మద్యాన్ని ఎక్కువా.. తక్కువా.. అని కాదు.. ఏ పరిమాణంలో తీసుకున్నా ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఎక్కువ పరిమాణంలో తాగే వారిలో వేగంగా, తక్కువ పరిమాణంలో తాగేవారిలో ఆలస్యంగా ప్రభావాలుంటాయి. రక్తపోటుతో పాటు కాలేయం, గుండె, మెదడుతో పాటు శరీరంలో మద్యపానానికి ప్రభావమవ్వని భాగం ఉండదు. ఆధునిక జీవనశైలి వల్ల మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఇలా అనేక రకాల సమస్యలు చుట్టుముడుతున్నాయి. వీటికి మద్యపానం తోడైతే వేగంగా అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మితంగా మద్యపానం ఆరోగ్యానికి మంచిదేనని గతంలో కొన్ని అధ్యయనాలు వచ్చినా.. అవి అవాస్తవమని తర్వాతి రోజుల్లో కొట్టిపడేశారు.

– డాక్టర్ కె.సుధాకర్, ప్రిన్సిపల్, సిద్ధార్థ వైద్య కళాశాల విజయవాడ

స్టెమీతో గుండె సేఫ్

గుండెపోటు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక



ప్రాణాపాయం నుంచి కాపాడతారిలా..

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరణ సహా అనేక కార్యక్రమాలు చేపట్టారు. గుండె జబ్బులు, కేన్సర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్డియాలజీ, కార్డియోవాస్క్యులర్ సేవలను మరింతగా విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గుండె జబ్బులతో బాధపడే గ్రామీణులకు సత్వర వైద్య సేవలందించి, వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ (స్టెమి)గా పిలిచే ఈ కార్యక్రమం ద్వారా గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో 40 నిమిషాల్లోనే చికిత్స అందిస్తారు. తద్వారా బాధితులు ప్రాణాపాయం నుంచి బయటపడటానికి వీలుంటుంది. ఇప్పటికే తిరుపతి రుయా ఆస్పత్రిలో దీనిని పైలెట్ ప్రాజెక్టుగా వైద్య, ఆరోగ్య శాఖ అమలులో పెట్టింది. రెండో దశ పైలెట్ ప్రాజెక్టును వచ్చే నెల 29 నుంచి కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం కేంద్రంగా ప్రాజెక్టును అమలు చేస్తారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తారు. ఈలోగా పాత 11 బోధనాస్పత్రుల్లో కార్డియాలజీ, కార్డియోవాస్క్యులర్ (సీటీవీఎస్) విభాగాలను బలోపేతం చేస్తారు. ఇందుకోసం కార్డియాలజీ, క్యాథ్‌లాబ్, సీటీవీఎస్ విభాగాల్లో 94 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివిధ ఆస్పత్రుల్లో రూ.120 కోట్లతో క్యాథ్‌లాబ్స్‌ను సమకూర్చింది.

స్టెమీ అంటే గుండె రక్తనాళం 100 శాతం పూడిపోవడంతో వచ్చే గుండెపోటు. దీనికి గురైన బాధితుడికి వీలైనంత త్వరగా ఆ పూడికను కరిగించే చికిత్స (థ్రాంబోలైసిస్ ఇంజక్షన్)ను ఇవ్వగలిగితే ప్రాణాలను కాపాడవచ్చు. నగరాలకు దూరంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి ఈ చికిత్స అందుబాటులో ఉండదు. సరైన సమయంలో వైద్యం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారిని రక్షించడానికి ప్రభుత్వం స్టెమీ పేరుతోనే కార్యక్రమాన్ని చేపట్టింది. వచ్చే నెలలో గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం జీజీహెచ్‌లలోని హబ్‌ల ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కార్డియాలజిస్టులు, క్యాథ్‌లాబ్ సౌకర్యం ఉన్న ఈ మూడు ఆస్పత్రులను హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు. వీటికి ఆ జిల్లాల పరిధిలోని 48 స్పోక్స్ (ఏపీవీవీపీ ఆస్పత్రులు)ను అనుసంధానం చేసి సామాన్యులు, గ్రామీణులకు హార్ట్ కేర్ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నారు. ఛాతీనొప్పి, గుండెపోటు లక్షణాలతో స్పోక్స్‌కు వచ్చిన వారికి వెంటనే టెలీ-ఈసీజీ తీస్తారు. ఆ ఫలితం హబ్‌లో ఉన్న కార్డియాలజిస్ట్‌కు వెళుతుంది. గుండె రక్తనాళం ఎంతశాతం పూడిపోయింది? వెంటనే థ్రాంబోలైసిస్ అవసరమా అనేది కార్డియాలజిస్ట్ నిర్ధారిస్తారు. వెంటనే స్పోక్ వైద్యుడికి తగిన సూచనలు చేస్తారు. అవసరమైతే రూ.40 వేలు విలువ చేసే థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ ఉచితంగా బాధితులకు ఇస్తారు. ఇదంతా 40 నిమిషాల్లోనే జరుగుతుంది. దీంతో రోగి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతారు. ఆ తర్వాత తదుపరి చికిత్స కోసం హబ్‌కు లేదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిస్తారు.

గుండె సంబంధిత వ్యాధులతోనే 32.4 శాతం మరణాలు

రాష్ట్రంలో సంభవిస్తున్న మరణాల్లో 32.4 శాతం గుండె సంబంధిత వ్యాధుల కారణంగానే ఉంటున్నాయి. రాష్ట్రంలో 38 లక్షల మందికి పైగా గుండె జబ్బుల బాధితులున్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)లో గుండె జబ్బులదే అగ్రస్థానం. ఈ క్రమంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్‌సీడీ నిర్వహణపై పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా బీపీ, షుగర్, ఇతర ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై నిరంతర ఫాలోఅప్ ఉంచుతున్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధులపై ఫోకస్ పెట్టారు. సత్వరమే నాణ్యమైన చికిత్సను అందించడం ద్వారా మరణాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా స్టెమీ ప్రాజెక్టు చేపట్టారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఫ్యామిలీ డాక్టర్, సీహెచ్‌వోల ద్వారా గుండెపోటు లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. గుండెపోటుకు గురైన వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని స్పోక్స్ సెంటర్‌కు తరలిస్తారు. బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స లభిస్తుంది. తద్వారా మరణాలు కట్టడి అవుతాయి.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబసంక్షేమ కమిషనర్

మందులు, పరికరాలు సమకూరుస్తున్నాం



మూడు జిల్లాల్లో స్పోక్స్ ఆస్పత్రులను గుర్తించాం. వాటిలో స్టెమీ ప్రోటోకాల్స్‌కు అనుగుణంగా అవసరమైన మందులు, వైద్య పరికరాలను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సమకూరుస్తున్నాం. వైద్యులు, సిబ్బందికి ప్రోటోకాల్స్‌పై శిక్షణ ఇచ్చాం.

– డాక్టర్ వెంకటేశ్వర్, ఏపీవీవీపీ కమిషనర్

తుపాకీ తూటా తగిలి బాలిక మృతి

కాకినాడ జిల్లా లోవకొత్తూరులో ఘటన





ధన్యశ్రీ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) ధన్యశ్రీ (ఫైల్)

తుని రూరల్: నాటుతుపాకీ తూటా తగిలి ఆడుతూ పాడుతూ తిరిగే అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి మృత్యుఒడికి చేరుకున్న ఘటన కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరులో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ జె.విజయబాబు, సీఐ ఎ.సన్యాసిరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పలివెల రాజబాబు, నాగమణి దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమార్తె ధన్యశ్రీ (4) నిద్రలేచిన తర్వాత ఆడుకునేందుకు ఇంటినుంచి బయటకు వచ్చింది. ఆడుకుంటుండగా నాటుతుపాకీ తూటా పేలిన శబ్దం వినిపించడంతో ధన్యశ్రీ తల్లిదండ్రులైన రాజబాబు, నాగమణి, స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వచ్చి చూశారు. అప్పటికే ధన్యశ్రీ నేలకొరిగిపోయింది. ధన్యశ్రీని తల్లిదండ్రులు తునిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలిక అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన సిద్ధాంతపు దుర్గాప్రసాద్ పది రోజులుగా పట్టుబడని ఊరపందిని కాల్చేందుకు నాటు తుపాకీలో తూటా లోడ్ చేస్తుండగా మిస్‌ఫైరై సమీపంలో ఉన్న బాలికకు తగిలి ప్రమాదం జరిగింది. తూటా బాలిక వీపు నుంచి ఛాతిలోంచి దూసుకుపోయింది. కేసు దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ధన్యశ్రీ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

హార్బర్లకు సమాంతరంగా ఆహ్లాదం

ఫిషింగ్ హార్బర్లను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దుతున్న ఏపీ మారిటైమ్ బోర్డు

- వాటి వద్ద రిసార్టులు, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు
- తొలి దశ నాలుగు హార్బర్లలో పర్యాటకం ద్వారా ఏటా రూ.131 కోట్ల ఆదాయం



సాక్షి, అమరావతి : ఫిషింగ్ హార్బర్లు కేవలం చేపల వేటకే పరిమితం కాకుండా పర్యాటక ప్రదేశాలుగా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటి పక్కనే రిసార్టులు, వెల్‌నెస్ సెంటర్లు, వాటర్ పార్క్స్, అమ్యూజ్‌మెంట్ పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించేలా ఏపీ మారిటైమ్ బోర్డు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పర్యాటకుల డిమాండ్ అధికంగా ఉన్న హార్బర్లను పరిశీలించి అక్కడ పర్యాటక అవకాశాలపై అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న జువ్వలదిన్నె, నిజాంపట్నం, ఉప్పాడ, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్లలో మచిలీపట్నం వద్ద పర్యాటక అవకాశాలు అధికంగా ఉన్నట్లు గుర్తించింది. ఈ నాలుగు ఫిషింగ్ హార్బర్లలో పర్యాటక ఏర్పాట్లు చేయడం ద్వారా ఏటా రూ.131 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. అలాగే ఫిషింగ్ హార్బర్లలో పట్టే చేపలను ప్రోసెసింగ్ చేయడం ద్వారా ఆదాయం తెచ్చేందుకు ఏర్పాట్లూ చేస్తోంది. తొలి దశ ఫిషింగ్ హార్బర్ల పనులు పూర్తి కావస్తుండటంతో పీపీపీ విధానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రతి ఫిషింగ్ హార్బర్ వద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో టూనా చేపలు, రొయ్యల కోసం ప్రత్యేక యూనిట్లను ఏర్పాటు చేస్తారు. ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల మూలంగా నాలుగు ఫిషింగ్ హార్బర్ల ద్వారా ఏటా రూ.225.18 కోట్ల ఆదాయం వస్తుందని ఏపీ మారిటైమ్ బోర్డు చెబుతోంది. కేవలం చేపల వేట కాకుండా టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రూ.357 కోట్ల ఆదాయం పొందొచ్చని అంచనా వేసింది.

జువ్వలదిన్నెలో 90 శాతం పనులు పూర్తి

సుమారు రూ.1523 కోట్లతో అభివృద్ధి చేస్తున్న నాలుగు ఫిషింగ్ హార్బర్లను ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తేవాలని ఏపీ మారిటైమ్ బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తి కావడంతో ఈ సెప్టెంబర్ నాటికి సీఎం వైఎస్ జగన్ చేతులు మీదుగా ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మిగిలిన మూడు హార్బర్లు నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడల్లో 60 శాతానికి పైగా పనులు పూర్తి కావడంతో వీటిని డిసెంబర్ నాటికి అందుబాటులోకి తేనున్నారు. ఈ నాలుగు ఫిషింగ్ హార్బర్ల ద్వారా 5,900 బోట్లు నిలుపుకొనే అవకాశం రావడంతో పాటు ఏటా 2,37,350 టన్నుల చేపలను పడతారని అంచనా. ఈ ఫిషింగ్ హార్బర్ల ద్వారా రాష్ట్రంలోని 555 మత్స్యకార గ్రామాల్లోని 6.3 లక్షల మత్స్యకారులు లబ్ధిపొందనున్నారు.

మహనీయుల స్ఫూర్తితో హక్కుల సాధన

1,052వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న నేతలు

తాడికొండ: మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పేదల హక్కులు సాధిస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 1,052వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ మహనీయులంతా చేసిన పోరాట ఫలితంగా ఓ వైపు దేశం స్వేచ్ఛా వాయువులు పీలుస్తుంటే.. మరో వైపు పేదలను అణగదొక్కే దుర్మార్గుల చర్యలతో నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు లాంటి నీచులు స్వలాభం కోసం బహుజనుల అభివృద్ధిని అడ్డుకుంటూ వ్యవస్థలను అడ్డుగా పెట్టి తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.తొలుత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రాజధానుల దీక్షా శిబిరంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు జాతీయ జెండాను ఎగుర వేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, మందా గిరీష్, రావూరి రాంబాబు, నూతక్కి జోషి పాల్గొన్నారు.


‘ఎస్వీ మెడికల్’లో విద్యార్థుల ఘర్షణ

తిరుపతి క్రైం (తిరుపతి జిల్లా): ఎస్వీ మెడికల్ కాలేజీలో మద్యం మత్తులో యువకులు గొడవపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వెస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. 2019 బ్యాచ్‌కు చెందిన మెడికల్ విద్యార్థి వెంకటగిరి బాలాయపల్లికి చెందిన గణేష్ ఎస్వీ వైద్య కళాశాల హాస్టల్లో ఉంటున్నాడు. ఇతని ఎదురు రూమ్‌లోనే 2018 బ్యాచ్‌కి చెందిన సీనియర్లు నందలూరుకు చెందిన మహేష్, పలమనేరుకు చెందిన ప్రవీణ్ ఉంటున్నారు. వీరు ముగ్గురూ మరో స్నేహితుడితో కలిసి సోమవారం రాత్రి ఫుల్లుగా మద్యం తాగారు. ఈ క్రమంలో ఎప్పు డు తామే డబ్బులు ఖర్చు పెడుతున్నామంటూ సీనియర్లు మహేష్, ప్రవీణ్‌లు గణేష్‌ను హేళన చేశారు. ఈ క్రమంలో గణేష్ వీరిని నెట్టడంతో సీనియర్లనే నెట్టుతావేరా..? అంటూ బెదిరించారు. రేపు ఉంటుంది నీకు.. సీనియర్లందరికీ చెప్తామని చెప్పి ఎవరి రూముకి వారు వెళ్లిపోయారు. భయభ్రాంతులకు గురైన గణేష్ తెల్లవారితే ఎవరేం చేస్తారోనని భయపడి మంగళవారం ఉదయాన్నే ఎదురుగా ఉన్న సీనియర్ రూముకు వెళ్లాడు. రూమ్‌లో నిద్రపోతున్న మహేష్, ప్రవీణ్ తలలపై క్రికెట్ స్టిక్‌తో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా కత్తితో మహేష్ గొంతు కోసేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు వస్తున్నారని భయంతో పారిపోయాడు. ప్రస్తుతం మహేష్, ప్రవీణ్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి గణేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సిగ్నల్ లేకపోయినా క్షణాల్లో సమాచారం

వేటకు వెళ్లే మత్స్యకారుల కోసం కొత్త టెక్నాలజీ

శాటిలైట్‌తో స్మార్ట్ ఫోన్ల అనుసంధానం



సాక్షి, అమరావతి: మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సముద్రంలో మత్స్య సంపదను వేటాడే వేళ గంగపుత్రులు ఆపదలో చిక్కుకుంటే.. రక్షించేందుకు వీలుగా అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం ఇస్రో అభివృద్ధి చేసిన కమ్యూనికేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

సెల్ సిగ్నల్ అందకపోయినా.. రక్షణ పరిధిలోకి

తీరం నుంచి సముద్రంలో 12 నాటికల్ మైళ్ల వరకు రాష్ట్ర పరిధిలో ఉండగా.. 12 నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు దేశీయ జలాలు. 200 నాటికల్ మైళ్ల దూరం దాటితే అంతర్జాతీయ జలాలుగా పరిగణిస్తారు. సంప్రదాయ, నాన్ మోటరైజ్డ్ బోట్లు తీరం నుంచి 4 నాటికల్ మైళ్ల వరకు వెళ్తుంటాయి. మోటరైజ్డ్ బోట్లు 12 నాటికల్ మైళ్ల వరకు, మెకనైజ్డ్ బోట్లు 12 నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు వెళ్లి వేట సాగిస్తుంటాయి. రాష్ట్రంలో 1,610 మెకనైజ్డ్, 22 వేల మోటరైజ్డ్, 6,343 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 1.60 లక్షల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఇప్పటివరకు వేట సాగించే మత్స్యకారులకు ఇన్‌కాయిస్ సంస్థ శాటిలైట్ ద్వారా సముద్రంలో మత్స్య సంపద ఎక్కువగా ఉండే ప్రదేశాలను (పీఎఫ్‌జెడ్-పొటెన్షియల్ ఫిషింగ్ జోన్స్) గుర్తించి బోట్లలో అమర్చే ఆటోమేటిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఏఐఎస్), మత్స్య శాఖ అభివృద్ధి చేసిన మొబైల్ యాప్స్ ద్వారా 12 నాటికల్ మైళ్ల పైబడి దూరం వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు సమాచారం అందిస్తున్నాయి. ఈ సమాచారం సంప్రదాయ, మోటరైజ్డ్ బోట్లకు అందించే అవకాశం లేదు. పైగా ఇది 2–3 రోజులు మాత్రమే ఉపయోగపడుతుంది. మరో వైపు ఏదైనా ఆపదలో ఉంటే తమ క్షేమ సమాచారం మొబైల్స్‌కు ఉండే సిగ్నల్స్‌పై ఆధారపడి ఉంటుంది. సిగ్నల్ మిస్ అయితే తీరానికి కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోతుంది. ఈ పరిస్థితికి ఇక చెక్ పెడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది.

100 శాతం సబ్సిడీపై..

కమ్యూనికేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్ (ట్రాన్స్‌పాండర్)ను 12 నాటికల్ మైళ్లకు పైబడి దూరం వెళ్లే మరబోట్లు, మెకనైజ్డ్ బోట్లకు అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.36,400 విలువైన ఈ పరికరాన్ని 100 శాతం సబ్సిడీతో అమర్చనున్నారు. తీరంలో గస్తీ కోసం అభివృద్ధి చేసిన ఐఆర్ఎన్ఎస్ఎస్ (నావిక్), జీపీఎస్ శాటిలైట్స్‌తో ఈ డివైస్ అనుసంధానమై పనిచేస్తుంది. బోట్లలోని మత్స్యకారుల వద్ద ఉండే స్మార్ట్ ఫోన్లను బ్లూటూత్ ద్వారా కనెక్ట్ చేసుకుంటే చాలు సిగ్నల్‌తో సంబంధం లేకుండా రెండువైపులా సమాచారాన్ని పరస్పరం పంపించుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

సమయం వృథా కాకుండా..

మరోవైపు ఇన్‌కాయిస్ సంస్థ అందించే పీఎఫ్‌జెడ్ సమాచారాన్ని కచ్చితమైన లొకేషన్స్‌తో బోట్లలోని మత్స్యకారులకు పంపడం వలన వారు క్షణాల్లో అక్కడకు చేరుకొని వేట సాగించడం ద్వారా సమయం, ఆయిల్ ఆదా అవుతుంది. పట్టుబడిన మత్స్యసంపదను ఏ సమయంలో ఏ రేవుకు తీసుకొస్తే మంచి రేటు వస్తుందో కూడా ఈ డివైస్ ద్వారా సమాచారం పంపిస్తారు. దీంతో తీరానికి చేరుకున్న తర్వాత తగిన ధర లేక మత్స్యకారులు నష్టపోయే పరిస్థితి ఉండదు. అయితే ఈ డివైస్ పనిచేయాలన్నా, సిగ్నల్‌తో సంబంధం లేకుండా స్మార్ట్ ఫోన్ పనిచేయాలన్నా.. సంబంధిత బోట్లలో రీ జనరేట్ చేసుకునే పవర్ సిస్టమ్ అవసరం ఉంటుంది.

వైపరీత్యాల వేళ అప్రమత్తం చేయొచ్చు

తుపాను హెచ్చరికలు, అకాల వర్షాలు, ఈదురు గాలులకు సంబంధించిన సమాచారాన్ని ఈ డివైస్ ద్వారా లోతు జలాల్లో వేట సాగించే అన్నిరకాల బోట్లకు క్షణాల్లో పంపించి వారిని అప్రమత్తం చేయవచ్చు. లోతు జలాల్లో ఉన్నవారిని సాధ్యమైనంత త్వరగా తీరానికి చేరుకునేలా హెచ్చరికలు జారీ చేయొచ్చు. ఎవరైనా ఆపదలో చిక్కుకుంటే ఈ డివైస్ ద్వారా సమాచారం పంపితే శాటిలైట్ ద్వారా గ్రౌండ్ స్టేషన్‌కు చేరుతుంది. అక్కడ నుంచి క్షణాల్లో ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న మోనిటరింగ్ స్టేషన్స్‌తోపాటు కోస్ట్ గార్డు, మెరైన్, నేవీ విభాగాలతోపాటు సమీపంలో ఉండే కమర్షియల్ వెసల్స్‌కు కూడా సమాచారం అందిస్తారు. తద్వారా క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని ప్రాణాలతో రక్షించే అవకాశం ఉంటుంది.

దశల వారీగా అమర్చుతాం



కమ్యూనికేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్ (ట్రాన్స్‌పాండర్)ను లోతు జలాల్లో మత్స్య వేట సాగించే బోట్లకు దశల వారీగా అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తొలి దశలో 4,484 బోట్లలో అమర్చనున్నాం. అక్టోబర్ నాటికి వీటి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నాం.

– వీవీ రావు, జేడీ, మత్స్య శాఖ (సముద్ర విభాగం)

కచ్చితత్వం... పారదర్శకం

▶ మొదటి పేజీ తరువాయి

వెడ్డింగ్ కార్డు, వివాహ ఫొటో, ఇంటి అడ్రస్ ప్రూఫ్, దంపతుల ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సాక్షులతో కలిసి రిజిస్టర్ ఆఫీసుకు వెళ్లి సంతకాలు పెడితే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. స్పెషల్ వివాహాల చట్టం కింద ఇతర సాంప్రదాయాల్లో జరిగే వివాహాలను ఆన్‌లైన్‌లోనే రిజిస్టర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. సొసైటీలు, సంస్థల (ఫర్మ్‌లు) రిజిస్ట్రేషన్లు సులభతరం చేసి ఆన్‌లైన్‌లో వాటిని చేసుకునేందుకు అవకాశమిచ్చింది.

‘ఈ–చిట్స్’తో మోసాలకు చెక్: చిట్‌ఫండ్ సంస్థల పేరిట జరుగుతోన్న మోసాలకు చెక్ పెట్టడానికి గాను ‘ఈ–చిట్స్’ పేరుతో రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక ఆప్షన్ ఇచ్చింది. చిట్‌ఫండ్ వ్యవహారాలన్నీ పారదర్శకంగా ఉండేలా, ప్రజలకు అన్ని విషయాలు తెలిసేలా ‘ఈ–చిట్స్’కు రూపకల్పన చేసింది. అలాగే చిట్ ఫండ్ సంస్థలు తమ రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇకపై ఏ చిట్‌ఫండ్ సంస్థ అయినా తమ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. నోటరీల రిజిస్ట్రేషన్‌నూ ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

వినతులకూ ఆప్షన్: రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ప్రజలు వినతులిచ్చేందుకు ప్రత్యేకంగా ఒక ఆప్షన్ ఇచ్చింది. గ్రీవెన్స్ రిడ్రెసల్ విధానంలో ఎవరైనా తమ విన్నపాన్ని ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు ఇచ్చే ఏర్పాటు చేసింది. ఆస్తుల రిజిస్ట్రేషన్లను నేరుగా ఆన్‌లైన్‌లో చేసుకునే విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. వినియోగదారులు తమ డాక్యుమెంట్లను తామే డేటా ఎంట్రీ ద్వారా తయారు చేసుకుని, ఆన్‌లైన్‌లో అవసరమైన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే ఆ సమయంలో ఒక్కసారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ప్రస్తుతం టెస్టింగ్‌లో ఉన్న ఈ విధానం త్వరలో అందుబాటులోకి రానుంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,617 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,752 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 5.67 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా...

2024లో బీజేపీ ప్రభుత్వం నుంచి స్వాతంత్య్రం: నితీశ్



పట్నా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి త్వరలోనే మనకు స్వాతంత్య్రం లభిస్తుందని బిహార్ సీఎం నితీశ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నిటినీ ఏకం చేసి బీజేపీని అధికారం నుంచి గద్దెదించుతానని ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం పట్నాలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మేం పనులు చేస్తుంటే ఢిల్లీలో ఉన్న వాళ్లు దుష్ప్రచారంలో మునిగిపోయారని మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అనంతరం డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మాట్లాడారు. మళ్లీ తమదే అధికారమంటూ ప్రధాని మోదీ చేసిన స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంపై మండిపడ్డారు. 'అది అహంకారం. ఏదీ శాశ్వతం కాదన్న సంగతిని ప్రధాని మర్చిపోయినట్లున్నారు' అని వ్యాఖ్యానించారు.

ఇక మా వంతు: లాలూ

పట్నా: ఢిల్లీలో ఎర్రకోటపై జెండా ఎగరేసే చిట్టచివరి అవకాశాన్ని ప్రధాని మోదీ వాడేశారని, ఇక వచ్చే ఏడాది మా వంతు వస్తుందని రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ వ్యాఖ్యానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వచ్చే స్వాతంత్య్రదినోత్సవాల్లో ఎర్రకోటపై మోదీ జెండా ఎగరేస్తారా? అన్న మీడియా ప్రశ్నకు లాలూ బదులిచ్చారు. ' లేదు. ఆ అవకాశమే లేదు. అప్పుడు మా వాళ్లు వస్తారుగా' అని వ్యాఖ్యానించారు. విపక్షాల ఇండియా కూటమి గెలుపు ఖాయమన్నారు.

మెరుగైన 'ఇండియా' కోసం కృషిచేద్దాం: మమత

కోల్‌కతా: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విపక్షాల కూటమి 'ఇండియా'ను పరోక్షంగా గుర్తుచేస్తూ తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ట్వీట్లు చేశారు. '' దేశ చరిత్ర సమస్తం ధైర్యసాహసాలతో నిండినదే. జాతీయజెండాను ఎగరేస్తున్న ఈ క్షణాన మనం స్వాతంత్య్రసమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం. వారు పోరాడి నిలిపిన విలువలను మరింత సమున్నత స్థాయికి తీసుకెళ్దాం. అంకితభావంతో ముందడుగు వేయాల్సిన త్యాగ స్ఫూర్తిని అందించారు. వైషమ్యాలు, విబేధాలను విడనాడి ఐక్యంగా మెరుగైన, వెలుగుల 'ఇండియా' కోసం శ్రమిద్దాం'' అని ట్వీట్‌చేశారు.

రాష్ట్ర జాబితాలోకి విద్యను మార్చాలి: స్టాలిన్



చెన్నై: రాజ్యాంగంలో ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్వాతంత్య్రదినోత్సవ ప్రసంగంలో ఆయన ఈ మేరకు రాష్ట్రపతి ముర్మును కోరారు. రాష్ట్ర జాబితాలో ఉన్న విద్య 1976లో 42వ రాజ్యాంగ సవరణ ఫలితంగా ఉమ్మడి జాబితాలోకి మారిందని గుర్తు చేశారు. విద్య సహా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం కలిగి ఉండే అంశాలన్నీ రాష్ట్ర జాబితాలోనే ఉండాలన్నారు. విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చడం ద్వారా మాత్రమే, క్రూరమైన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) వంటి అర్హత పరీక్షా విధానం పూర్తిగా రద్దవుతుందన్నారు. నీట్ అర్హత పరీక్ష నుంచి రాష్ట్రాన్ని మినహాయించాలంటూ తమిళనాడు ప్రభుత్వం పంపిన బిల్లుపై ఆమోదముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

సీజేఐపై ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ: ఎర్రకోట నుంచి ప్రసంగించిన ప్రధాని మోదీ సుప్రీంకోర్టును ప్రశంసించారు. సుప్రీం ఇచ్చే తీర్పుల్లో ముఖ్యమైన భాగాలను ప్రాంతీయ భాషల్లో అనువదించి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ గురించి ప్రధాని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వం మాతృభాషలో విద్యాబోధనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటే భారత ప్రధాన న్యాయమూర్తి తీర్పుల్ని పిటిషన్ దారుల మాతృభాషలో అనువదించి ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. దీని వల్ల మాతృభాషకుండే ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. అదే సమయంలో సభికుల మధ్యలో ఉన్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ రెండు చేతులు జోడించి ప్రధానికి నమస్కరించారు.

ప్రతి భారతీయుడి గొంతుక.. భరత మాత: రాహుల్



న్యూఢిల్లీ: అశక్తులు, శక్తివంతులు అనే బేధం లేకుండా ప్రతి ఒక్క భారతీయుని గొంతుకే 'భరత మాత' అని కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్యానించారు. 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం రాహుల్ గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో సందేశం ఇచ్చారు. ' నా ప్రేమమయ భరత మాత ఒక భూభాగం కాదు. ఏకరీతి ఆలోచనల సమూహం అంతకన్నా కాదు. ఒకే సంస్కృతి, చరిత్ర, మతం, కులం కాదు. అది ప్రతి ఒక్క భారతీయుడి గొంతుక. అందరిలో లోలోతుల్లో నిగూఢంగా దాగి ఉన్న సంతోషం, ఆందోళనలు, కష్టాల ప్రతిబింబమే భరత మాత. వారి ఆకాంక్షలు, లక్ష్యాలు వినాలంటూ కాస్తంత మౌనంగా ఉండాలి. నిశ్శబ్దంగా, వినమ్రతతో ఉన్నపుడు నా భరతమాత గొంతుక వినిపిస్తుంది' అని రాహుల్ ట్వీట్‌చేశారు.

మళ్లీ నేనే!

ఎర్రకోటపై నుంచి ఎన్నికల భేరీ మోగించిన నరేంద్ర మోదీ

వచ్చే ఏడాదీ ఇక్కడినుంచి నేనే జాతినుద్దేశించి ప్రసంగిస్తా

- అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు.. మూడు చీడ పురుగులు
- ప్రజలంతా వాటిని తప్పనిసరిగా వదిలించుకోవాలి
- ప్రజలంతా నా వాళ్లే.. ప్రజల నుంచే వచ్చా.. ప్రజల కోసమే జీవిస్తా
- అవినీతి పార్టీల కూటమి 'ఇండియా'.. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా'
- స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ



ఎర్రకోట పై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆగస్టు 15వ తేదీన ఢిల్లీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేస్తానని, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి, మళ్లీ తానే ప్రధానమంత్రి అవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. '2047 నాటికి సౌభాగ్యవంతమైన భారత్ అనే కలను సాకారం చేసుకొనే దిశగా రాబోయే ఐదేళ్ల కాలం ఒక స్వర్ణయుగమే అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ మంగళవారం ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి 90 నిమిషాలపాటు ప్రసంగించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించారు. రెండోసారి ప్రధానిగా మోదీకి ఇదే చివరి పంద్రాగస్టు ప్రసంగం కావడం విశేషం. ఎర్రకోటపై ప్రసంగించడం ఇది వరుసగా పదోసారి. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

దుష్ట రాజకీయాలపై యుద్ధమే

వారసత్వ పార్టీలను ప్రజలంతా వ్యతిరేకించాలి. బుజ్జగింపు రాజకీయాలు సామాజిక న్యాయానికి చాలా హాని కలిగించాయి. అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు కొన్ని దశాబ్దాలుగా మన వ్యవస్థలో ఒక భాగంగా మారిపోయాయి. దుష్ట రాజకీయాలపై ప్రజలు యుద్ధం ప్రకటించాలి. రాబోయే ఐదేళ్లు చాలా కీలకం. ఈ ఐదేళ్ల కాలంలో మనం చేసే పనులు మరో 1,000 సంవత్సరాలపాటు ప్రభావం చూపుతాయి. మనకు సమర్థవంతమైన యువ జనాభా ఉంది, గొప్ప ప్రజాస్వామ్యం ఉంది, వైవిధ్యం ఉంది. మన ప్రతి కల నెరవేరడానికి ఈ మూడు అంశాలు(త్రివేణి) చాలు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' అవినీతి పార్టీలతో నిండిపోయింది. బుజ్జగింపు రాజకీయాలకు, కుటుంబ పాలనకు పెద్దపీట వేసే పార్టీలు 'ఇండియా' పేరిట ఒక్కటయ్యాయి. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా' ఆత్మవిశ్వాసంతో ప్రకాశిస్తోంది.

'బంగారు పక్షి'గా భారత్

మనం గత 1,000 సంవత్సరాల బానిసత్వం, 1,000 సంవత్సరాల భవ్యమైన భవిష్యత్తు మధ్య మైలురాయి వద్ద ఉన్నాం. పరుగు ఆపొద్దు. కోల్పోయిన వైభవాన్ని తిరిగి సంపాదించుకోవాలి. రాబోయే వెయ్యేళ్ల దిశగా మన అడుగులను నిర్దేశించుకోవాలి. 2047 నాటికి మనదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. ఇది కేవలం ఒక కల కాదు, 140 కోట్ల మంది సంకల్పం. మనలో ప్రతిభాపాటవాలకు, శక్తి సామర్థ్యాలకు కొదవ లేదని 75 ఏళ్ల స్వాతంత్య్ర భారతదేశ చరిత్ర నిరూపించింది. 'బంగారు పక్షి'గా మన దేశం మళ్లీ మారడం ఖాయం. మణిపూర్‌లో శాంతి నెలకొంటుంది.

ధరల నియంత్రణకు మరిన్ని చర్యలు

ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటాం. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రపంచమంతటా ద్రవ్యోల్బణం అధికంగా ఉంది.

6జీ టెక్నాలజీకి దేశం సన్నద్ధం

దేశంలో 5జీ టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తోంది. ఇక 6జీ టెక్నాలజీ కోసం భారత్ సన్నద్ధమవుతోంది. ఈ విషయంలో ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. దేశంలో ప్రతి గ్రామానికీ ఇంటర్నెట్ చేరుకుంది. క్వాంటమ్ కంప్యూటర్ల రాక కోసం దేశం ఎదురు చూస్తోంది. ఆధునిక ప్రపంచాన్ని సాంకేతికత ప్రభావితం చేస్తోంది. 'డిజిటల్ ఇండియా' విజయగాథలను తెలుసుకోవడానికి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఆసక్తి చూపుతున్నాయి. అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. మన దేశంలో సెమీకండక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం. గతంతో పోలిస్తే డేటా చార్జీలు భారీగా తగ్గాయి. దీనివల్ల ప్రజలకు డబ్బు ఆదా అవుతోంది. శక్తివంతమైన జీ-20 కూటమికి ఈసారి మనమే సారథ్యం వహిస్తున్నాం.

స్వయం సహాయక సంఘాలకు అగ్రి-డ్రోన్లు

వ్యవసాయ రంగంలో టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి కొత్త పథకం రూపొందిస్తున్నాం. ఇందులో భాగంగా వేలాది మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ల వాడకంలో, మరమ్మతుల్లో శిక్షణ ఇస్తాం. తొలుత 15,000 స్వయం సహాయక సంఘాలతో ఈ పథకాన్ని ప్రారంభించబోతున్నాం. వారికి అగ్రి-డ్రోన్లు అందజేస్తాం. మహిళల సారథ్యంలోనే దేశాభివృద్ధి జరగాలని కోరుకుంటున్నాం, ఆ దిశగా కృషి చేస్తున్నాం. 2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చాలన్నదే నా లక్ష్యం. రైతాంగ ప్రయోజనం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.2.5 లక్షల కోట్లకుపైగా సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేశాం. ఎరువులపై భారీగా రాయితీలు ఇస్తున్నాం. అలాగే చౌక ధరలకే ఔషధాలు విక్రయించే 'జన ఔషధి కేంద్రాల' సంఖ్యను 25,000కు పెంచుతాం. నగరాల్లో సొంత ఇల్లు సమకూర్చుకోవాలని భావించే మధ్యతరగతి ప్రజలకు బ్యాంకు రుణాల వడ్డీల నుంచి ఉపశమనం కలిగించడానికి పథకం ప్రారంభిస్తాం.



ఎన్‌సీసీ క్యాడెట్లతో మోదీ ముచ్చట్లు

మన స్టార్టప్‌లు భేష్

ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదేశంలోనే ఉంది. మన యువత కృషితోపాటు ప్రభుత్వం అందించిన ప్రోత్సాహమే ఇందుకు కారణం. యువ శక్తిపై నాకు ఎంతో విశ్వాసం ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 98,119 స్టార్టప్‌లను ప్రభుత్వం గుర్తించింది. వాటికి నిధులతోపాటు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోంది. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో మనం ముందంజలో ఉన్నాం. నిర్దేశిత హరిత లక్ష్యాలను గడువు కంటే ముందే సాధించాం. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. మన సైనిక దళాలను ఆధునీకరించడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. గతంలో బాంబుపేలుళ్ల గురించి వినేవాళ్లం. ఇప్పుడు దేశం భద్రంగా ఉంది. శాంతి భద్రతలు ఉన్నప్పుడే అభివృద్ధిపై దృష్టి పెట్టగలుగుతాం. స్పేస్ టెక్నాలజీలో అభివృద్ధి సాధిస్తున్నాం. వందే భారత్ రైళ్లు ప్రారంభించుకుంటున్నాం. బుల్లెట్ రైళ్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

9 కోట్ల మంది అనర్హులను ఏరిపారేశాం



గత తొమ్మిదేళ్లలో సంక్షేమ పథకాలను ప్రక్షాళన చేశాం. పారదర్శకత తీసుకొచ్చాం. 9 కోట్ల మంది అనర్హులను ఏరిపారేశాం. అవినీతిపరుల ఆస్తుల స్వాధీనం తొమ్మిదేళ్లలో 20 రెట్లు పెరిగింది. అవినీతిపరులకు కోర్టుల నుంచి బెయిల్ దొరకడం కష్టంగా మారింది. ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. పునాదిరాళ్లు వేశాం. వాటిని నేనే ప్రారంభిస్తానన్న విశ్వాసం ఉంది. పార్లమెంట్ నూతన భవన నిర్మాణాన్ని గడువు కంటే ముందే పూర్తిచేశాం. 2014లో మనది ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 140 కోట్ల మంది శ్రమతో ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగాం. ఇదంతా సులభంగా జరగలేదు. అవినీతిని అరికట్టాం. బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాం. గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ ఇప్పుడు ముఖ్యమైన భాగస్వామి. మన దేశం సాధించిన విజయాలు ప్రపంచ స్థిరత్వానికి ఒక హామీగా నిలుస్తాయి. భారత్‌కు ఇక తిరుగులేదని ప్రపంచ నిపుణులు చెబుతున్నారు. శషభిషలకు ఇక తావు లేదు. మన పట్ల ప్రపంచానికి నమ్మకం పెరిగింది. బంతి మన కోర్టులోనే ఉంది. ఈ అవకాశం జారవిడుచుకోవద్దు.

నా ప్రతి కల జనం కోసమే

ప్రజలంతా నా వాళ్లే. నేను ప్రజల నుంచే వచ్చా. ప్రజల కోసమే జీవిస్తా. నేను ఏదైనా కల కన్నానంటే అది జనం కోసమే. వారి కోసం కష్టపడి పని చేస్తున్నా. ఇదంతా కేవలం ఒక బాధ్యత అప్పగించారు కాబట్టి చేయట్లేదు, ప్రజలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నాను కాబట్టి చేస్తున్నా. ప్రజల్లో ఒకడిగా ఆ ప్రజల బాధలను, కష్టాలను సహించలేను. ప్రజల కలలు విచ్ఛిన్నమైపోవడాన్ని అనుమతించను. 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో జనం కోసం పని చేస్తున్నా.

విశ్వకర్మ యోజన

రూ.13,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లతో విశ్వకర్మ యోజన అమలు చేస్తాం. వడ్రంగులు, స్వర్ణకారుల వంటి సంప్రదాయ వృత్తుల్లో ఉన్న వారికి జీవనోపాధి అవకాశాలు పెంచడమే ఈ పథకం లక్ష్యం. దీంతో ప్రధానంగా ఓబీసీలు ప్రయోజనం పొందుతారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తాం. పేదరికం తగ్గితే మధ్య తరగతి ప్రజల బలం పెరుగుతుంది. దేశంలో గత ఐదేళ్లలో 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఇంతకంటే జీవితంలో సంతృప్తి ఇంకేమీ ఉండదు.

ట్రంప్‌పై మరో తీవ్రమైన అభియోగం

అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాల తారుమారుకు యత్నించారని ఆరోపణ



వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయ్యేందుకు అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి జార్జియా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా గ్రాండ్ జ్యూరీ అభియోగాలు నమోదుచేసింది. మరోసారి అధ్యక్షపీఠంపై కూర్చుకునేందుకు తహతహలాడుతున్న ట్రంప్‌పై అభియోగాలు నమోదవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఫుల్టన్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ సోమవారం తన 41-చార్జ్ అభియోగాల పత్రంలో సంబంధిత వివరాలను పొందుపరిచింది. ట్రంప్‌తోపాటు మరో 18 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. ఎన్నికల ఫలితాలు ట్రంప్‌కు అనుకూలంగా వచ్చేలా చేసేందుకు తోటి వ్యక్తులు కుట్ర పన్నారని జ్యూరీ పేర్కొంది. ఆగస్ట్ 25వ తేదీలోపు ఈ 19 మంది స్వచ్ఛందంగా సరెండర్ కావాలని ఫుల్టన్ కౌంటీ జిల్లా మహిళా అటార్నీ ఫ్యానీ విల్లీస్ సోమవారం ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ట్రంప్ మాజీ న్యాయవాది రూడీ గిలియానీ, శ్వేతసౌధం మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మిడోస్, అధ్యక్షభవనం మాజీ న్యాయవాది జాన్ ఈస్ట్‌మన్, న్యాయశాఖ మాజీ ఉన్నతాధికారి జెఫ్రీ క్లార్క్ ఉన్నారు.

రాజకీయ దురుద్దేశం: ట్రంప్

'ఇదంతా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణ' అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అభియోగాలను అధికార డెమొక్రటిక్ పార్టీ నేతలు సమర్థించారు. 'ఎన్నికల ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ట్రంప్ పన్నిన కుట్రను ఈ అభియోగాలు బట్టబయలుచేస్తున్నాయి' అని సెనేట్ మెజారిటీ లీడర్ షూమర్, హౌజ్ మైనారిటీ లీడర్ హకీమ్ అన్నారు.



రష్యా గ్యాస్ స్టేషన్‌లో భారీ పేలుడు

35 మంది మృతి, 115 మందికి గాయాలు


మాస్కో: రష్యాలోని దక్షిణ ప్రాంత దగెస్తాన్ రిపబ్లిక్‌లోని ఓ గ్యాస్ స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడులో 35 మంది చనిపోగా మరో 115 మంది క్షతగాత్రులయ్యారు. దగెస్తాన్ రాజధాని మఖాచ్కాలా శివారులో సోమవారం రాత్రి ఈ పెను విషాద ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో 16 మంది చిన్నారులు సహా 65 మందిని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు సహా 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. మొదటగా కారు రిపేరు షెడ్డులో ప్రారంభమైన మంటలు సమీపంలోని గ్యాస్ స్టేషన్‌కు పాకడంతో పేలుడు సంభవించినట్లు అధికారులు వివరించారు. ఇటీవలి కాలంలో రష్యాలో సంభవించిన అతిపెద్ద పేలుడు ఘటన ఇదే.

53కు చేరిన 'హిమాచల్' మరణాలు

షిమ్లా: వర్షబీభత్సంతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో తాజాగా వర్షసంబంధ ఘటనల్లో మరణాల సంఖ్య 53కు పెరిగింది. షిమ్లాలోని శివాలయంపై కొండచరియలు పడిన దుర్ఘటనలో ఘటనాస్థలి నుంచి మరో రెండు మృతదేహాలను వెలికితీశారు. సమ్మర్‌హిల్, ఫాగ్లీలో కొండచరియలు పడిన ఘటనలో ఇప్పటిదాకా 16 మృతదేహాలను వెలికితీశారు. ఇంకా ఈ ప్రాంతాల్లో మరో 10 మంది శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని అధికారులు భావిస్తున్నారు. బాధితుల జాడ కోసం ఘటనాస్థలాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, సైన్యం ముమ్మర గాలింపు చర్యలను చేపట్టిందని షిమ్లా డెప్యూటీ కమిషనర్ ఆదిత్య నేగీ చెప్పారు. భారీ వర్షాల కారణంగా సోమవారం సహాయక చర్యలను ఆపేయాల్సి వచ్చింది. కొండచరియలు పడటంతో ప్రఖ్యాత వారసత్వ షిమ్లా-కల్కా రైల్వేలైన్ మార్గం దెబ్బతింది. 50 మీటర్లమేర వంతెన కొట్టుకుపోవడంతో అక్కడి రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. రాష్ట్రంలో 12 జిల్లాలుండగా 11 జిల్లాల్లో వేలకొలదీ విద్యుత్, వందలకొలదీ నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. 10వేల గృహాలు ధ్వంసమయ్యాయి. కాగా, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొండచరియలు పడిన ఘటనల్లో గల్లంతైన వారి జాడ కోసం అన్వేషణ మంగళవారం మొదలైంది. ఇప్పటిదాకా వర్ష సంబంధ ఘటనల్లో ఉత్తరాఖండ్‌లో నలుగురు మరణించారు. వేర్వేరు చోట్ల తొమ్మిది మంది జాడ తెలియాల్సిఉంది.

'సులభ్' పాఠక్ కన్నుమూత

- స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్న కొద్దిసేపటికే అస్వస్థత
- ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస



న్యూఢిల్లీ: సులభ్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్(80) కన్నుమూశారు. ప్రజా మరుగుదొడ్లను నిర్మించడంలో ఆద్యుడిగా ఆయనకు పేరుంది. మంగళవారం ఉదయం పాలెక్ పాలమ్-డాబ్రి రోడ్డులో ఉన్న సులభ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కొద్ది సేపటి తర్వాత ఇబ్బందిగా ఉందని చెప్పడంతో ఆయన్ను ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలోనే ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు సన్నిహితులు వెల్లడించారు. పాఠక్ నెలకొల్పిన సులభ్ ఇంటర్నేషనల్ సామాజిక సేవా సంస్థ మానవ హక్కులు, పర్యావరణ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, విద్యా సంస్కరణల కోసం కృషి చేస్తోంది. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రాంపూర్ బఘేల్ గ్రామంలో ఓ బ్రాహ్మణ కుటుంబంలో పాఠక్ జన్మించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. 'పరిశుభ్ర భారత్ లక్ష్యంగా పనిచేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌కు మద్దతుగా నిలిచారు'అంటూ 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు.

టాయిలెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

పాఠక్‌ను 'టాయిలెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేర్కొంటారు. పీహెచ్‌డీ థీసిస్‌లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటించి పారిశుధ్య కార్మికులతో గడిపారు. 1968లో పారిశుధ్య కార్మికుల సమస్యలపై పోరాటానికి ఆయన 'భంగి ముక్తి'ఉద్యమంలో పాల్గొన్నారు. బహిరంగ మల విసర్జనను రూపుమాపేందుకు 1970ల్లో సులభ్ సంస్థను స్థాపించి మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. సులభ్ టాయిలెట్లను అనుసంధానించి దుర్వాసన రాని బయోగ్యాస్ తయారు చేసే విధానానికి మూడు దశాబ్దాల క్రితమే ఆయన ప్రారంభించారు. కేంద్రం ఆయన్ను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన్ను ఎన్నో అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 1,600 పట్టణాల్లోని 9 వేలకు పైగా పబ్లిక్ టాయిలెట్లను సులభ్ నిర్వహిస్తోంది.

అబద్ధాలు, అతిశయోక్తులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: స్వాతంత్య్రదిన వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగంపై విపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. వక్రీకరణలు, అబద్ధాలు, అతిశయోక్తులు, శుష్కవాగ్దానాలతో కూడిన ఎన్నికల ప్రసంగం చేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. స్వాతంత్య్రదినోత్సవ వేళ దేశ ప్రజలందరినీ ఏకతాటికి పైకి తేవాల్సిన ప్రధాని ప్రసంగంలో తన గొప్పలు, ప్రతిష్ఠ గురించి చెప్పుకోవడానికే సరిపోయిందని పేర్కొంది. స్వాతంత్య్రదినోత్సవం నాడు ప్రధాని ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారంటే భారత్‌ను ఆయన ఎలా తీర్చిదిద్దగలరని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకి ఏం చేసిందో చెప్పకుండా ఎన్నికల ప్రసంగంలా మార్చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు.

అక్షయ్ కుమార్‌కు భారత పౌరసత్వం



ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్(55)కు భారత పౌరసత్వం లభించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం ఆయన స్వయంగా ప్రకటించారు. 'నేను మళ్లీ భారత పౌరుడినయ్యా. నా హృదయం, పౌరసత్వం రెండూ హిందుస్తానీయే. హ్యాపీ ఇండిపెండెన్స్ డే, జై హింద్!' అని పేర్కొన్నారు. భారత పౌరసత్వం ధ్రువీకరణ పత్రాన్ని ఆయన షేర్ చేశారు. 1990ల్లో తను నటించిన సినిమాలు వరుసగా 15 వరకు ఫ్లాప్ కావడంతో కెనడా పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు గతంలో ఆయన తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ప్రధాని మోదీతో అక్షయ్ కుమార్ భేటీ అయ్యారు. దీని తర్వాత ఆయన పౌరసత్వం అంశంపై మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దీంతో, ఆ ఎన్నికల్లో ఆయన ఓటు వేయలేదు. భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అక్షయ్ ఆ తర్వాత ప్రకటించారు. అక్షయ్ హీరోగా నటించిన 'ఓఎంజీ 2' సినిమా గత వారం దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయింది.

అల్లర్ల బాధితులకు రెడీమేడ్ ఇళ్లు



ఇంఫాల్: మణిపూర్ అల్లర్లలో నిరాశ్రయులైన 3 వేల కుటుంబాలకు మొదటి విడతలో ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లను సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జూన్ 26వ తేదీ నుంచి రాష్ట్రంలోని అయిదు ప్రాంతాల్లో రెడీమేడ్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ బాధ్యతను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది. గత మూడు నెలలుగా కొనసాగుతున్న అల్లర్లలో ఇళ్లు కోల్పోయిన వేలాదిమంది ప్రభుత్వం నిర్వహిస్తున్న తాత్కాలిక సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. మణిపూర్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.బ్రోజెంద్రో వివరాలు వెల్లడించారు. 'రహదారుల దిగ్బంధం కారణంగా ఇంటి సామగ్రి రవాణా కష్టంగా మారింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిబ్బందిని విమానాల ద్వారా అక్కడికి తరలిస్తున్నాం. పశ్చిమ ఇంఫాల్‌లోని సెక్మాయ్, తూర్పు ఇంఫాల్‌లోని సవోంబుంగ్‌లో ఇళ్లు నిర్మిస్తున్నాం. వైరి వర్గాల మధ్య కాల్పుల ఘటనల కారణంగా క్వాక్తా ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది' అని చెప్పారు.

చైనాలో తగ్గని వరదలు

బీజింగ్: చైనాను వరదలు ఇంకా వణికిస్తున్నాయి. ఈశాన్య చైనాలో ఏకంగా 90 నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వీటిలో 24 ప్రమాదకర స్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. బీజింగ్‌కు ఉత్తరాన ఉన్న సొంగలియో తీర ప్రాంతానికి వరద ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తీర ప్రాంతంలో నాలుగు ప్రావిన్స్‌లు, పలు నగరాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో దాదాపుగా 10 కోట్ల మంది నివసిస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో సహాయ సిబ్బంది రంగంలోకి దిగారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నారు. వాతావరణ మార్పులతో చైనాలో కనీవినీ ఎరుగని రీతిలో వర్షాలు కురుస్తున్నాయి. జులైలో కురిసిన వర్షాలకు 150 మంది వరకు మరణించారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం : 16 : ఆగస్టు : 2023

వైగై ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 46 ఏళ్లు పూర్తి

తిరువొత్తియూరు: వైగై ఎక్స్‌ప్రెస్ ప్రారంభించి మంగళ వారం 46 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో ప్రయాణికులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వివరాలు.. వైగై ఎక్స్‌ప్రెస్, చెన్నై, మదురై మధ్య రోజువారీగా నడుస్తోంది. ఈ ట్రైన్ 1977 ఆగస్టు 15న ప్రారంభించారు. ఈ రైలు సేవ దక్షిణాది జిల్లా ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది. ఇంకా ఈ రైలు ప్రవేశపెట్టిన సంవత్సరంలో, మీటర్–గేజ్ లైన్‌లో 105 కిలో మీటర్ల సగటు వేగంతో నడుస్తోంది. ఆసియాలో మీటర్ గేజ్‌లో అత్యంత వేగంగా ప్రయాణించిన మొదటి రైలు కావడం గమనార్హం. ఇక తమిళనాడు దక్షిణాది జిల్లా ప్రజల రవాణా అవసరాలకు గొప్పగా సేవలందించిన వైగై ఎక్స్‌ప్రెస్ రైలు 46వ వసంతంలోకి అడుగుపెట్టడంతో ప్రయాణికులు, డ్రైవర్లు వేడుకలు చేసుకున్నారు.

న్యూస్‌రీల్

ఐపీఎస్ అధికారుల బదిలీ

సాక్షి, చెన్నై: ఏడుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రధాన కార్యదర్శి పి. అముదా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర నేర రికార్డుల విభాగం ఎస్పీ కలై సెల్వన్‌ను ఆర్థిక నేర విభాగం ఎస్పీగా బదిలీ చేశారు. ఆర్థిక నేర విభాగం ఎస్పీ మహేశ్వరన్‌ను చెన్నై కంట్రోల్ రూమ్ అసిస్టెంట్ కమిషనర్‌గా, ఇక్కడ పనిచేస్తున్న ఆరోగ్యంను సెంట్రల్ క్రైం బ్రాంచ్‌కు స్థాన చలనం కల్పించారు. సెంట్రల్ క్రైం బ్రాంచ్‌లో ఉన్న స్టాలిన్‌ను సెంట్రల్ క్రైం తొలి గ్రేడ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడున్న నాగ జ్యోతిని రాష్ట్ర నేర రికార్డుల విభాగం ఎస్పీగా బదిలీ చేశారు. సేలం నగర దక్షిణ జోన్ అసిస్టెంట్ కమిషనర్ రాజేంద్రన్‌ను కోయంబత్తూరు ట్రాఫిక్‌కు, ఇక్కడ పనిచేస్తున్న మది వానన్‌ను సేలంకు స్థాన చలనం కల్పించారు.

రెండు కార్లు ఢీ - ఇద్దరు మృతి

అన్నానగర్: రాయకోట్టై సమీపంలో మంగళ వారం తెల్లవారుజామున రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురి జిల్లా పాలకోడ్ ప్రాంతానికి చెందిన మునియప్ప (40). మంగళవారం తెల్లవారుజామున పాలకోట్ నుంచి రాయకోట్‌కు కారులో వచ్చాడు. అదేవిధంగా రాయకోట సమీపంలోని కూతనపల్లి ప్రాంతానికి చెందిన మరో కారు నల్లరాలపల్లి మీదుగా రాయకోట వైపు వస్తోంది. ఈ కారును కూతనపల్లికి చెందిన పాపయ్య కుమారుడు రామమూర్తి(23) నడుపుతున్నాడు. ఆ కారులో అదే పట్టణానికి చెందిన కార్తీక్ (24), కుమార్ (24), సుమేష్ (24), రమేష్ (24), సత్యమూర్తి (24) అనే ఐదుగురు ఉన్నారు. రాయకోట సమీపంలోని అలీసీభం బాలాపురం వద్ద నాలుగు లైన్ల రహదారిపైకి కారు రాగానే రామమూర్తి నడుపుతున్న కారు, మునియప్ప నడుపుతున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ రామమూర్తి, కార్తిక్ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే సుమేష్, రమేష్, సత్యమూర్తి, పతింకుమార్, మునియప్పకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు వారిని రక్షించి అంబులెన్స్‌లో హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి తీవ్ర చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై ఉతన్నపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచ్చి, సేలం మెట్రోకు కార్యాచరణ

- నెలాఖరులో నివేదిక



సాక్షి, చెన్నై: తిరుచ్చి, సేలంలో మెట్రో రైలు సేవల ఏర్పాటుకు సంబంధించిన నివేదిక ఈనెలాఖరులో అధికారులు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తులు పూర్తయినట్లు సమాచారం. వివరాలు.. చెన్నైలోని రెండు మార్గాల లో మెట్రో రైలు సేవలు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రూ. 63 వేల కోట్లతో మరో మూడు మార్గాల్లో మెట్రో రైలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలోని కోయంబత్తూరు, మదురై, సేలం, తిరుచ్చి, తిరునల్వేలి నగరాలలో సైతం మెట్రో రైలు సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన సాధ్యా అసాధ్యాల పరిశీలన జరుగుతోంది. ఈ పరిస్థితులలో సేలం, తిరుచ్చిలలో చేపట్టనున్న పనులకు సంబంధించిన నివేదిక పూర్తి కావచ్చాయి. ఇక్కడ పరిశోధనలు ముగించారు. మెట్రో రైలు పనులకు రూట్ మ్యాప్, స్టేషన్లు తదితర అన్ని అంశాలతో నివేదిక తుది మెరుగులు దిద్దుతున్నారు. సేలంలో 40 కి.మీ దూరం రెండు మార్గాలలో, తిరుచ్చిలో 38 కి.మీ దూరం రెండు మార్గాలలో పనులు చేపట్టేందుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను రూపొందించారు. ఈ నివేదికను నెలాఖరులో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు మెట్రో యాజమాన్యం చర్యలు చేపట్టింది.

18న చెన్నైలో ప్లాస్టిక్ పరిశ్రమల సాంకేతిక సదస్సు

సాక్షి, చెన్నై: ఆత్మ నిర్భర్ భారత్‌కు ప్రోత్సాహం దేశీయ ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల ప్రగతి ప్రణాళిక లక్ష్యంగా చెన్నై వేదికగా ఈనెల 18న సాంకేతిక సదస్సు జరగనుంది. ఆల్ ఇండియా ప్లాస్టిక్స్ తయారీ దారుల సంఘం (ఏఎంటీఈసీ), కేంద్ర ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా చొరవకు మద్దతుగా ఏఐపీఎంఏ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ సదస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఏఐపీఎంఏ అధ్యక్షుడు మయూర్ డి షా, కౌన్సిల్ చైర్మన్ అరవింద్‌మెహత మంగళవారం స్థానికంగా ఈ సదస్సు వివరాలు, ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ప్రస్తుతం మనదేశం ప్రపంచ ప్రీమియం ప్లాస్టిక్ సరఫరా కేంద్రంగా మారుతోందని తెలిపారు. ఈ తరుణంలో పరిశ్రమ వృద్ధి, దిగుమతి ప్రత్యామ్నాయాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియాకు మద్దతుగా చెన్నై హయాత్ రీజెన్సీలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, రసాయనాలు, పెట్రో రసాయనల శాఖ, వాణిజ్య శాఖల మద్దతుతో మేక్ ఇన్ ఇండియా– మేక్ ఫర్ ది వరల్డ్ నినాదంతో సాంకేతిక సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

మువ్వన్నెల రెపరెపలు

రాష్ట్రంలో మంగళవారం వాడవాడలా త్రివర్ణ పతాకం రెప రెప లాడింది. చెన్నై జార్జ్‌కోట వేదికగా వరుసగా మూడోసారి సీఎం ఎంకే స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. స్వాతంత్య్ర సమరయోధులు, త్యాగధనుల కుటుంబాల పింఛన్‌ను పెంచడమే కాకుండా, ఈ ఏడాది 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. మిసైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ప్రొఫెసర్ వసంత కందస్వామికి, కల్పనా చావ్లా అవార్డును ఎవరెస్టును అధిరోహించిన ముత్తమిల్ సెల్వికి ప్రదానం చేశారు.




జాతీయ పతాకాన్ని ఎగురవేసి.. సెల్యూట్ చేస్తున్న సీఎం స్టాలిన్

వాడవాడలా స్వాతంత్య్ర వేడుకలు

- జార్జ్‌కోటలో జెండా ఎగర వేసిన సీఎం స్టాలిన్
- సమరయోధులకు పింఛన్ మరింత పెంపు
- 500 మంది మహిళలకు రూ. లక్ష రాయితీతో ఆటోలు
- ఈ ఏడాది 55 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- ప్రొఫెసర్ వసంత కందస్వామికి కలాం అవార్డు
- ఎవరెస్టు ఎక్కిన ముత్తమిళ్ సెల్వికి కల్పనా చావ్లా అవార్డు ప్రదానం



ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : దేశ భక్తి, సమైఖ్యతను చాటే విధంగా రాష్ట్రంలో మంగళవారం దేశ 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, న్యాయ స్థానాలు, రాజకీయ పక్షాల కార్యాలయాలు ఇలా వాడవాడల్లో మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. గౌరవ వందనం సమర్పించారు. చాక్లెట్లు, స్వీట్లు, మిఠాయిలు పంచి పెట్టారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణ త్యాగం చేసిన వీరులను స్మరించుకున్నారు. రాజ్ భవన్‌లో జరిగిన వేడుకలో గవర్నర్ ఆర్ఎన్ రవి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. హైకోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్వాల, దక్షిణ రైల్వే మైదానంలో జీఎం ఆర్ఎన్ సింగ్, ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఈశ్వరరావు, చెన్నై హార్బర్‌లో చైర్మన్ సునీల్ పాలివాల్ జాతీయ పతాకాన్ని ఎగుర వేసి గౌరవ వందనం సమర్పించారు. చెన్నై కొడుంగయూరులో 100 అడుగుల జెండాను చేత బట్టి 400 మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర సముద్ర తీరంలో నావికాదళం, భారత కోస్టుగార్డుల నేతృత్వంలో వీరులు పడవలు, నౌకలపై జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అలాగే, నీటిలోనూ స్కూబా డైవింగ్‌తో జెండా రెపరెపలాడే విధంగా దూసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో జార్జ్‌కోటలోని సచివాలయం వేదికగా వేడుకలు ఘనంగా జరిగాయి.

జాతీయ పతాకం ఎగుర వేసిన సీఎం స్టాలిన్

సచివాలయం ఆవరణలో స్వాతంత్య్ర సంబరాలు మిన్నంటాయి. ఆళ్వార్ పేట సీఐటీ నగర్‌లోని నివాసం నుంచి సీఎం స్టాలిన్ ఉదయాన్నే సచివాలయానికి బయలు దేరారు. మెరీనా తీరం వైపుగా కాన్వాయ్ రాగానే, రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ప్రజలకు సీఎం అభివాదం తెలియజేశారు. సచివాలయం ఆవరణలో ఆయనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీన, డీజీపీ శంకర్ జివ్వాల్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. త్రివిధ దళాధిపతుల్ని, పోలీసు ఉన్నతాధికారుల్ని ఈ సందర్భంగా సీఎంకు పరిచయం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదిక మీద నిలబడి రాష్ట్ర పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి గౌర వందనాన్ని సీఎం అందుకున్నారు. ఓపెన్ టాప్ వాహనంలో ప్రజలకు అభివాదం తెలుపుతూ ముందుకు సాగారు. అనంతరం సచివాలయం ఆవరణలోని 150 అడుగుల జెండా స్తూపంలో త్రివర్ణ పతకాన్ని ఎగుర వేసి గౌరవ వందనం సమర్పించారు.

అవార్డుల ప్రదానం

దివ్యాంగులు మహిళలకు, ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన, సంఘాలకు, సంస్థలకు, సాహస వీరులకు, పోలీసు అధికారులకు పలు అవార్డులను ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ అందజేశారు. తమిళాభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్న ద్రవిడ కళగం నేత వీరమణికి తగైసాల్ తమిళర్ అవార్డును అందజేశారు. వేలూరుకు చెందిన ప్రొఫెసర్ వసంత కందస్వామికి మిస్సైల్ మెన్ ఏపీజే అబ్దుల్ కలాం పేరిట అవార్డును, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన చెంగల్పట్టుకు చెందిన ముత్తమిళ్ సెల్వికి కల్పానా చావ్లా అవార్డును ప్రదానం చేశారు. అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న ఉత్తమ మహానగరం. కార్పొరేషన్, ఉత్తమ నగర పాలక సంస్థలను ఎంపిక చేసిన అవార్డులను అందజేశారు. సీఎం ఉత్తమ అవార్డును రమణ సరస్వతి, ప్రత్యేక ప్రతిభావంతులకు సేవలందిస్తున్న కన్యాకుమారి శాంతి నిలయానికి ఉత్తమ సామాజిక సేవ అవార్డును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అవార్డును రాజీవ్ గాంధీ జీహెచ్ డీన్ తేరడి రాజన్‌కు, రాష్ట్ర యువజన అవార్డును సాహస వీరుడు రాజశేఖరన్‌కు అందజేశారు.

అభివృద్ధిలో తొలిస్థానమే లక్ష్యం

ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ స్వాతంత్య్ర సమరయోధులు, త్యాగుల కుటుంబాలకు అందజేస్తున్న నెలసరి పింఛన్‌ను రూ.10 నుంచి రూ.11 వేలుగా పెంచుతున్నామని ప్రకటించారు. దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో తమిళనాడును తొలిస్థానంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం నిత్యం ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తోందన్నారు. సీఎం అల్పాహార పథకాన్ని ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31,008 పాఠశాలలలో 15.75 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా విస్తరించనున్నామన్నారు. విద్యను రాష్ట్ర జాబితాలకు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, అన్ని రంగాలలో తమిళనాడును అగ్రగామిగా నిలబెడుతామన్నారు. ఓలా, ఉబర్, స్విగ్గి, జుమోటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. 500 మంది మహిళా డ్రైవర్లకు రూ. లక్ష రాయితీతో ఆటోలను అందజేయనున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ రంగ సంస్థలలో 55 వేల ఉద్యోగాలను భర్తీ చేయిస్తామన్నారు. ఇలా ఉండగా స్వాతంత్య్ర దినోత్సవం వేళ అందరూ ఓ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిస్తూ, తొమ్మిదేళ్లు ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న వారిని తరిమి కొడుదామని సీఎం ట్వీట్ చేశారు.

బాలుడి కోరిక నెరవేర్చిన సీఎం

కాగా, ఈ వేడుకల్లో ఓ బాలుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. రామనాథపురానికి చెందిన లిదర్సన్ అనే బాలుడు తాను స్వాతంత్య్ర వేడుకలను ప్రత్యక్షంగా తిలకించాలని ఆశ పడుతున్నట్టు సీఎంకు లేఖ రాశాడు. దీంతో తన తల్లి ఆనంద వల్లితో కలిసి లిదర్సన్ ప్రత్యేక ఆహ్వానితుడిగా వీఐపీ గ్యాలరీలో కూర్చుని వీక్షించాడు. అలాగే చెన్నైలోని 32 ఆలయాల్లో సహ పంక్తి భోజన కార్యక్రమం జరిగింది. ఇందులో మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రజలతో కలిసి భోజనం చేశారు. ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయంలో మంత్రి ఉదయనిధి పాల్గొన్నారు.



సీఎం స్టాలిన్‌తో అవార్డు గ్రహీతలు



వీరమణికి తమిళర్ అవార్డును అందజేస్తున్న సీఎం



సహపంక్తి భోజనం చేస్తున్న ఉదయనిధి స్టాలిన్

తిరుత్తణి హుండీ ఆదాయం రూ. 2.17 కోట్లు



తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా భక్తులు హుండీల ద్వారా రూ. 2.17 కోట్లు కానుకలు చెల్లించినట్లు ఆలయ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. లక్షలాది మంది భక్తులు కావళ్లు చెల్లించి కొండ ఆలయంలోని హుండీల్లో కానుకలు సమర్పించుకున్నారు. ఉత్సవాలు ముగియడంతో భక్తులు చెల్లించిన కానుకలను కొండ ఆలయ దేవర మండపంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ సమక్షంలో ఆలయ సిబ్బంది లెక్కించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఈ లెక్కింపులో వంద మందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు. రూ. రూ.2.18 కోట్ల నగదు, 345 గ్రాముల బంగారం, 13,012 గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా చెల్లించినట్లు తెలిపారు.

పరందూరులో నల్ల జెండాలతో నిరసన



స్వాతంత్య్ర వేడుకలు బహిష్కరణ

సాక్షి, చెన్నై: విమానాశ్రయానికి వ్యతిరేకంగా పరందూరు పరిసరాల్లోని 13 గ్రామాల ప్రజలు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను మంగళవారం బహిష్కరించారు. తమ ఇళ్లపై నల్ల జెండాలను ఎగుర వేశారు. వివరాలు.. చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో పెరిగిన రద్దీతో మరో విమానాశ్రయం నిర్మాణంపై కేంద్రం దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం కాంచీపురం జిల్లా పరిధిలోని పరందూరును ఎంపిక చేశారు. చెన్నై నుంచి 60 కి.మీ దూరంలో ఈ పరందూరు ఉండటం, ఇక్కడ 4,798 ఎకరాల స్థలం ఉండడం విమానాశ్రయానికి అనుకూలంగా మారింది. ఈ పనులను రూ. 40 వేల కోట్లతో చేపట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. స్థల సేకరణకు తగ్గ కసరత్తుపై అధికారులు దృష్టి పెట్టారు. అయితే, తమ పంట పొలాలను విమానాశ్రయం కోసం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను పరందూరుతో పాటు 13 గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఏడాదికి పైగా ఇక్కడ ఉద్యమం జరుగుతోంది. ఏకనాపురం వేదికగా నిరసన తెలియజేస్తూ వస్తున్న ఉద్యమకారులను సోమవారం కాంచీపురం జిల్లా అధికారులు బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా తాము స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను బహిష్కరిస్తున్నామని గ్రామస్తులు స్పష్టం చేశారు. అలాగే తమ ఇళ్లపై, వీధుల్లోని స్తంభాలపై నల్ల జెండాలను ఎగుర వేసి నిరసన తెలియజేశారు. అలాగే పాఠశాల ఆవరణలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు తమ పిల్లలను పంపించలేదు. ఇక గ్రామసభలో విమానాశ్రయానికి వ్యతిరేకంగా మరోమారు గ్రామస్తులు తీర్మానం చేశారు.

వైఎస్సార్ సీపీ సేవాదళ్ నేతృత్వంలో విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తున్న జకీర్ హుస్సేన్ తదితరులు




జాతీయ జెండాలతో చిన్నారులు

సాక్షి, చెన్నై : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నైలోని వైఎస్సార్ సీపీ సేవాదళ్ నేతృత్వంలో సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు. అనంతరం పెరంబూరులోని సోమ సుందరం నగర్‌లో జాతీయ జెండాను ఎగుర వేశారు. పిల్లలకు చాక్లెట్లు అందజేశారు. పుస్తకాలు, బ్యాగ్‌లు తదితర వాటిని సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్ పంపిణీ చేశారు. సేవాదల్ కార్యకర్తలు, నేతలు శరవణన్, భాస్కర్, సురేష్, విజయన్, కీర్తిక, సోమ సుందరం నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరువెంగడం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, తమ వంతుగా విద్యార్థులకు విద్యా ఉపకరణలను అందజేశామన్నారు. సెప్టెంబరు 2న దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదానం తదితర సేవా కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనాథ, వృద్ధాశ్రమాలలో జరిగే కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అధ్వానంగా వైద్య సేవలు

ప్రతిపక్ష నేత పళణి స్వామి ఫైర్



సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు అధ్వానంగా మారయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిపళణి స్వామి ఆరోపించారు. ఆరోగ్య శాఖను ఈ పాలకులు పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. మంగళవారం రాష్ట్రంలో ఇటీవల కాలంగా ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను గుర్తు చేస్తూ, అధ్వానంగా వైద్య సేవలు మారయని ఆరోపిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో నాగర్ కోయిల్‌కు చెందిన దంపతులు తమ బిడ్డను ప్రభుత్వ ఆసత్రికి తీసుకెళ్లే, ఏ జ్వరం అన్నది కూడా నిర్ధారించ లేదని పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వాకం ఉందని ఆరోపించారు. అదృష్ట వశాత్తు ఆ బిడ్డను కేరళకు తీసుకెళ్లడం ద్వారా ర్యాట్ ఫీవర్‌గా గుర్తించి చికిత్స అక్కడి వైద్యులు సేవలందించారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితులు అనేక రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వెలుగు చూస్తున్నాయన్నారు. రోగ నిర్ధారణ పరిశోధనలు కూడా చేయలేని పరిస్థితుల్లో అధ్వానంగా పనితీరు మారిందని ధ్వజమెత్తారు. తమిళనాడు తల రాతగా తనయుడు ఉదయ నిధిని స్టాలిన్ తెర మీదకు తెచ్చి ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆయన తనయుడి చేతిలో ఉన్న క్రీడల శాఖకు శిక్షకుడిగా ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ మారినట్టున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు సక్రమంగా అందక పేదలు అవస్థలు పడుతున్నారని , దీనిపై దృష్టి పెట్టలేనంత బిజీగా ఆరోగ్య మంత్రి ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వాస్పత్రులలో వైద్య సేవలు అందక పేదల రోగులు అష్టకష్టాలు పడుతున్నారని , ఈ శాఖను పూర్తిగా ఈ పాలకులు నిర్వీర్యం చేస్తున్నారనేందుకు ఇటీవల కాలంగా ఆస్పత్రులలో వెలుగు చూస్తున్న పరిణామాలే నిదర్శనమని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చిన్నారిని మభ్యపెట్టి 7 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లా పుదుకడై సమీపంలో ఆడుకుంటున్న బిడ్డను మభ్యపెట్టి.. తాళం అపహరించి పలుమార్లు నగలు, నగదు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కన్యాకుమారి జిల్లా పాదుకడై సమీపం మూంఁడ్రు మూక్కు పనవిలైకి చెందిన జయచంద్రన్ తూత్తుకోడిలోని ఓ చేపల కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో కొత్తగా ఇల్లు కట్టి అందులో నివాసంకి వెళ్లాడు. కొత్త ఇంటికి గ్రౌండ్ ఫ్లోర్ పాలిష్ పని జరుగుతుంది. ఈ పనిలో మార్తాండం సమీపంలోని సిరయాన్‌కులి ప్రాంతానికి చెందిన కూలీ యేసయ్య (54) పనిచేస్తున్నాడు. ఇంటి పనులు ఆ సమయంలో జయచంద్రన్ భార్య రీనిమలర్ తన బిడ్డ చేతికి ఇంటి తాళం ఇచ్చి ఆడుకోమని చెప్పి తాను దుకాణానికి వెళ్లి వస్తున్నట్లు తెలిసింది. ఈ ఆ సమయం అందులో ఒక తాళాన్ని యేసయ్య చోరీ చేసి తర్వాత ఇంటి బీరువాలో నగదు, నగలు చోరీ చేసినట్లు తెలిసింది. ఇలా పలుమార్లు తాళం తీసుకుని నగదు నగలు చోరీ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో సొంత ఊరికి వచ్చిన జయచంద్రన్ ఇంటిలో బీరువాను తెరిచి చూడగా నగలు, నగదు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో యేసయ్యే బిడ్డ నుంచి తాళం తీసుకొని 7 సవర్ల నగలు చోరీ చేసినట్టు తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు.

పాత్రల దుకాణంలో చోరీ



చోరీకి యత్నించిన యువకుడు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా కీల్ పెన్నాతూరు సమీపంలోని చిరునాత్తూరు గ్రామానికి చెందిన అక్బర్ అదే ప్రాంతంలో పాత్రల దుకాణం నడుపుతున్నాడు. సోమవారం రాత్రి యథావిధిగా దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరవగా.. దుకాణంలోని వస్తువులు చెల్లా చెదరుగా ఉండటాన్ని చూసి అవాక్కయ్యాడు. అనంతరం దుకాణంలోని సీసీటీవి కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలించాడు. అందులో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు చోరీకి యతి్నంచిన విషయాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరువళ్లూరు: ఈకాడులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్‌ను చుట్టుముట్టిన గ్రామస్తులు తమ సమస్యలను సత్వరం పరిష్కరించాలని, పంచాయతీ అధ్యక్షురాలు, గ్రామకార్యదర్శిపై విచారణ జరపాలని కోరడంతో ఉద్రిక్తత నెలకొంది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 525 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా ఈకాడులో జరిగిన గ్రామసభకు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ హాజరయ్యారు. రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన కలెక్టర్ గ్రామస్తులకు క్షమాపణలు కోరారు. సమావేశం ప్రారంభం కాగానే కలెక్టర్‌ను చుట్టుముట్టిన గ్రామస్తులు తమ గ్రామంలో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు, పంచాయతీ ఆదాయ వ్యయాల్లో వ్యత్యాసం, అవినీతిపై ప్రశ్నల వర్షం కురిపించడంతో కలెక్టర్ నివ్వెరపోయారు. ప్రజల నుంచి సమస్యలను విన్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ రెండు రోజుల్లో తహసీల్దార్, అసిస్టెంట్ కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్‌లు, బీడీఓలు గ్రామంలో పర్యటించి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆదాయ వ్యయంపై తనిఖీలు నిర్వహిస్తారని హామీ ఇచ్చారు. ఈకాడులో తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా కలెక్టర్ పాల్గొన్న గ్రామసభలో ప్రజలు తమ సమస్యలపై నిలదీయడం కలకలం రేపింది. అదేవిధంగా ఉలుంద్రై గ్రామసభలో పంచాయతీ అధ్యక్షుడు రమేష్, నేమంలో జరిగిన గ్రామసభకు ప్రేమ్‌కుమార్, తొడుగాడులో వెంకటేషన్, మనవాలనగర్‌లో జరిగిన గ్రామసభకు సునిత పంచాయతీ అధ్యక్షులు నేతృత్వం వహించారు.

పోకిరీని పోలీసులకు అప్పగింత

కొరుక్కుపేట: తనను వేధిస్తున్న పోకిరిని ఓ వివాహిత పట్టుకుని పోలీసులకు అప్పగించింది. షోలింగనల్లూర్ కరపాక్కం బస్టాప్ వద్ద ఓ మహిళ భర్తతో కలిసి నడుచుకుంటూ వెళుతోంది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ యువకుడు యువతిని వేధించాడు. షాక్‌కు గురైన మహిళ కేకలు వేసింది. అయినా ఆ యువకుడు వేధిస్తుండడంతో భర్త, స్థానికులు తరిమికొట్టారు. దీంతో యువకుడు సమీపంలోని పాదచారుల వంతెన ఎక్కి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. మహిళ వంతెన ఎక్కి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసింది. అనంతరం ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు యువకుడిని అప్పగించారు. అతని పేరు భవాని అని, యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. యువకుడిని అరెస్ట్ చేసి కన్నగి నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో 45 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: వల్లియూర్ సమీపంలో మంగళవారం ఉదయం హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో 45 సవర్ల నగలు చోరీ చేసుకొని పరరాయిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. తిరునెల్వేలి జిల్లా వల్లీయూర్ పసుంపోన్ పట్టణానికి చెందిన అరుణ్ కుమార్ (37). ఇతను కూడంకుళం కోస్ట్ గార్డ్ గ్రూప్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇతని భార్య మణిమాల. వీరికి ఇద్దరు కుమారులు. రెండు రోజుల క్రితం కన్యాకుమారి జిల్లా బూత్ పాండిలో ఆలయ దినోత్సవం సందర్భంగా అరుణ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం అరుణ్ కుమార్ కుటుంబ సమేతంగా తన ఇంటికి వచ్చాడు. అప్పుడు ఇంటి వెనుక తలుపులు పగలగొట్టి ఉండడం చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా చేసి బీరువాను ధ్వంసం చేసి అందులోని 45 సవర్ల నగలను దుండగులు చోరీ చేసుకొని పరారైనట్లు తెలిసింది. దీనిపై వల్లయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

మహిళ మెడ కోసి 5 తులాల గొలుసు దోపిడీ

నాగై జిల్లాలోని వేదరణ్యం సమీపంలోని మరుదూర్ సౌత్ పూవతేవన్ ఫారెస్ట్‌కు చెందిన పాండియన్. ఇతని భార్య వనితకుమారి (49). భార్య, భర్తల మధ్య అభిప్రాయ భేదాలు రావడంతో పాండియన్ తిరువారూర్ లో నివసిస్తున్నాడు. వనిత కుమారి పువతేవన్ లో నివసిస్తుంది. ఈ క్రమంలో వనితకుమారి మంగళవారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉంటు ఇడ్లీ కోసం పిండి రుబ్బుతోంది. అప్పుడు ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు మెరుపు వేగంతో వనితాకుమారి మెడపై కత్తితో కోసి 5 తులాల గొలుసుతో పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వనిత కుమారిని రక్షించి నాగై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలిస్తున్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రాస్తారోకో

అన్నానగర్: నల్లంపల్లి సమీపంలో మంగళవారం తాగునీటి కోసం గ్రామస్తులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వివరాలు.. నల్లంపల్లి సమీపంలోని బాల జంగమనల్లి గ్రామంలో 800కు పైగా కుటుంబాలు నివసిస్తుండగా, పంచాయతీ పాలకవర్గం ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు పంపిణీ చేస్తోంది. గత 3 నెలలుగా తాగునీరు పంపిణీ చేయడం లేదని వాపోయారు. దీంతో ఆ ప్రాంతంలో తాగునీటి కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ పాలకవర్గానికి చాలాసార్లు అభ్యర్థించారు కానీ పట్టించుకోలేదు. దీంతోగ్రామస్తులు మంగళవారం నల్లంపల్లి–నాగర్‌కూడల్ రహదారిపై తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో బైటాయించారు. ఈ నిరసన కారణంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు గోవిందస్వామి అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఆ సమయంలో తాగునీరు సజావుగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు.

పెళ్లైన నాలుగు నెలలకే..

తిరువళ్లూరు: వివాహమై నాలుగు నెలలు దాటకముందే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలుకా కుమారనాయకన్‌పేట గ్రామానికి చెందిన మునిరత్నం. ఇతడికి ఐదుగురు పిల్లలు. చివరి కొడుకైన కిషోర్(25) డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతనికి ఏప్రిల్ నెలలో అదే గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా జీవితంపై విరక్తి చెందేలా ప్రవర్తించినట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మృతుడి తల్లి మెర్సి ఇచ్చిన పిర్యాదు మేరకు పాదిరివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలి



ప్రసంగిస్తున్న నల్లి కుప్పుస్వామి శెట్టి

సాక్షి, చెన్నై: చెన్నైలోని వృద్ధులకు అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ సేవలు అవశ్యమని పద్మశ్రీ అవార్డు గ్రహీత నల్లి కుప్పుస్వామి శెట్టి తెలిపారు. ఆర్ఎండీ గ్రూప్ నేతృత్వంలో చెన్నై అశోక్ నగర్‌లో సమర్పన్ పేరిట వృద్ధుల కోసం మల్టీ యుటిలిటీకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంగళవారం రాజన్ ఐ కేర్ ఆసుపత్రి చైర్మన్ మోహన్ రాజన్, నల్లి సిల్క్స్ పద్మశ్రీ నల్లికుప్పుస్వామి శెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లి కుప్పు స్వామి చెట్టి మాట్లాడుతూ, వృద్ధులు, పేదలకు మెరుగైన వైద్య దరి చేరాలని ఆకాంక్షించారు. ఇలాంటి సెంటర్ల ఏర్పాటు వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా పేర్కొన్నారు. ఆర్ఎండీ గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ రిపబ్లికా శ్రీధర్ మాట్లాడుతూ, సమర్పన్‌లో ఇంటి వద్దకే తరలి వచ్చే ల్యాబ్‌తో పాటు గృహ ఆరోగ్య సంరక్షణ, వెల్నెస్, ఫిజియోథెరఫి తదితర సేవలను అందించడం జరుగుతుందన్నారు. వృద్ధుల జనాభాలో దేశంలో తమిళనాడు రెండో స్థానంలో ఉందని, అందుకే వారి భద్రత, ఆరోగ్య శ్రేయస్సు దృష్ట్యా, చెన్నై అశోక్ నగర్‌లో ఈ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

బహుమతుల ప్రదానం



రామాపురం ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేతృత్వంలో పాఠశాలల విద్యార్థులకు టెక్నో విజ్ -2023 వినూత్న ఆవిష్కరణలు, సైన్స్ ప్రాజెక్టుల పోటీలను నిర్వహించారు. చెన్నైలోని వివిధ పాఠశాలల నుంచి 242 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఇందులో వివిధ కేటగిరులలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం వళ్లియమ్మాళ్ పాఠశాల ప్రిన్సిపల్ గీతా రామసుబ్రమణియన్, వైస్ ప్రిన్సిపాల్ వి శరవణన్, ఎస్ఆర్ఎం డీన్ ఎం వెంకటరమణన్, తదితరులు బహుమతులను ప్రదానం చేశారు. - సాక్షి, చెన్నై

ట్రైన్‌లో 37 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: తాంబరం నుంచి చెన్నై ఎగ్మోర్‌కు రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి వద్ద 37 సవర్ల నగలు చోరీ చేసిన నిందితుడిని 48 గంటల్లో పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మైలాడుదురైకి చెందిన వెంకటేషన్ (54). ఇతను ప్రస్తుతం పుదువైలో తన కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఇతను ఈనెల 13వ తేదీ తాంబరం నుంచి ఎగ్మోర్ రైల్వే స్టేషన్‌కు విద్యుత్ రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. ఎగ్మోర్ రైలు స్టేషన్ వచ్చిన తరువాత తన బ్యాగును తనిఖీ చూసుకోగా అందులో ఉంచిన 37 సవర్ల నగలు అదృశమైంది. దీంతో ఎగ్మోర్ రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు రైల్వే ఎస్పీ పాన్ రామ్ ఆదేశం మేరకు ఎగ్మోర్ రైల్వే డీఎస్పీ రమేష్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఇళవరసన్‌తో ప్రత్యేక బృందం దర్యాప్తు నిర్వహించింది. ఇందులో నిందితుడు ఏరిక్కరై వేంబులి అమ్మన్ ఆలయ వీధికి చెందిన బాబు (46) అని తెలిసింది. అతన్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 37 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 48 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులను రైల్వే ఎస్పీ పాన్ రాము ప్రశంసించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

తిరువొత్తియూరు: వివాహేతర సంబంధం ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. కృష్ణగిరి జిల్లా సూలగిరి సమీపం పెరిగై కులదాసపురం ప్రాంతానికి చెందిన జ్యోతి (36). ఈమె భర్త కేశవమూర్తి మృతిచెందాడు. జ్యోతి కుమార్తెతో కలిసి ఉంటోంది. జ్యోతి అంగన్‌వాడీ ఉద్యోగి. ఈ క్రమంలో మహారాజపురం ప్రాంతానికి చెందిన వెంకటేష్ (35)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం జ్యోతి అక్క కుమారుడు హరీష్‌కు తెలిసింది. దీంతో హరీష్ జ్యోతి, వెంకటేష్‌లను మందలించాడు. కానీ ఇద్దరూ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం జ్యోతి ఇంటికి హరీష్ వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ జ్యోతి, వెంకటేష్ ఒంటరిగా ఉండడం చూసి హరీష్ గొడవపడ్డాడు. వెంకటేష్, హరీష్ ఘర్షణ పడ్డారు. ఘర్షణలో గాయపడిన వెంకటేష్‌ను హోసూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేరిగై పోలీసులు అక్కడికి వెళ్లి వెంకటేష్ మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హరీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



నయనతార లేడీ సూపర్ స్టార్ కాదా?

తమిళసినిమా: సంచలనటి నయనతార పేరు మరోసారి వార్తల్లో నానుతోంది. దక్షిణాదిలో అగ్ర కథానాయకిగా రాణిస్తున్న ఇప్పుడు జవాన్ చిత్రంతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి భారతీయ నటిగా గుర్తింపు పొందారు. అదే విధంగా చేతిలో పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. కాగా ఎందుకో గానీ నయనతార అంటే నటి కస్తూరికి అస్సలు పడడం లేదనే టాక్ ఉంది. ఆమెకు సంబంధించిన ప్రతి విషయంలోనూ విభేదిస్తున్నారు. ఆ మధ్య నయనతార గత ఏడాది సరోగసి విధానం ద్వారా కవల పిల్లలకు తల్లి అయిన విషయం తెలిసిందే. అది తొలుత పెద్ద వివాదానికి దారి తీసింది. ఆ విషయంలో నయనతార, దర్శకుడు విఘ్నేశ్ శివన్‌ను నటి కస్తూరి తీవ్రంగా విమర్శించారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నటి కస్తూరి మరోసారి నయనతారను కించపరిచే విధంగా మాట్లాడారు. నయనతారను లేడీ సూపర్ స్టార్ గా భావించలేమని, నిజమైన లేడీ సూపర్ స్టార్స్ నటి కేబీ సుందరాంబాళ్, విజయశాంతి అని కస్తూరి పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు వివాదానికి దారి తీసాయి. ఇకపోతే నయనతార కథానాయకిగా నటించిన తొలి బాలీవుడ్ చిత్రం జవాన్ సెప్టెంబర్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. తన సొంత చిత్రాల ప్రచార కార్యక్రమంలోనే పాల్గొనే నయనతార జవాన్ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారా, లేదా..? అన్న చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఈ చిత్రంలో చిన్న పాత్రలో నటించిన దీపిక పడుకొనే కూడా షారుక్ ఖాన్ తో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో నయనతార విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కోలీవుడ్ టాక్స్

కొత్త చిత్రానికి రెడీ



కారైకుడిలోని పాఠశాలలో శరవణన్

తమిళసినిమా: 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు త్యాగవీరులకు వందనం చేశారు. అదేవిధంగా లెజెండ్ శరవణన్ మంగళవారం పలువురు పిల్లలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. వారందరికీ మంచి కానుకలను ఇచ్చి ఆనంద పరిచారు. పిల్లలతో కలిసి జైలర్ చిత్రంలోని హుకుం అనే పాటకు డాన్స్ చేసి సందడి చేశారు. దీంతో రజినీకాంత్‌కే టఫ్ ఇస్తున్న లెజెండ్ శరవణన్ అంటూ నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు. కాగా ప్రముఖ వ్యాపారవేత్త అయిన ఈయన ది లెజెండ్ అనే చిత్రం ద్వారా కథానాయకుడిగా రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా లెజెండ్ శరవణన్ నటుడుగా బాగా పాపులర్ అయ్యారు. అయితే ఆ చిత్రం ఆయనకు భారీ నష్టాలకు గురిచేసిందనే ప్రచారం జరిగింది. దీంతో ఆయన మళ్లీ చిత్రం చేస్తారా నటిస్తే ఆ చిత్రం ఏమిటి, ఎప్పుడు మొదలవుతుంది అన్న ఆసక్తి అటు ప్రేక్షకుల్లోనూ ఇటు సినీ వర్గాల్లోనూ నెలకొంది. కాగా మీరు మళ్లీ ఎప్పుడు చిత్రంలో నటిస్తారు? అని పిల్లలు అడగ్గా మంచి కథ లభించకపోవడంతో కాస్త ఆలస్యమైందని, ఇప్పుడు కథ సెట్ అయిందని త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నట్లు లెజెండ్ శరవణన్ వారికి బదిలిచ్చారు. దీంతో లెజెండ్ శరవణన్ తాజా చిత్రం సమాచారం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అవుతోంది.

మంచి ఎఫర్ట్ పెడితే సక్సెస్ ఖాయం

తమిళసినిమా: నటుడు శరత్ కుమార్, అమితాష్ ప్రధాన పాత్రలు పోషించిన పరం పొరుల్ చిత్రంలో నటి కాశ్మీరా ప్రదేశీ నాయకిగా నటించారు. కవి క్రియేషన్స్ పతాకంపై మనోజ్, గిరీష్ కలిసి నిర్మించిన ఈ చిత్రానికి సీ. అరవింద్ రాజ్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఎస్.పాండికుమార్ ఛాయాగ్రహణం, యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలకు పూర్తి చేసుకొని సెప్టెంబర్ 1న విధులకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. దర్శకుడు మణిరత్నం సుహాసిని మణిరత్నం ట్రైలర్ ను ఆవిష్కరించారు. నటుడు అమితాష్ మాట్లాడుతూ 2023 ఎంతో ఇన్‌స్పైరింగ్ సంవత్సరం అని చెప్పవచ్చు అన్నారు. డాడా, పోర్ తొళిల్ , లవ్ టుడే వంటి పలు చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయన్నారు. కాగా పరంపొరుల్ చిత్ర కథను నిర్మించాలని భావించినప్పుడు ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో పోషించడానికి ముందుగా గుర్తుకొచ్చింది శరత్ కుమారేనని పేర్కొన్నారు. ఆయన ఇందులో నటించడానికి సమ్మతించడంతో చిత్ర డైమన్స్‌నే మారిపోయిందన్నారు. ప్రతి సన్నివేశంలోనూ ఎంతో ఇన్వాల్ అయి నటించారన్నారు. ఇక యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందించిన చిత్రంలో నటించడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా చిత్రం కోసం సంగీత దర్శకుడు అనిరుద్ ఒక పాట పాడడం విశేషం అన్నారు. శరత్ కుమార్ మాట్లాడుతూ ఫుల్ ఎఫర్ట్ పెడితే సక్సెస్ ఖాయం అన్నారు.



పరంపొరుల్ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ



చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రు

1న కరుమేఘంగళ్ కలైగింద్రన

తమిళసినిమా: అళగి, పల్లికూడం, సొల్లు మారింద కథై వంటి పలు వైవిధ్య భరిత కథా చిత్రాల ఛాయాగ్రాహకుడు, దర్శకుడు తంగర్ బచ్చన్ తాజాగా తెరకెక్కించిన చిత్రం కరుమేఘంగల్ కలైగింద్రన. దర్శకుడు భారతీరాజా, గౌతమ్ మీనన్, యోగి బాబు, నటి అతిథి బాలన్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని థియేటర్ మీడియా సంస్థ జీవి ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి వైరముత్తు పాటలను అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఆడియో ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందింది. కాగా చిత్రం సెప్టెంబర్ ఒకటవ తేదీన విడుదల ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ను రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రు విడుదల చేశారు ఈయన పాత్రను నటుడు సూర్య పోషించగా రూపొందిన జై భీమ్ చిత్రం ఎంత సంచలన విజయం సాధించిందో తెలిసిందే. కాగా కరుమేఘంగల్ కలైగింద్రన చిత్రంలో దర్శకుడు భారతీరాజా పోషించిన న్యాయమూర్తి పాత్ర నిజాయితీ పరుడు అని రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రు 16 ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. దీంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

మిల్కీబ్యూటీ ఆదాయం మామూలుగా లేదుగా!



తమిళసినిమా: ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో మారుమోగుతున్న పేరు తమన్న. రజనీకాంత్ కథానాయకుడుగా నటించిన జైలర్‌లోని కావాలి అన్న తన ఒక్క పాటతో ఆ చిత్రానికి వీరలెవల్ లో పబ్లిసిటీని తెచ్చి పెట్టిన గ్లామర్ భామ తమన్నా అని చెప్పవచ్చు. 2005లో నటిగా రంగ ప్రవేశం చేసిన ఈ బ్యూటీ గత 17 ఏళ్లుగా పలు భాషల్లో అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆరాధిస్తున్నారు. కాగా తమిళంలో ఈమె నటించిన తొలి చిత్రం కేడి నిరాశపరిచినా ఆ తర్వాత నటించిన కల్లూరి చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టింది ఆ తర్వాత వరుసగా ధనుష్, విజయ్, అజిత్ అంటే ప్రముఖ స్టార్స్ తో నటించి అగ్ర నటిగా రాణిస్తోంది. తాజాగా జయలలి చిత్రంలో ఒక్క పాట రెండు మూడు సన్నివేశాల్లో నటించి ఆ చిత్ర విజయంలో క్రెడిట్ కొట్టేశారు. ఐటమ్ సాంగ్స్‌లోను నటించడానికి వెనుకాడని తమన్నా కళ్లు చెదిరే ఆస్తులను కూడబెట్టినట్లు తాజాగా ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అందులో ఈ మిల్కీబ్యూటీ ఏడాదికి రూ.12 కోట్లు సంపాదిస్తున్నట్లు పేర్కొనబడింది. సినిమాతో పాటు ఇతర వాణిజ్య సంస్థలకు అంబాసిడర్‌గా ఉంటూ కోట్లను కొల్లగొడుతున్నట్లు తెలుస్తోంది. ఈమె ఒక్క సినిమాకు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు పుచ్చుకుంటున్నట్లు సమాచారం. అదేవిధంగా ఐటెం సాంగ్ రూ. 50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు టాక్. గత 2018లో ఐపీఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 10 నిమిషాల పాటు తళుక్కుమని రూ.50 లక్షల వరకు పొందినట్లు ప్రచారం జరిగింది. కాగా ఈమె ముంబైలో నివసిస్తున్న అపార్టుమెంట్ ఖరీదు రూ. 16 కోట్లు అని సమాచారం. అదేవిధంగా లేడ్రోవర్ డిస్కవరీ స్పోర్ట్, బీఎండబ్ల్యూ నాలుగు ఖరీదైన కార్లను తమన్నా వాడుతున్నారు. అంతేకాకుండా ఈమె సొంతంగా ఒక బంగారు నగల షాపును నిర్వహిస్తున్నారు. మొత్తం మీద తమన్న రూ.110 కోట్లకు అధిపతి అని తాజాగా ప్రచారం.

క్లుప్తంగా

వ్యభిచారం కేసులో దంపతుల అరెస్ట్

తిరువొత్తియూరు: ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నైలోని రాయపురం ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందని ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాయపురం పోలీసులు సోమవారం రాయపురం రాజవేలు వీధిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ మహిళను డబ్బు ఆశ చూపించి వ్యభిచార వృత్తిలోకి దించి మణిమారన్ (45), అతని భార్య(37)ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

విషపురుగు కరిచి మహిళ మృతి

అన్నానగర్: కడత్తూరు సమీపంలో మంగళవారం విషపురుగు కరిచి ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. ధర్మపురి జిల్లా కడత్తూరుకు చెందిన వేడియప్పన్ ఇతని భార్య బేబీ (53). ఈమె మంగళవారం తన ఇంటి వెనుక వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె కాలుపై విష పురుగు కరవడంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ధర్మపురి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై కడత్తూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కంచె తగిలి రైతు..

అన్నానగర్: ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపంలోని పుదుపట్టికి చెందిన రైతు తమిళవీరన్ (52). ఇతను అదే ప్రాంతానికి చెందిన స్నేహితుడు సేదు (42)తో కలిసి సోమవారం రాత్రి కుందేళ్లను వేటాడేందుకు పుదుపట్టి అడవికి దేశీ తుపాకీతో వెళ్లారు. ఆ సమయంలో నరసీపురం ప్రాంతంలోని వ్యవసాయ భూమి వద్దకు రాగా.. అడవి పందుల బారి నుంచి పంటను కాపాడేందుకు అక్రమంగా వేసిన విద్యుత్ కంచెలో చిక్కుకుని తమిళవీరన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తమిళ వీరన్ మృతదేహాన్ని ధర్మపురి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అలాగే వ్యవసాయ భూమిలో అక్రమంగా విద్యుత్ కంచె వేసిన కావిరియప్పన్(60), తమిళ వీరన్‌తో కలిసి కుందేళ్ల వేటకు వెళ్లిన సేదుని అరెస్టు చేశారు.

టన్ను బీడీ ఆకులు స్వాధీనం

అన్నానగర్ : మండపం సమీపంలో మంగళవారం ఉదయం శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన టన్ను బీడీ ఆకులను అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. వివరాలు.. రామనాథపురం జిల్లా మండపం సమీపంలోని సముద్రతీరం నుంచి బీడీ ఆకుల చుట్టలు శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులకు మంగళవారం ఉదయం రహస్య సమాచారం అందింది. దీంతో రామనాథపురం కస్టమ్స్ అధికారులు ఉచిపుల్లి రైల్వే గేట్ ప్రాంతంలో కార్గో వాహనాన్ని ఆపి సోదాలు నిర్వహించారు. కార్గో వాహనంలో దాచిన టన్ను బీడీ ఆకు బస్తాలను సీజ్ చేశారు. దీనికి సంబంధించి మండపానికి చెందిన సేదు అబు తాహిర్ (45), ముస్తఫా (25), ఆసిక్ రెహమాన్ (30) అనే ముగ్గురుని అరెస్టు చేశారు. ఈ బీడీ ఆకుల కట్టలను మండపం సమీపంలోని సముద్రతీర ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నుంచి పడవ ద్వారా శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు ప్లాన్ చేసినట్లు విచారణలో తేలింది.

గాయపడ్డ మత్స్యకారుడు మృతి

తిరువళ్లూరు: చేపల వేటకు వెళ్లి అలల ధాటికి సముద్రంలో కొట్టుకపోయి గాయపడిన మత్స్యకారుడు నెల రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా తిరుమలైనగర్ పళవేర్కాడుకు చెందిన మునస్వామి కుమారుడు శివకుమార్(42). ఇతను చేపల వేటతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత జూలై 24న పళవేర్కాడు వద్ద సముద్రంలోకి చేపల వేటకు వెళ్లాడు. వేట సాగిస్తుండగా పెద్ద అలలు రావడంతో శివకుమార్ బోటు సహా కొట్టుకుపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ శివకుమార్‌ను రక్షించి చెన్నై వైద్యశాలకు తరలించారు. నెల రోజుల పాటు చికిత్స పొందుతూ శివకుమార్ సోమవారం రాత్రి మృతి చెందాడు.

అభయక్షేత్రంలో అన్నదానం

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యాం రాయల్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రేణిగుంట అభయక్షేత్రంలో 200 మంది దివ్యాంగులు, అనాథలకు అన్నదానం చేశారు. అంతకుముందుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం సమీపంలోని జలవినాయకుని విగ్రహ ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేశారు. అలాగే ఆయన శ్రీకాళహస్తి పట్టణంలోని ఆటోడ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు.

భక్తిప్రపత్తులతో అమావాస్య పూజలు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం భక్తిప్రపత్తులతో అమావాస్య పూజలు చేశారు. నూతన పంచలోహ కవచధారణతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద పండరి భజనలు, కోలాటలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్రస్వామి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తెలుగు లోగిళ్లలో స్వాతంత్య్ర సంబరాలు


దక్షిణ ఇండియా వైశ్య సంఘంలో జెండా పండుగ


ఎస్కేపీడీ చారిటీస్ తరపున పతాకావిష్కరణ


నార్త్ మద్రాస్ ఆర్యవైశ్య సంఘంలో స్వాతంత్య్ర వేడుకల్లో సుమంగళి పూజ


తిరువళ్లూరు: బెలూన్‌లను ఎగరవేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎస్పీ కల్యాణ్ తదితరులు


కేసరి స్కూల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు


ఆస్కాలో జెండా ఎగురవేస్తున్న సుబ్బారెడ్డి


మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి ఆవరణలో జెండా పండుగ


క్రీస్ట్ గ్రేస్ హోప్ ప్రేయర్ ఫౌండేషన్‌లో..


పొట్టి శ్రీరాములుకి నివాళులర్పిస్తున్న అనిల్ కుమార్ రెడ్డి, కమిటీ సభ్యులు

కొరుక్కుపేట: చెన్నై నగరంలోని తెలుగు లోగిళ్లలో 77వ స్వాతంత్య్ర సంబరాలు అంబరాన్ని అంటాయి. త్రివర్ణ పతాకాలను ఎగురవేసి, విద్యార్థులకు, చిన్నారులకు స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. దేశభక్తిని చాటుతూ పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

దక్షిణ ఇండియా వైశ్య సంఘంలో..

గిడ్డంగి వీధిలోని దక్షిణ ఇండియా వైశ్య సంఘం తరపున సంఘం అధ్యక్షులు అజంతా డాక్టర్ కే.శంకర రావు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ఇందులో ముఖ్యఅతిథిగా బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ సబ్ డివిజనల్ ఇంజనీర్ ఉప్పు జయచంద్రన్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. సెక్రటరీలు ఎం. నరసింహులు, పువ్వాడ అశోక్ కుమార్, కోశాధికారి పెసలరమేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్కేపీడీ అండ్ చారిటీస్‌లో..

జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం అండ్ చారిటీస్ నిర్వహణలోని విద్యా సంస్థలు సంయుక్తంగా ఒకే వేదికగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా ఎన్‌టిటిఎఫ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. రాజగోపాలన్ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. ఇందులో ట్రస్టీలు ఎస్ఎల్ సుదర్శనం, శరత్ కుమార్, విజయ కుమార్, ఎన్. శ్రీకాంత్, సలహాదారు డాక్టర్ జేవీ రావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నార్త్ మద్రాసు ఆర్య వైశ్య సంఘంలో..

నార్త్ మద్రాసు ఆర్యవైశ్య సంఘం తరపున ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) మహిళా విభాగం అధ్యక్షురాలు అమరా శ్రీలత ఉపేంద్ర పాల్గొని జెండా ఎగురవేశారు. అనంతరం సంఘం భవనంలోని వాసవీ ఏసీ హాలు వేదికగా సుమంగళీ పూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఇందులో సంఘ కార్య నిర్వాహకులు కార్యక్రమ ఏర్పాట్లు చేపట్టారు. భక్తులందరికీ ప్రసాదం పంచిపెట్టారు.

మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో..

వేప్పేరిలోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చర్చి కాపరి రెవరెండ్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇందులో సంఘం చైర్మన్ రామయ్య, సెక్రటరీ ప్రభుదాస్, కోశాధికారి బాబు, బిల్డింగ్ సెక్రటరీ బాబు, బిల్డింగ్ కోశాధికారి విశ్వలు పాల్గొని అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

పొట్టి శ్రీరాములు భవనంలో..

చెన్నై మైలాపూర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కె.అనిల్ కుమార్ రెడ్డి జెండాను ఎగురవేశారు. సభ్యులు నారాయణ గుప్తా, గుడిమెట్ల చెన్నయ్య, జేఎం నాయుడు, డాక్టర్ ఏ.వి.శివ కుమారి, డాక్టర్ విస్తాలి శంకర్ రావు తదితరులు పాల్గొని అమరజీవికి నివాళులర్పించారు.

టీనగర్ కేసరి స్కూల్‌లో..

చెన్నై టీనగర్‌లో ఉన్న కేసరి మహోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా చార్టెడ్ అకౌంటెంట్ శ్రీకాంత్, కెన్సెస్ గ్రూప్ అధినేత నరసారెడ్డి, శైలేంద్ర కుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వడ్లమాని సూర్యప్రకాశ్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులకు స్వీట్లను పంచిపెట్టారు. అలాగే మైలాపూర్.. కేసరి మహోన్నత పాఠశాలలో ముఖ్య అతిథి స్నేహలత జెండాను ఆవిష్కరించారు. ఇందులో కేసరి విద్యా సంస్థల కార్యదర్శి కె.యస్.వి ప్రసాద్, డా చారుమతి, కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి పాల్గొన్నారు.

ఆస్కాలో..

టీనగర్‌లోని ఆంధ్రా సోషియల్ కల్చురల్ అండ్ అసోసియేషన్ (ఆస్కా) ఆవరణలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారెడ్డి తో పాటు జేకే రెడ్డి, వాసురావు తదితరులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీ ఆంధ్రకళా స్రవంతిలో..

చెన్నై కొరట్టూరు అగ్రహారంలో ఉన్న కోదండ రామాలయం ఆవరణలో కమిటీ సభ్యులంతా కలిసి జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో స్రవంతి సలహాదారు ఎం.ఎస్.మూర్తి దంపతులు, సెక్రెటరీ శ్రీనివాస్, కాశీవిశ్వనాథం, కుమార్, సాంబశివరావు, ప్రసాద్, ఓగోటి పద్మప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్ట్ గ్రేస్ హోప్ ప్రేయర్ ఫౌండేషన్‌లో..

చెన్నై విల్లివాక్కం భారతీ నగర్లో ఉన్నజీసస్ క్రీస్ట్ గ్రేస్ హోప్ ప్రేయర్ ఫౌండేషన్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. నిర్వాహకులు వి.దేవదానంతో పాటు గొల్లపల్లి ఇశ్రాయేలు, సంఘకాపరులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలూరు కోటలో కలెక్టర్ కుమరవేల్ పాండియన్ జాతీయ జెండాను ఎగరవేశారు. అలాగే నేతాజి మైదానంలో జాతీయ జెండాను ఎగరవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మణివన్నన్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి పాల్గొన్నారు. కార్పొరేషన్‌లో మేయర్ సుజాత, తిరువణ్ణామలై క్రీడా మైదానంలో కలెక్టర్ మురుగేష్ జాతీయ జెండాను ఎగరవేశారు.

తిరువళ్లూరు: తిరువళ్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగరవేసి వందనం చేశారు. బెలూన్స్, పావురాలను శాంతికి చిహ్నంగా వదిలారు. ఆవడిలోనీ కామరాజర్ నగర్‌లోని వెంకటేశ్వర తెలుగు మాధ్యమిక పాఠశాలలో, తెలుగు వికాసమితి, సిగ్మా ఆధ్వర్యంలో గుమ్మిడిపూండిలో ఘనంగా నిర్వహించారు.

తమాకా కార్యాలయంలో..

కొరుక్కుపేట: తమాకా తరపున చెన్నై ఆళ్వార్‌పేట ప్రధాన కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ జాతీయ జెండాను ఎగురేశారు. ప్రధాన కార్యాలయం సెక్రటరీ జీఆర్ వెంకటేష్, అశోకన్, శక్తి వడివేల్, వీపీ జవహర్ బాబు పాల్గొన్నారు.



పళ్లిపట్టులో..

పళ్లిపట్టు: పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. సాయిశ్రీ మెట్రిక్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రామన్ పాల్గొని విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే తిరుత్తణి డాక్టర్ రాధాకృష్ణన్ మహోన్నత బాలుర పాఠశాలలో ఎమ్మెల్యే చంద్రన్ జాతీయ పతాకం ఆవిష్కరించి వందనం చేశారు.


బంగారుగుడి ఆస్పత్రి డైరెక్టర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్


జెండా పండుగలో జీ కె వాసన్, జీ ఆర్ వెంకటేష్ తదితరులు

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అన్నానగర్: పరమతి వేలూరు సమీపంలో మంగళవారం సుత్తితో కొట్టి, భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నామక్కల్ జిల్లా పరమతివేలూరు కందనగర్ ప్రాంతానికి చెందిన విజయకుమార్ (40) వేలూరు బస్టాండ్ ఎదురుగా ఉన్న టీ దుకాణంలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కళా (36). విజయకుమార్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరిగేవని తెలుస్తుంది. మంగళవారం విజయకుమార్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఇందులో కోపోద్రిక్తురాలైన కళ భర్త విజయకుమార్ తలపై సుత్తితో బలంగా కొట్టింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన విజయకుమార్‌ను స్థానికులు రక్షించి కరూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుచ్చి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ జయకుమార్ మృతి చెందాడు. పరమతివెల్లూర్ పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు. అనంతరం ఆమెను సేలం మహిళా జైలుకు తరలించారు.

చెక్‌డ్యామ్‌లో పడి ఇద్దరు యువకుల దుర్మరణం

మృతులు తమిళనాడు వాసులు

కుప్పం రూరల్: కనకనాశమ్మ దేవాలయం వద్ద చెక్ డ్యామ్‌లో పడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్‌కు చెందిన రెండు కుటుంబాలు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని కనకనాశమ్మ దేవాలయానికి దర్శనం కోసం వచ్చాయి. దర్శనానికి ముందు ఆలయం వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌లో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడ ఆనవాయితీ. రెండు కుటుంబాల వ్యక్తులు చెక్‌డ్యామ్‌లో స్నానానికి దిగారు. వీరిలో జీవా (27), మనోకిరణ్ (19) నీటి లోతుకు వెళ్లి, ఈత రాక మునిగిపోయారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వారిని కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. స్థానికులు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు.. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు మృతదేహాలను తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ కళ్లముందే ఇద్దరూ మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

గంగమ్మకు పాలాభిషేకం

రేణిగుంట: మండలకేంద్రంలో గంగమ్మజాతర నిర్వహణకు సంబంధించి మంగళవారం అంకురార్పణ జరిగింది. ఏటా ఎంతో వైభవంగా జరిగే జాతర మహోత్సవం ఈసారి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సుమారు 300 మంది మహిళలు ఎర్రదుస్తులు ధరించి వేపాకు చుట్టిన పాలకుండను నెత్తిన పెట్టుకుని నడివీధి గంగమ్మ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి పాలకుండలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. అమ్మవారిని పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించారు. రాత్రి జాతర చాటింపు జరిగింది. ఈనెల 21వ తేదీ రాత్రి గ్రామవీధుల్లో గెరిగె ఊరేగింపు, 22న గంగమ్మ జాతర, గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు, నడివీధి గంగమ్మ వద్ద అంబళ్లు, అమ్మవారి విశ్వరూప దర్శనం, 23వ తేదీన ఉదయం నడివీధి గంగమ్మ ప్రతిష్ట, రాత్రి వరకు మహా దర్శనం కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.


విశేష అలంకరణలో అమ్మవారు

కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జ్యోతినారాయణ, రావణన్, సదాశివరెడ్డి, సుబ్రమణ్యం, లక్ష్మీ రెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.


అమ్మవారి అభిషేకానికి పాలకుండలను తీసుకెళ్తున్న భక్తులు

పరిశోధనా విద్యకు అధిక ప్రాధాన్యం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న చాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు: వేలూరు వీఐటీ యూనివర్సిటీ పరిశోధనా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ తెలిపారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని వీఐటీ ప్రాంగణంలో చాన్స్‌లర్ విశ్వనాథన్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం గాంధీ, వావూసి వంటి మహానేతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, శంకర్ విశ్వనాథన్, అసిస్టెంట్ ఉపాధ్యక్షులు కాదంబరి, రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సంపదతోనే సనాతన ధర్మం

శ్రీకాళహస్తి: సనాతన ధర్మం వర్ధిల్లాలంటే సాంస్కృతిక సంపదతోనే సాధ్యమని కళారాధన వ్యవస్థాపకులు బద్రీనాథ్ తెలిపారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నత్యప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుకే వంద క్షేత్రాల్లో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఐదో రోజు శ్రీకాళహస్తిలో కోట మండపం వద్ద ఈ నృత్య ప్రదర్శనలు నిర్వహించినట్లు చెప్పారు. ఆనంద కళా కేంద్రం గత మూడు నెలల ముందు హనుమాన్ చాలీసాను 108 సార్లు 101 మంది 14 గంటల 22 నిమిషాల 22 సెకండ్లు ఆపకుండా పఠించడంతో గిన్నీస్‌రికార్డులో స్థానం సంపాదించామన్నారు. అదే తరహాలో ఇప్పుడు 22 రాష్ట్రాల్లో సుమారు 17వేల కిలోమీటర్లు నృత్య ప్రదర్శన ఇస్తూ గిన్నిస్ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఐదో రోజు శ్రీకాళహస్తీశ్వరాలయంలో చేసినట్లు తెలిపారు.

ఘనంగా చిత్తూరమ్మ జాతర


అమ్మవారి సేవలో ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: నగరంలోని పెద్ద హరిజనవాడలో మంగళవారం చిత్తూరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు జరిగాయి. అనంతరం పలు రకాల పుష్పాలతో అలంకరించిన హంస వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కలిసి కట్టుగా జరుపుకోవాల్సిన వేడుక


ప్రసంగిస్తున్న ఎల్జీ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, చెన్నై : స్వాతంత్య్ర దినోత్సవం వంటి వేడుకలను ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, నాయకులు అందరూ కలిసి కట్టుగా జరుపుకోవాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. పుదుచ్చేరి రాజ్ నివాస్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా ఆమె ప్రసంగిస్తూ ప్రభుత్వం, రాజకీయ నాయకులు అందరూ కలిసి కట్టుగా రాజ్ నివాస్‌లో ఈ వేడుక జరుపుకోవడం మంచి సంబంధాలకు మార్గం అని సూచించారు. ఇందులో పుదుచ్చేరి పాలకులు ఆదర్శవంతులుగా ఉన్నారని కితాబునిచ్చారు. సిద్ధాంత పరంగా , ఇతర అంశాల పరంగా అభిప్రాయ భేదాలు ఉన్నా, అధికారంలో ఉన్న వాళ్లు ఇలాంటి వేడుకలు, తేనిటీ విందులలో పాలు పంచుకోవాల్సిన అవసరం ఉందంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి విందును సీఎం స్టాలిన్ బహిష్కరించడాన్ని గుర్తు చేస్తూ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. విందు కార్యక్రమంలో భాగంగా పుదుచ్చేరి సీఎం రంగస్వామికి ఎల్జీ తమిళిసై స్వయంగా వడ్డించడం విశేషం.

పోస్టల్ సిబ్బంది అవగాహన ర్యాలీ

అన్నానగర్: నాగర్ కోవిల్‌లో ప్రతి ఇంటి వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసేందుకు పోస్టల్ సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. వివరాలు.. ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగా పోస్టాఫీసుల్లో జాతీయ జెండా విక్రయాలు కొనసాగుతున్నాయి. కన్యాకుమారి పోస్టల్ కార్యాలయంలో ఇప్పటివరకు 9 వేల జెండాలు అమ్ముడయ్యాయి. ఈ స్థితిలో సోమవారం కన్యాకుమారి పోస్టల్ డివిజన్ తరపున 'ప్రతి ఇంటికీ త్రివర్ణ పతాకం' పై అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కోయిల్ హెడ్ పోస్టాఫీసు ముందు నుంచి ప్రారంభమైన ర్యాలీని కన్యాకుమారి డివిజన్ సీనియర్ తపాలా సూపరింటెండెంట్ శివాజీ గణేష్, నాగర్‌కోయిల్ హెడ్ పోస్టాఫీసర్ మారియప్పన్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో డివిజనల్ అసిస్టెంట్ పోస్టల్, సూపరింటెండెంట్లు పరమేశ్వరన్, స్వయంబుకళ, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కన్మణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలు లేరనే ఆవేదనతో వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: కలరంపట్టి సమీపంలో పిల్లలు లేరనే ఆవేదనతో మంగళవారం ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. పెరంబలూరు జిల్లా కలరంపట్టి ఉత్తర వీధికి చెందిన జగన్, అతడి భార్య రంజనీదేవి (33). వీరికి పెళ్లయ్యి ఏడేళ్లయ్యింది. వారికి పిల్లలు లేరు. దీంతో రంజనీదేవి మనస్తాపంతో ఉంటూ వచ్చింది. ఈక్రమంలో మంగళవారం వేకువజామున రంజనీదేవి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెరంబలూరు పోలీసులు రంజనీదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు ముందు రంజనీదేవి తన సెల్‌ఫోన్‌లో ।నా చావుకు ఎవరూ కారణం కాదు౹ అంటూ వీడియో రికార్డ్ చేసింది. పోలీసులు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊయల తాడు బిగించుకొని చిన్నారి మృతి

అన్నానగర్: పర్యూర్ సమీపంలో మంగళవారం ఊయలలో ఆడుకుంటునప్పుడు తాడు గొంతు బిగించుకుని ఓ చిన్నారి మృతి చెందింది. వివరాలు.. కృష్ణగిరి జిల్లా పర్యూర్ సమీపం కుమారనాంగనపల్లి కి చెందిన రవి. బెంగళూరులో ఉంటూ అక్కడి ఓ బేకరీలో స్వీట్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య శశికళ. వీరికి మూడున్నర ఏళ్ల రితిక అనే కుమార్తె ఉంది. ప్రస్తుతం మూడు నెలల గర్భిణి అయిన శశికళ మంగళవారం క్రిష్ణగిరి ఆసుపత్రికి చెకప్ కోసం వెళ్లింది. దీంతో రితికాను నానమ్మ వద్ద విడిచి వెళ్లింది. ఆ సమయంలో రితికా ఊయలలో ఆడుకుంటూ మెడ బిగుసుకుపోయి మృతి చెందింది. షాక్‌కు గురైన చిన్నారి అమ్మమ్మ కేకలు వేసింది. ఆమె అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చి చిన్నారిని రక్షించి పర్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పర్యూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం క్రిష్ణగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో విషాదాన్ని నింపింది.

క్లుప్తంగా...

ఢిల్లీకి ఫుల్ డిమాండ్!

ఆ తర్వాత ముంబై విమానాలకు గిరాకీ



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం-ఢిల్లీ మధ్య నడిచే విమానాలకు ఫుల్ డిమాండ్ ఉంటోంది. మరే విమాన సర్వీసుకు లేని ప్రయాణికుల తాకిడి వీటికి కనిపిస్తోంది. ఈ రెండు నగరాల మధ్య రోజుకు ఐదు సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో సీట్లు 95 శాతానికి పైగా నిండుతున్నాయి. విశాఖపట్నం నుంచి ఢిల్లీ వెళ్లేందుకు రెండు రోజుల ముందుగా టికెట్లు దొరకడం లేదు. ఆ తర్వాత స్థానం విశాఖపట్నం-ముంబై విమాన సర్వీసులకు ఉంది. ఈ రెండు నగరాల మధ్య 90 శాతం పైగా ఓఆర్ ఉంటోంది. ఈ విమాన సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల ముందుగా టికెట్లు లభించని పరిస్థితి ఉంది. ఇక విశాఖపట్నం-సింగపూర్ సర్వీసుకు కూడా మంచి గిరాకీ కనిపిస్తోంది. ఈ విమాన సర్వీసుకు 80 శాతం వరకు ఆక్యుపెన్సీ కనిపిస్తోంది.

క్షణికావేశం... ప్రాణం తీసింది

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో ఇద్దరి యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. గవరవీధి, ఆటోమోటివ్ ప్రాంతానికి చెందిన దవిల నారాయణరావు (28), మద్దిలపాలెం పిఠాపురం కాలనీకి చెందిన ఆర్.రాంబాబు (29) స్నేహితులు. రాంబాబు కారు డ్రైవర్‌గా, నారాయణరావు పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం వీరిద్దరూ పిఠాపురం కాలనీ మార్కెట్ సెంటర్ సమీపంలో బెట్టింగ్‌కు అష్టాచమ్మా ఆడారు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. అష్టాచమ్మా పిక్కలను నారాయణరావు తన్నేయడంతో కోపానికి గురైన రాంబాబు అతని ముఖంపై బలంగా కొట్టాడు. దీంతో వెనక్కిపడిపోయిన నారాయణరావు తలకు సిమెంట్ అరుగు బలంగా తగలడంతో మరణించినట్లు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు.

కారు బోల్తా...

ఉపాధ్యాయురాలు మృతి

ఆనందపురం : కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఉపాధ్యాయురాలు మృతిచెందారు. భీమిలి మండలం చిట్టివలసలోని కొత్తపేటకు చెందిన పిరిడి వెంకట సంధ్యా రమణి(43) చిట్టివలస ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు మండలం గొండిపాలెం ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. గిడుతూరు స్వాతి అనే ఉపాధ్యాయురాలు పైడంపేట ప్రాథమిక పాఠశాలలో, తెలుకుల సునీత అనే ఉపాధ్యాయురాలు చౌడువాడ పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరు ముగ్గురూ కలిసి రోజూ ఇక్కడి నుంచి విధులకు వెళ్తుండేవారు. మంగళవారం ఆయా పాఠశాలల్లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు ముగ్గురు కారులో బయలుదేరారు. వారితోపాటు స్వాతి పిల్లలైన కీర్తిక, హాస్నిత కూడా ఉన్నారు. ఆ కారు ఆనందపురం మండలం శొంఠ్యాంకు సమీపంలో అదుపు తప్పి మధ్యలో ఉన్న డివైడర్‌ని ఢీకొని పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ దుర్ఘటనతో కారు వెనుక సీట్లో కూర్చున్న వెంకట సంధ్యా రమణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్‌తోపాటు మిగతా నలుగురికీ గాయాలయ్యాయి.

తెలంగాణ

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు బాలుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: ఎక్కువసేపు సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన మ్యాడ నరేశ్-జల దంపతుల కుమారుడు సాయిచరణ్ (12) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నరేశ్ ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయ్ వెళ్లగా, జల తన కుమారుడు సాయిచరణ్‌తో కలిసి గ్రామంలో ఉంటోంది. సోమవారం సాయిచరణ్ కాలుకు దెబ్బతగిలిందని ఇంటి వద్దే ఉన్నాడు. అదేపనిగా సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతూ కనిపించాడు. మంగళవారం బడిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు కూడా వెళ్లలేదు. తల్లి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తనకు ఇవ్వాలని సాయిచరణ్ అడగ్గా ఆమె నిరాకరించింది. సెల్‌ఫోన్ ఎక్కువసేపు వాడొద్దని చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంట్లోని దూలానికి టవల్‌తో ఉరేసుకుని చనిపోయాడు.

ఆకట్టుకున్న హార్స్ రైడింగ్

సాక్షి, హైదరాబాద్: అజీజ్‌నగర్‌లోని హెచ్‌పీఆర్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 16వ హైదరాబాద్ హార్స్ షో సందర్శకులను, హార్స్‌రైడింగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ హార్స్ క్లబ్బులు, విభాగాలకు చెందిన 80 గుర్రాలు, రైడర్లు ఈ ప్రదర్శనలో పాల్గొని అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించారు. కోవిడ్ తరువాత నిర్వహించిన మొట్టమొదటి ప్రదర్శన కావడంతో అనూహ్యమైన స్పందన లభించింది. తెలంగాణ స్టేట్ ఎక్వ్యాస్ట్రెన్ అసోసియేషన్, హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్ సంయుక్తంగా ఈ నెల 12, 13 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించాయి. ఈ ప్రదర్శనలో జంపింగ్, డ్రెసేజ్, టాప్‌స్కోర్, హాక్స్ తదితర ప్రదర్శనల్లో పాల్గొన్న రైడర్లు అద్భుతమైన నైపుణ్యాన్ని, ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు.

ఔషధాల గని.. కచ్చిడి

సముద్రంలో దొరికే మత్స్యరాజం

- బురదగా ఉండే ప్రాంతాల్లో ఆవాసం
- కచ్చిడి చేప మాంసంలో పలు విటమిన్లు, మినరల్స్
- ఆగ్నేయాసియా దేశాల్లో విపరీతమైన క్రేజ్



ఏపీ సెంట్రల్ డెస్క్: మహారాష్ట్రకు చెందిన ఓ జాలరికి దొరికిన కచ్చిడి చేపలతో ఒక్క రోజులోనే మిలియనీర్ అయిపోయాడు. యాభై కేజీల కచ్చిడి చేప కలకత్తాలో రూ.13 లక్షలకు అమ్ముడుబోయింది. కాకినాడ కుంభాభిషేకం రేవులో కచ్చిడి చేప 4 లక్షల రూపాయలు పలికింది. కోనసీమలోని అంతర్వేది తీరంలో కచ్చిడి దొరికిన మత్స్యకారుడిపై కాసుల వర్షం కురిసింది. ఇలాంటి వార్తలు తరచూ చూస్తున్నాం. అసలేంటీ కచ్చిడి చేప. పులసకే తాతలా ఉంది. కళ్లు బైర్లు కమ్మే రేటు ఎందుకు పలుకుతోంది. కేజీ రూ. 20 వేలకు పైగా ధర పలికేంత విషయం కచ్చిడిలో ఏముంది. సింగపూర్, మలేసియా, హాంగ్‌కాంగ్, థాయ్‌లాండ్, జపాన్, ఇదర ఆగ్నేయాసియా దేశాల్లో దీనికి అంత డిమాండ్ ఎందుకు.. అంటే ఇది ఔషధాల గని కాబట్టి.

బురద ప్రాంతాల్లో నివాసం

హిందూ మహా సముద్రం, దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలో ఇవి నివసిస్తాయి. పర్షియన్ గల్ఫ్, భారత్ తీరం, జపాన్, పపువా న్యూగినియా, ఉత్తర ఆస్ట్రేలియా సముద్ర ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. నదీ ముఖద్వారాలు సమీపంలో, అడుగున బురదగా, బండరాళ్లు ఉండే ప్రాంతాల్లో జీవిస్తాయి. సాధారణంగా ఇవి 60 మీటర్ల లోతులో సంచరిస్తూ ఉంటాయి. ఆహారం కోసం వలస వెళ్తూ ఉంటాయి.

ఎన్నో పేర్లు..

ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతంలో కచ్చిడిగా పిలుస్తున్న ఈ చేప శాస్త్రీయ నామం ప్రొటోనిబియా డయాకాంథస్. దీనిని ఘోల్ ఫిష్ అని, సీ గోల్డ్ అని కూడా పిలుస్తారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో టెలియా భోలా, కచ్చర్ భోలా అని అంటారు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని బ్లాక్‌స్పాటెడ్ క్రోకర్ అని, ఆస్ట్రేలియాలో బ్లాక్ జ్యూఫిష్ అని అంటారు.

జీవితకాలం 15 ఏళ్లు..

వీటి నోరు పెద్దగా ఉంటుంది. పక్కన నాలుగు రెక్కలు (ఫిన్స్), వెన్నుముక పొడవునా మరో ఫిన్ ఉంటుంది. రెండు వెన్నుముకలతో పొట్ట తర్వాత నుంచి కిందకు వంగి.. తోకవరకు సన్నగా ఉంటుంది. ఇవి అవకాశాన్ని బట్టి అన్ని రకాల ఆహారాలను తింటాయి. ముఖ్యంగా పీతలు, రొయ్యలు, లాబ్‌స్టర్లను ఇష్టంగా లాగిస్తాయి. చిన్న చేపలను వేటాడతాయి. సముద్రంలో ఎక్కడెక్కడ తిరిగినా ఏటా గుడ్లు పెట్టే సమయానికి మాత్రం తమ ఆవాసాలకు గుంపులుగా చేరతాయి. మే నుంచి అక్టోబర్ మధ్య కాలంలో నదులు సముద్రంలో కలిసే చోట్లకు వచ్చి గుడ్లుపెడతాయి. వీటి జీవితకాలం 15 ఏళ్లు. అయితే పుట్టినప్పటి నుంచి చాలా వేగంగా ఎదుగుతాయి. నాలుగేళ్లలోనే మూడు అడుగుల సైజుకు పెరిగి సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి. ఐదు అడుగుల వరకూ కూడా పెరిగే ఇవి.. 60 కేజీలకు పైగా బరువుతూగుతాయి.

ఎన్నో ఉపయోగాలు

కచ్చిడి చేపలోని ఔషధ గుణాల వల్లే దానికంత క్రేజ్ వచ్చింది. ఐయోడిన్, ఒమెగా-3, డీహెచ్‌ఏ, ఈపీఏ, ఐరన్, మెగ్నీషియం, సెలీనియం లాంటి మినరల్స్ గని ఈ చేప. దీని కడుపు క్రింది భాగంలో చిన్న సంచిలాంటి శరీర భాగం ఉంటుంది. ఆ సంచిలో లభించే ఔషధాల వల్ల మార్కెట్‌లో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఈ సంచి కారణంగానే దీనిని సీ గోల్డ్ అని పిలుస్తారు.

- ఈదడానికి ఉపయోగపడే వీటి రెక్కలతో సింగపూర్‌లో వైన్ తయారు చేస్తారు.
- కంటి చూపును మెరుగుపరిచే చాలా విటమిన్స్, మినరల్స్, ప్రొటీన్స్ ఈ చేపలో పుష్కలంగా లభిస్తాయి.
- ఈ చేపలో చర్మానికి అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీనితో చర్మంపై ముడతలు పడవు. ముదిమి ఛాయలు దరిదాపులకు రాకుండా నవయవ్వనంగా చర్మం మెరుస్తుంది.
- చిన్న పిల్లల్లో మెదడు సక్రమంగా ఎదుగుదలకు ఈ చేపలో పెద్దఎత్తున లభించే ఒమెగా-3 ఎంతో ఉపయోగపడుతుంది. క్రమం తప్పక తింటూ ఉంటే ఐక్యూ (ఇంటెలిజెన్స్ కొషెంట్) కూడా బాగా అభివృద్ధి చెందుతుంది.
- కచ్చిడిలోని విటమిన్స్, మినరల్స్ మన శరీరంలోని కండరాలు బలంగా మారడానికి ఎంతో దోహదపడతాయి.

ప్రమాదంలో కచ్చిడి..



ప్రపంచ దేశాల్లో అతిగా వేటాడటం, తీర ప్రాంతం కాలుష్యంగా మారడం వల్ల దీని ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. గుడ్లు పెట్టేందుకు తీర ప్రాంతాలకు వచ్చే సమయంలో వీటిని ఎక్కువగా వేటాడటం వల్ల వాటి సంఖ్య విపరీతంగా తగ్గిపోతోంది. ఇటీవల కాలంలో దీనిని రక్షించడానికి ఆస్ట్రేలియా కొన్ని కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. అలాగే భారత్ తీర ప్రాంతంలో మెకనైజ్డ్ బోట్లతో వేట నిషేధం, ఇవి గుడ్లు పెట్టే సీజన్‌లో వేటకు విశ్రాంతి ప్రకటించడం వల్ల వీటికి రక్షణ లభిస్తోంది.

2047 నాటికి ఏపీని నంబర్ వన్ చేస్తా

- ఇండియా విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో చంద్రబాబు





చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా మారిన ప్రాంగణం

సాక్షి, విశాఖపట్నం: మళ్లీ తనని అధికారంలోకి తీసుకొస్తే.. 2047 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ చేస్తానని, తనని గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌ఎస్‌టీ) సంస్థ రూపొందించిన ఇండియా విజన్-2047 డాక్యుమెంట్‌ను ఆయన మంగళవారం విశాఖలోని ఎంజీఎం గ్రౌండ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినా అవినీతి పోలేదని, అందుకే ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైమ్ అనే నినాదంతో ముందుకెళ్దామని అన్నారు. పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్‌తో పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. బటన్ నొక్కడం వల్ల ఎవరికి లాభమో చూడాలే తప్ప, ఉత్తుత్తి బటన్‌లు నొక్కడం కాదన్నారు. విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, టెలికమ్యూనికేషన్, హైవేల నుంచి దేశంలో అమలైన ప్రతి ఒక్కటీ తన ఆలోచనే అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు తన వల్లే అభివృద్ధి చెందాయన్నారు. డబ్బులు ఎలా సంపాదించాలో చాలా మందికి నేర్పించానన్నారు. పర్మిషన్లు లేవని ప్రజావేదికని కూల్చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు రుషికొండని తవ్వేసి ఎలా భవనాలు కడుతున్నారని ప్రశ్నించారు.

సాక్షి టీవీ రిపోర్టర్‌పై దాడి...

సభలో కుర్చీలు నిండకపోవడంతో చంద్రబాబు అసహనం వ్యక్తంచేశారు. బాబు ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంగణం ఖాళీగా ఉన్న దృశ్యాల్ని చిత్రీకరిస్తున్న సాక్షి టీవీ చానెల్ రిపోర్టర్ సురేష్‌పై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి అనుచరులు సురేష్ మొబైల్ లాక్కొని, దుర్భాషలాడుతూ బయటకు ఈడ్చుకొని వెళ్లారు. ఇదంతా చూస్తున్న వెలగపూడి కనీసం వారిని వారించే ప్రయత్నం కూడా చేయలేదు. సురేష్‌పై దాడిని జర్నలిస్టులు నిరసించారు. దాడికి పాల్పడిన టీడీపీ శ్రేణులపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విజన్ డాక్యుమెంట్ అట్టర్‌ఫ్లాప్

ఇండియా విజన్-2047 పేరుతో చంద్రబాబు చేసిన షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్న సభలో చెప్పిన మాటలే చెప్పి, తానే గొప్పంటూ డబ్బా కొట్టుకొని, అందులోనూ సవాలక్ష తప్పులు చెప్పడంతో అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు మాట్లాడుతుండగానే 80 శాతం కుర్చీలు ఖాళీ అయ్యాయి. ఆయన రావడమే రెండు గంటలు ఆలస్యం. వచ్చీ రాగానే అడ్డగోలు అబద్ధాలు చెబుతుండటంతో అందరూ విసుక్కొంటూ వెళ్లిపోయారు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా కోవిడ్ సమయంలోనూ గ్రోత్ వచ్చిన ఏకైక రాష్ట్రం భారత్ అని చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. ఇంటర్‌లో ఇంజినీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో అందరూ ఆశ్చర్యపోయారు. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటేనే సంక్షేమం పరుగులు పెడుతుందని ఓ సందర్భంలో చెప్పడంతో విన్న వారందరూ అవాక్కయ్యారు. ఇలా అసంబద్ధ అంశాల్ని ప్రస్తావిస్తూ.. వాటిని మధ్యలోనే ఆపేసి.. మరో అంశాన్ని లేవనెత్తుతూ.. అన్నీ తానే చేశానని చెబుతుండటంతో ప్రసంగం చివరికొచ్చేసరికి టీడీపీ నేతలే మిగిలారు.

ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ
- భవిష్యత్‌లో పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలు తెస్తామని వెల్లడి

సాక్షి, అమరావతి: విజన్-2020 అయిపోయిందని.. ఇకపై విజన్-2047పై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047 గురించే ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారన్నారు. భారతదేశం ఆర్థికంగా ఎదుగుతోందని, డబ్బు పెరిగిపోతుందంటున్నారని పేర్కొన్నారు. అయితే, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం లేదని.. పెరుగుతున్న సంపద క్షేత్రస్థాయికి దిగడం లేదన్నారు. ప్రస్తుతం 2023 నడుస్తోందని.. 2047 నాటికి ఉపాధి అవకాశాలు బాగుండాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తాను కోరుకుంటున్నానన్నారు. పెరుగుతున్న సంపద అంతా రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొంది దోపిడీ చేసే కొందరి వద్దే పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కట్టినా ముఖ్యమంత్రులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని.. ఆంధ్రాలో అయితే 8 శాతం అంటున్నారన్నారు. సరైన వ్యక్తులకు ఓటు వేయకపోతే 2047 కల్లా మన బిడ్డలను మనమే సర్వనాశనం చేసుకుంటామని వ్యాఖ్యానించారు. ఈ సమాజంలో ధైర్యం చచ్చిపోయిందని, పిల్లల్లో పోరాటం చేసే మనస్తత్వాన్ని తల్లులుగా మహిళలే పెంచాలని కోరారు.

పథకాలేవీ ఆగవు

వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకపోతే పథకాలు ఆగిపోతాయేమో.. సంక్షేమం నిలిచిపోతుందేమో అనుకోవద్దని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రస్తుత పథకాల కంటే పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలే ఉంటాయి తప్ప ఈ పథకాలు తీసేసే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి ఒక్కరికీ మాట ఇస్తున్నానని.. జగన్‌ను ఎన్నుకోకపోతే ఏం జరుగుతుందో అనే మాట అవసరం లేదన్నారు. 'మీ అందరికీ అండగా మేం నిలబడతాం. మీరు ఒకటే చూడండి. జనసేన పార్టీగా.. జనసేన నేతగా మేం ఓడిపోయినా నిలబడే ఉన్నాం. మాకు మా దేశం మీద, మా రాష్ట్రం మీద, ప్రజల మీద, ఎంత ప్రేమాభిమానం లేకపోతే ఎందుకు నిలబడి ఉంటాం. అందరు ఒక్కసారి దీనిని ఆలోచించాలని కోరుకుంటున్నా' అన్నారు. అమ్మఒడి, ఇతర పథకాలు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కులే కానీ, జగన్ కల్పించిన హక్కులు కాదని అందరూ తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్తంగా ఉందని, ప్రతి ఒక్కరూ మేం ఇక్కడ ఉండలేం, పారిపోతాం అంటున్నారని పేర్కొన్నారు.

ఉప ఎన్నికల్లోనూ సగానికిపైగా ఏకగ్రీవాలు

66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 32 ఏకగ్రీవం.. మరో 32 చోట్లే పోటీ

- 1,064 వార్డు స్థానాలకుగాను 757 చోట్ల ఏకగ్రీవం
- పోటీ ఉన్నచోట 19న పోలింగ్



సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా 484 మండలాల పరిధిలో మొత్తం 1,033 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో సగానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 66 సర్పంచ్ స్థానాలతోపాటు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా, సోమవారం సాయంత్రం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు.. సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగే మొత్తం 66 గ్రామాల్లో 32 చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, రెండుచోట్ల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. కేవలం 32చోట్ల మాత్రమే సర్పంచ్ స్థానాలకు ఈ నెల 19న పోలింగ్ జరగనుంది. మరోవైపు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 757 స్థానాలు ఏకగ్రీవం కాగా, 261 చోట్ల 19న పోలింగ్ జరగనుంది. 46 వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కరు కూడా నామినేషన్లు దాఖలు చేయనందున ఆయా స్థానాల్లో ఎన్నికలు నిలిచిపోయాయి.

మూడురెట్లు పెరిగిన ఏకగ్రీవాలు..

రెండున్నర ఏళ్ల క్రితం... అంటే 2021 జనవరి, ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అప్పట్లో సర్పంచ్ స్థానాల్లో కేవలం 17 శాతం, వార్డు సభ్యుల స్థానాల్లో 36 శాతం ఏకగ్రీవమయ్యాయి. కానీ, ఇప్పుడు రెండున్నర ఏళ్ల తర్వాత ఉప ఎన్నికలు జరుగుతున్నప్పటికీ.. అప్పటికంటే సర్పంచ్ స్థానాల్లో దాదాపు మూడు రెట్లు ఏకగ్రీవాలు పెరగగా, వార్డు సభ్యుల స్థానాల్లో ఏకగ్రీవాలు రెట్టింపు కావడం గమనార్హం.

తల్లిని అవమానించిన వాళ్లకు పవన్ ఊడిగం

- వీర మహిళలకు నీతి పాఠాలు చెప్పడం కాదు.. ముందు నిన్ను నువ్వు మార్చుకో..
- ఎమ్మెల్సీ పోతుల సునీత



సాక్షి, అమరావతి: కన్నతల్లిని అవమానించిన వాళ్లకు ఊడిగం చేస్తున్న సిగ్గు, శరం లేని వ్యక్తి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఎద్దేవా చేశారు. ఆమె మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ టీడీపీతో నీచమైన బంధం కొనసాగిస్తూ మరోమారు తన తల్లిని తానే అవమానించుకుంటున్నారని పేర్కొన్నారు. తల్లిని మించిన దైవం లేదని భావించే సంస్కృతి మనదని.. అలాంటి తల్లిని అవమానించిన వాళ్లను ఎవరైనా శత్రువుగా భావిస్తారన్నారు. పవన్ కళ్యాణ్ మాత్రం తన తల్లిని అవమానించిన వ్యక్తులతోనే దోస్తీ కట్టి ప్యాకేజీ బంధానికి బానిసగా మిగిలారని దుయ్యబట్టారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటినుంచీ తన గురించి కాకుండా.. చంద్రబాబుకు అధికారమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎంత కాదన్నా బాబు జేబు సంస్థగానే జనసేన పార్టీ నడుస్తోందని.. చంద్రబాబుకు బానిసగా పవన్ పని చేస్తున్నాడని అందరికీ తెలిసిపోయిందన్నారు. మహిళల పుట్టుకనే అవమానించిన చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నారంటే.. పవన్ ఎంత దిగజారుడు రాజకీయం నడుపుతున్నారో అర్థమవుతోందన్నారు.

మహిళల గురించి మాట్లాడే అర్హత లేదు

మహిళలపై పవన్‌కున్న గౌరవం ఏపాటిదో ఆయన వ్యక్తిగత జీవితమే చెబుతోందని సునీత పేర్కొన్నారు. వీర మహిళలకు ప్రభుత్వ తీరు, విధానాలపై లేనిపోని సొల్లు కబుర్లు చెప్పి పవన్ ఉసిగొల్పితే సరిపోదన్నారు. నాయకుడిగా ఆయన ప్రవర్తనను సరిచేసుకుని పదిమందికీ ఆదర్శంగా నిలిచినప్పుడే నీతిపాఠాలు చెప్పే హక్కు లభిస్తుందన్నారు.

వ్యవస్థలన్నింటినీ నాశనం చేసిన చంద్రబాబు

- వలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం దారుణం
- సీఎం వైఎస్ జగన్ వ్యవస్థలకు మళ్లీ జీవం పోశారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నింటినీ చంద్రబాబు నాయుడు నాశనం చేశారని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వ్యవస్థలన్నింటికీ జీవం పోశారని చెప్పారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు వలంటీర్లపై ఇష్టానుసారం మాట్లాడుతుండటం దారుణం అన్నారు. కరోనా సమయంలో వారు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఆ సమయంలో చంద్రబాబు, పవన్ ఎక్కడికి పారిపోయారని నిలదీశారు. కరోనా సమయంలో సేవలు అందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ బెస్ట్ స్టేట్‌గా నిలిచిందని గుర్తు చేశారు. ఈ అంశం ఏపీ చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయదగ్గదన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను దేశంలోని రాష్ట్రాలన్నీ ప్రశంసిస్తుంటే పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం బాబు, పవన్‌లకు మాత్రమే చెల్లిందని ధ్వజమెత్తారు. పాలనను ప్రతి గడపకూ తీసుకెళ్లడంలో సీఎం జగన్ విజయం సాధించారని చెప్పారు. ఎవరెంతగా దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని, తిరిగి వైఎస్ జగన్‌కే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సైబర్ ఉగ్రవాదానికి ఇక చెక్

- ఎన్‌ఐఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా యాంటీ సైబర్ టెర్రరిజం యూనిట్
- రాష్ట్రాల సైబర్ సెల్స్‌తో అనుసంధానం
- విదేశీ దర్యాప్తు సంస్థలతో అవగాహన ఒప్పందం



సాక్షి, అమరావతి: సైబర్ ఉగ్రవాదం ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్ర హోం శాఖ పటిష్ట కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. దేశంలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో సమర్థంగా వ్యవహరిస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఆధ్వర్యంలోనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 'యాంటీ సైబర్ టెర్రరిజం యూనిట్ (ఏసీటీయూ) పేరిట ఈ ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పనుంది. విదేశాలను కేంద్రంగా చేసుకుని దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలు పదేళ్లుగా సైబర్ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నాయి. ప్రధానంగా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుని సైబర్ ఉగ్రవాదానికి పాల్పడుతున్నాయి. రక్షణ, పరిశోధన సంస్థలు, ఇస్రో, విద్యుత్ గ్రిడ్లు, టెలీ కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ తదితర రంగాలను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆయా ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన సైబర్ నిపుణులు ఎంత అప్రమత్తంగా ఉంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో సైబర్ దాడులను నిరోధించడంలో పూర్తిగా సఫలీకృతం కాలేకపోతున్నాయి. 2018లో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలపై 70,798 సైబర్ దాడులు జరిగాయి. కాగా.. 2023లో మొదటి 6 నెలల్లోనే ఏకంగా 1.12 లక్షల సైబర్ దాడులు జరగడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సమాచార వ్యవస్థపై సైబర్ దాడులతో కీలక వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ గ్రిడ్స్‌పైనా ఉగ్రవాదం గురి

లద్దాక్‌లోని విద్యుత్ గ్రిడ్‌లపై ఇటీవల జరిగిన సైబర్ దాడులతో చైనా సరిహద్దుల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల వ్యవస్థకు ఉన్న ముప్పును గుర్తు చేసింది. కేరళ, గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థల పేరుతో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రోత్సహిస్తోందని ఎన్‌ఐఏ కేసులు నమోదు చేసింది. అనుమానితుల నివాసాల్లో సోదాలు నిర్వహించగా.. సైబర్ దాడులకు సంబంధించిన సమాచారం లభ్యమైనట్టు తెలుస్తోంది. ఇవన్నీ కూడా దేశం ఎదుర్కొంటున్న సైబర్ ఉగ్రవాద పెనుముప్పునకు సంకేతంగా నిలుస్తున్నాయి. అందుకే వెంటనే అప్రమత్తమైన కేంద్ర హోం శాఖ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగానే ఎన్‌ఐఏలోనే అంతర్భాగంగా యాంటీ సైబర్ టెర్రరిజం యూనిట్(ఏసీటీయూ)ను నెలకొల్పాలని నిర్ణయించింది.

రాష్ట్రాలతో అనుసంధానం.. విదేశాలతో సమన్వయం

సైబర్ ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు యాంటీ సైబర్ టెర్రరిజం యూనిట్ (ఏసీటీయూ) ఏర్పాటు తుది దశకు చేరుకుంది. భారీ స్థాయిలో పోలీస్ అధికారులు, సైబర్ భద్రతా నిపుణులు, ఇతర అధికారులు, సిబ్బందితోపాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏసీటీయూను రూపొందించే ప్రణాళికను కేంద్ర హోం శాఖ ఆమోదించింది. దీని పరిధిలో ఆర్థిక, ఐటీ, రక్షణ, టెలి కమ్యూనికేషన్లు, ఇతర రంగాలకు సంబంధించి సైబర్ సెల్స్ ఏర్పాటు చేస్తారు. దేశంలోని అన్ని పోలీసు శాఖల ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్స్ విభాగాలతోపాటు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశోధన సంస్థల సైబర్ సెల్స్‌తో ఏసీటీయూను అనుసంధానిస్తారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగాలకు కేంద్ర హోం శాఖ సమాచారం పంపింది. ఉగ్రవాద సంస్థలు విదేశాలను కేంద్ర స్థానంగా చేసుకునే సైబర్ దాడులకు పాల్పడుతున్నాయి. అందుకు ఏసీటీయూకు విదేశాలతో సమన్వయం చేసుకునేందుకు ఇంటర్ పోల్‌తోపాటు విదేశీ దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకునేందుకు అధికారాన్ని కలిపిస్తారు. విదేశాల్లోని దర్యాప్తు సంస్థలతో సమాచార మార్పిడి, ఇతర సహకారం కోసం ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకుంటారు. రెండు నెలల్లో ఏసీటీయూను అధికారికంగా ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ భావిస్తోంది. అందుకోసం ఎన్‌ఐఏ తుది సన్నాహాలను వేగవంతం చేస్తోంది.

ఇష్టంగా నేర్చుకోవాలే కానీ మట్టి కూడా పాఠాలు నేర్పుతుంది.
కొత్త ఆవిష్కరణలతో పాటు ఉపాధికీ బాటలు వేస్తుంది.
హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో ఉంటున్న సంగిశెట్టి సంగీత తన కళ ద్వారా ఈ విషయాన్ని మనందరికీ చాటుతోంది.
సరదాగా నేర్చుకున్న కళ ద్వారా ఉపాధి పొందుతూ, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

ఇష్టమే పెట్టుబడి


సంగిశెట్టి సంగీత





‘‘కస్టమైజ్డ్ గిఫ్ట్ ఆర్టికల్స్, ఇంటి అలంకరణ వస్తువులు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్క్‌షాప్స్.. ఆర్టిస్ట్‌గా నాకు నేను గుర్తింపు సంపాదించుకోవడానికి పదిహేనేళ్లకు పైగా పట్టింది. నేటి రోజులకు తగినట్టు స్టాచ్యూ, త్రీడీ ఎఫెక్ట్స్, క్యూబిజమ్, జపనీస్ ఆర్ట్, మల్టీపర్పస్ గిఫ్ట్ ఆర్టికల్స్ తయారుచేస్తుంటాను. ఇవన్నీ మట్టితో రూపొందించేవే. ఎకో, పాటరీ క్లే, పాలిమర్ క్లే, మోడలింగ్ క్లేతో కళారూపాల రూపకల్పన ఉంటుంది. ఇవి ఎప్పటికీ పాడవ్వు. నీటిలో కరగవు, కిందపడినా పగిలిపోవు. ఇల్లు, ఆఫీసులలో అలంకరణ వస్తువులుగా క్లే ఆర్ట్ కళాకృతులను ఎక్కువ వినియోగిస్తుంటారు. డిజైన్ బట్టి ధర ఉంటుంది. రెయిజన్ మెటీరియల్‌తో కస్టమైజ్డ్ గిఫ్ట్ ఐటమ్స్, షాడో బాక్స్‌లు.. పెళ్లి, పుట్టిన రోజులు వంటి సందర్భాన్ని పురస్కరించుకొని వచ్చిన ఆర్డర్స్‌ని బట్టి డిజైన్స్ చేస్తుంటాను. పెన్సిల్, చార్కోల్, మ్యూరల్, ఆయిల్ పెయింటింగ్స్ కూడా నా రోజు వారి వర్క్‌లో భాగమే.

వర్క్‌షాప్స్

ఎం.కామ్. వరకు చదువుకున్నాను. పెళ్లి, పిల్లలు జీవితంలో ఎప్పుడూ హడావిడి ఉంటూనే ఉంటుంది. ఉద్యోగం చేయాలనుకున్నా వద్దనుకొని, హాబీకే టైమ్ కేటాయించాను. ఇదే ఉపాధిగా మారుతుందని ముందు అనుకోలేదు. కానీ, ఇష్టమైన పనే ఆదాయ మార్గాన్ని కూడా చూపిస్తుందని వచ్చిన ఆర్డర్స్ ద్వారా అర్థమైంది. ‘డూడుల్ బగ్స్ పేరుతో ఆర్ట్ స్టూడియో ఏర్పాటు చేశాను. ఆన్‌లైన్ ద్వారా అమెరికా, కెనడాలోనూ నాకు స్టూడెంట్స్ ఉన్నారు. కొందరు గృహిణులు గ్రూపుగా ఏర్పడి తమకు ఈ క్లే ఆర్ట్ నేర్పించమని అడుగుతారు. ఐదారుగురు గ్రూప్‌గా ఉన్నా వారి కోసం వర్క్‌షాప్స్ నిర్వహిస్తుంటాను. ఇప్పటికి వందల సంఖ్యలో మహిళలు శిక్షణ తీసుకున్నవారున్నారు. ప్రతిరోజూ సాయంకాలాలు క్లే ఆర్ట్ ట్రెయినింగ్ క్లాసులు తీసుకుంటాను. వచ్చిన ఆర్డర్స్‌ను బట్టి నా దగ్గర వర్క్ నేర్చుకున్న వాళ్లకు అవకాశాలు ఇస్తుంటాను.



రికార్డులు తెచ్చిన ఆర్ట్

రెండేళ్ల క్రితం పిస్తా పొట్టుపై చేసిన మైక్రో క్లే ఆర్ట్ మంచి పేరుతో పాటు అవార్డులు కూడా తెచ్చిపెట్టింది. పండ్లు, కూరగాయలు, స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు 150 కంటే ఎక్కువ రకాలు పిస్తా పొట్టుపై 74 గంటలలో చేసి చూపించాను. ఈ సూక్ష్మ కళా నైపుణ్యాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు వచ్చేలా చేసింది. వర్చువల్ అవార్డులూ వరించాయి.

సాధనమున..

ఆసక్తి ఉండి, ఫీజు చెల్లించలేం అనుకునే వారికి మెటీరియల్ ఇచ్చి మరీ ఈ వర్క్స్ నేర్పిస్తుంటాను. ఏ కళ అయినా సాధన చేస్తూ ఉంటే కొత్త కొత్త నైపుణ్యాలు వచ్చి చేరుతాయి. అవే ఉపాధికి మార్గం చూపుతాయి. అందుకే, వర్క్ నేర్చుకున్నవాళ్లను మోటివేట్ చేస్తూ, తమను తాము బిల్డ్ చేసుకునేలా గైడెన్స్ ఇస్తుంటాను. నాకు ఇష్టమైన పని కావడంతో మరింత కొత్తదనం కోసం సాధన చేస్తూ ఉంటాను. ఎందుకంటే ఈ కళారంగంలో ఇష్టమే పెట్టుబడి అవుతుంది’’ అని వివరిస్తుంది ఈ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేష్‌రెడ్డి

టీ తోట నుంచి చైతన్యం

మనదేశంలో పోష్ యాక్ట్ వచ్చి పదేళ్లయింది.
ఇలాంటి చట్టం ఉందని తెలియని వాళ్లే ఎక్కువ.
చట్టం తెలియలేదంటే లైంగిక వేధింపులు లేవనా?
ఎందుకు లేవు... అన్ని చోట్లా ఉన్నాయి.
ఫైళ్లు పట్టుకునే చేతులకు ఉన్నాయి.
ఇటుక మోసే భుజాలకూ ఉన్నాయి.
టీ ఆకు తుంచే వేళ్లు సంఘటితమై శాసించాయి.
సంఘటిత శక్తి సత్తా ఏమిటో తెలియచేశాయి.



పోష్ (ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రమ్ సెక్సువల్ హెరాస్‌మెంట్) యాక్ట్ 2013 ప్రకారం వ్యవస్థీకృతమైన రంగాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులను నివారించడానికి ఇంటర్నల్ సెల్ ఏర్పాటు చేయడం జరుగుతోంది. కానీ అసంఘటిత రంగాల్లో పని చేసే మహిళలకు ఇలాంటి ఒక చట్టం ఉందనే సంగతి కూడా తెలియదు. ఇలాంటి స్థితిలో అస్సాంలోని టీ తోటల్లో పని చేసే మహిళలు సంఘటితమై తమ హక్కును కాపాడుకోవడానికి ఉద్యమించారు.

ఒకరికొకరు అండగా

మనదేశంలో వ్యవసాయరంగం తర్వాత మహిళలు అతిపెద్ద సంఖ్యలో పని చేస్తున్నది టీ తోటల్లోనే. ఈ తోటల్లో పని చేసే కార్మికుల్లో ఎనభైశాతం మహిళలే. అస్సాం, వెస్ట్‌బెంగాల్, కేరళ, తమిళనాడులన్నీ కలిపి దేశంలో 350కి పైగా టీ తోటలున్నాయి. దాదాపుగా ఒక్కో తోటలో వెయ్యికి పైగా మహిళలు పనిచేస్తుంటారు. దేశవ్యాప్తంగా మూడు లక్షల అరవైవేలకు పైగా మహిళలు టీ తోటల్లో పని చేస్తున్నారు. ఈ మహిళల పరిస్థితి ఒకప్పుడు అత్యంత దయనీయంగా ఉండేది. వాళ్ల మాటకు ఇంట్లో విలువ ఉండేది కాదు, పని చేసే చోట లైంగిక వేధింపులు, వివక్ష తప్పేది కాదు. ఒకరి కష్టాన్ని మరొకరికి చెప్పుకుని ఓదార్పు పొందడమే తప్ప, ఆ కష్టాల నుంచి బయటపడవచ్చని తెలియని రోజులవి. ఒకసారి తెలిసిన తరవాత ఇక వాళ్లు ఆలస్యం చేయలేదు. ఉమెన్స్ సేఫ్టీ యాక్సెలరేటర్ ఫండ్ (డబ్ల్యుఎస్ఏఎఫ్) స్వచ్ఛంద సంస్థ అండతో ముందుకురికారు.

అస్సాం నుంచి కేరళ వరకు

తమకు భద్రత కల్పించడానికి పోష్ అనే చట్టం ఉందని తెలిసిన తర్వాత ఆ చట్టం ద్వారా ఎన్ని రకాలుగా రక్షణకవచంగా ఉపయోగించుకోవచ్చనే వివరాలు కూడా తెలుసుకున్నారు. ‘సమాజ్’ పేరుతో వాళ్లలో వాళ్లు కమిటీలుగా ఏర్పడ్డారు. బృందంగా వెళ్లి ప్రభుత్వ అధికారులను కలుస్తూ... ప్రతి తోటలో ఇంటర్నల్ సెల్ ఏర్పాటయ్యే వరకు తమ ఉద్యమాన్ని ఆపలేదు. లైంగిక వేధింపులకు గురయినప్పుడు ఎలా ప్రతిఘటించాలో, ఎలాంటి ఆధారాలతో ఇంటర్నల్ సెల్‌కు ఎలా తెలియచేయాలో కళ్లకు కడుతూ చిన్నచిన్న నాటికలు ప్రదర్శించారు. అస్సాం, బెంగాల్ నుంచి కొంతమంది చురుకైన మహిళలు కేరళ, తమిళనాడులకు వచ్చి ఇక్కడి వారిని చైతన్యవంతం చేసే పని మొదలు పెట్టారు. ర్యాలీలు నిర్వహిస్తున్నారు.


తేయాకు తోట కార్మికుల ర్యాలీ

ఒక్క ఫోన్ కాల్ చాలు!

పోష్ చట్టం ప్రకారం సెక్సువల్ హెరాస్‌మెంట్ రిడ్రెసల్ కమిటీలు భవన నిర్మాణ రంగంలో కూడా ఉండాలి. అయితే టీ తోటల్లో మహిళల్లాగ భవన నిర్మాణంలో పని చేసే మహిళలు సంఘటితం అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఎందుకంటే ఎక్కువ కాలం ఒకే చోట నివసిస్తున్న వాళ్లు మాత్రమే వేధింపులకు గురవుతున్న విషయాన్ని ఒకరితో ఒకరు పంచుకోగలుగుతారు. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుని కలిసికట్టుగా పోరాటానికి సిద్ధమవుతారు. టీ తోటల్లో పని చేసే వాళ్లు సుదీర్ఘకాలం ఒకే చోట నివసిస్తూ, అదే తోటల్లో కలిసి పనిచేస్తూ ఉంటారు. భవన నిర్మాణ కార్మికులు అలా కాదు. ఒక భవనం పూర్తి కాగానే మరో భవనం కోసం వెళ్లిపోతుంటారు. తమ సమస్యకు పరిష్కారం కోసం సంఘటితం కాగలిగినంత సమయం కూడా ఒకేచోట ఉండరు. కాబట్టి పని చేసే ప్రదేశంలో కంప్లయింట్ ఇవ్వాల్సిన వివరాలతోపాటు ఫోన్ నంబరు రాయడమే వారిలో చైతన్యాన్ని కలిగిస్తుంది. అలాగే రైతుబజార్‌లు, కూరగాయల మార్కెట్‌లలో కూడా మహిళలు ఎక్కువగా ఉంటారు. అధికారులు సమావేశం ఏర్పాటు చేసి లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు కంప్లయింట్ ఇవ్వవచ్చని తెలియచేయాలి. కంప్లయింట్ విభాగానికి చెందిన ఫోన్ నంబర్‌ను ఆ మార్కెట్‌లో కూరగాయల ధరల పట్టిక కనిపించినట్లు బాగా కనిపించేటట్లు రాయాలని సూచించారు మహిళల హక్కుల యాక్టివిస్టు కొండవీటి సత్యవతి.

ఒక నోడల్ పాయింట్

లైంగిక వివక్ష, వేధింపు, హింస, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, ప్రసవ సమయంలో మరణాలు దేశంలో అస్సాం మొదటిస్థానంలో ఉంటుంది. అస్సాం, బెంగాల్‌లో మహిళల కోసం ప్రాతినిధ్యం వహించేవాళ్లు లేరు.

టీ ఎస్టేట్‌లలో పనిచేసే బాలికలు, మహిళల భద్రత, హింస నిరోధం కోసం ఏర్పడిన కన్షార్షియం డబ్ల్యుఎస్ఏఎఫ్... మహిళలను చైతన్యవంతం చేయడంతోపాటు లీగల్ సర్వీసెస్ అథారిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌లు, పోలీస్, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చింది. ఆ ప్రయత్నం మంచి ఫలితాన్నిచ్చింది. అస్సాం టీ తోటల్లో పని చేసే మహిళలు దేశానికి దిక్సూచి అయ్యారు.

– వాకా మంజులారెడ్డి

చట్టం... కమిటీలే కాదు... ప్రభుత్వం ఇంకా చేయాలి!



వ్యవస్థీకృత రంగంలో పనిచేసే మహిళల కోసం ఇంటర్నల్ కమిటీలున్నట్లే అసంఘటితరంగంలో కూడా కమిటీలుండాలి. ఇళ్లలో పని చేయడం, వీధుల్లో తిరుగుతూ కూరగాయలు, పండ్లు అమ్ముకోవడం వంటి ఇతర పనుల్లో ఉండే మహిళల కోసం లోకల్ కంప్లయింట్స్ కమిటీలుండాలి. కమిటీలు వేయడంతో సమస్య పరిష్కారం కాదు. ఇలాంటి కమిటీలున్నాయనే విషయం మహిళలకు తెలియాలి. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు ఆయా కమిటీలకు కంప్లయింట్ ఎలా ఇవ్వాలో తెలియచేయాలి. ఫోన్ నంబర్ లేదా హెల్ప్‌లైన్ నంబర్‌లను పని ప్రదేశంలోనూ ఇతర కమ్యూనిటీ సెంటర్‌లలోనూ బాగా కనిపించేటట్లు బోర్డు మీద రాయాలి. అందుకు ప్రభుత్వమే పూనుకోవాలి. చట్టం చేసి తన బాధ్యత అయిపోయిందనుకుంటే సరిపోదు. చట్టాన్ని అమలు చేయడం, అమలయ్యే పరిస్థితులు కల్పించడం, చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, తమ హక్కుల ఉల్లంఘన కలిగినప్పుడు గళమెత్తగలిగేటట్లు భరోసా కల్పించడం కూడా ప్రభుత్వం నిర్వర్తించాల్సిన బాధ్యతలే.

– కొండవీటి సత్యవతి,
భూమిక ఉమెన్స్ కలెక్టివ్,
మెంబర్, లోకల్ కంప్లయింట్ కమిటీ, రంగారెడ్డి జిల్లా

స్ఫూర్తి



వయసు 96 బీచ్‌కు కాపలాదారు

చెన్నైలోని బీచ్‌లను అభివృద్ధి పేరుతో ధ్వంసం చేయాలంటే అందరికీ భయం. దానికి కారణం కామాక్షి సుబ్రమణియన్. బీచ్‌లకు రక్షకురాలిగా ‘అమ్మమ్మ’గా అందరూ పిలుచుకునే కామాక్షి గత 40 ఏళ్లుగా చెన్నైలోని బీచ్‌లను కాపాడుతోంది. ఈ పనికి అందరూ పెట్టిన పేరు ‘విషన్ కామాక్షి’.

1930లో మద్రాసులో ఒక ఘటన జరిగింది.

అక్కడి బెసెంట్ నగర్ బీచ్ (ఎలియెట్స్ బీచ్)లో ఒక బ్రిటిష్ అమ్మాయి స్నానం చేస్తూ మునిగిపోబోయింది. ఒడ్డున ఉన్న కాజ్ ష్మిడ్ అనే డెన్మార్క్ నావికుడు అది గమనించాడు. వెంటనే సముద్రంలోకి పరిగెత్తి ఆ అమ్మాయిని కాపాడబోయాడు. అలల తీవ్రత ఎక్కువగా ఉండింది. అమ్మాయిని ఒడ్డుకు తోసేశాడు. తాను మాత్రం సముద్రంలో మునిగిపోయాడు. అమ్మాయి ఆ సంగతి గురించి కిక్కురుమనకుండా సాయంత్రం జరిగిన పార్టీకి హాజరైంది. కాని నాటి గవర్నర్‌కు ఎలాగో సంగతి తెలిసింది. ఆయన ఆగ్రహంతో ఆ అమ్మాయి మీద కేకలేసి కాజ్ ష్మిడ్ సాహసానికి గుర్తుగా ష్మిడ్ మెమోరియల్ కట్టించాడు. చాలా తమిళ సినిమాల్లో ఈ మెమోరియల్ కనిపిస్తుంది. అయితే ఇది అనేక ఏళ్లపాటు శిథిలావస్థలో ఉండింది. కార్పొరేషన్ వారిని వేధించి, వెంటబడి దానిని పునరుద్ధరించిన వ్యక్తి కామాక్షి సుబ్రమణియన్. ఇవాళ ష్మిడ్ మెమోరియల్ ఎంతో చక్కగా పర్యాటకుల్ని ఆకర్షిస్తూ ఉంది. ఏ సాయంత్రం బీచ్‌కు వెళ్లినా ఆ చుట్టుపక్కల నవ్వుతూ కామాక్షి సుబ్రమణియన్ కనిపిస్తుంది.

బీచ్ ఒడ్డు మనిషి

కామాక్షి సుబ్రమణియన్ బెసెంట్ నగర్‌లో పుట్టి పెరిగింది. బెసెంట్ నగర్ అడయార్ పక్కనే ఉంటుంది. పెళ్లయ్యాక భర్తతో 1980 వరకూ ఢిల్లీలో ఉండిపోయింది కామాక్షి. భర్త రాష్ట్రపతి భవన్‌లో కార్యదర్శిగా పని చేసేవాడు. ‘ఆ సమయంలో నా భర్త వల్ల బ్యూరోక్రసిలో ఎలాంటి అలక్ష్యం జరుగుతుందో, తెలిసీ తెలియక ఎన్ని మతలబులు చోటు చేసుకుంటాయో తెలుసుకున్నాను’ అంటుంది కామాక్షి. భర్త రిటైర్ అయ్యాక చక్కా వచ్చి బెసెంట్ నగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్న కామాక్షి ఆ రోజుల్లో దట్టంగా ఉన్న చెట్లను కొందరు వంట చెరుకు కోసం కొట్టడం బాల్కనీలో నుంచి గమనించేది. ఆ చెట్లు కొట్టేస్తే నీడ ఏం కాను? అందుకని వారు రావడంతోటే పెద్దగా అరుస్తూ తరిమి కొట్టేది. ‘అలా నా పౌర సేవ మొదలైంది’ అని గుర్తు చేసుకుంది కామాక్షి. ఆమెకు రోజూ బీచ్‌కు వెళ్లడం అలవాటు అలా బీచ్ మీద ప్రేమ ఏర్పడింది.

96 ఏళ్ల వయసులో

‘నగర పౌరులకు హక్కులుంటాయి. పబ్లిక్ స్థలాలు వారి ఆహ్లాదం కోసం. పార్కులు వారికి కావాలి. పేవ్‌మెంట్‌లు కావాలి. బీచ్ శుభ్రంగా ఉండాలి. వాటి కోసం నేను పోరాటం చేస్తాను’ అంటుంది కామాక్షి. ఆ మధ్య జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 174 వ వార్డులో ఇండిపెండెంట్‌గా నిలుచుంది కామాక్షి. పత్రికలు ఆమె గురించి విస్తృతంగా రాశాయి. ‘పార్టీ జెండా కింద నిలబడితే పార్టీ పనులన్నీ సమర్థించాలి. నేను అలా చేయలేను’ అందామె. అందుకే ఓడిపోయింది కూడా. కాని నేటికీ ఆమె పౌరుల హక్కుల కోసం పని చేస్తూనే ఉంది. ‘బెసెంట్ నగర్ బీచ్ దగ్గర వాకింగ్ ట్రాక్‌ను అడ్డుకుంటూ పబ్లిక్ టాయిలెట్లు కడుతున్నారు. దానిని అడ్డుకోవడానికి ధర్నా చేస్తున్నాను’ అని ధర్నాకు కూచుందామె. కార్పొరేషన్ అధికారులకు ఆమెను చూస్తే భయం. ఎవరో ఒకరు భయపెట్టకపోతే పనులెలా జరుగుతాయి? 96 ఏళ్లలో కామాక్షి అన్ని పనులు చేస్తుంటే మనం ఎన్ని పనులు చేయాలి?

ఆక్రమణలపై పోరు

బెసెంట్ నగర్‌లో అడయార్‌లో ఏ కార్పొరేషన్ పనులు జరుగుతున్నా వాటి అజమాయిషీకి కామాక్షి హాజరయ్యేది. జరగని పనుల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరిగేది. కార్పొరేటర్‌లను, మేయర్‌ను కలిసి వారిని నిలదీసేది. ‘మనం ట్యాక్స్ ద్వారా కట్టే డబ్బుతో ప్రభుత్వం పనులు చేయిస్తుంది. ఆ పనులు సక్రమంగా జరిగేలా చూడటం మన బాధ్యత’ అంటుంది కామాక్షి. బెసెంట్ నగర్‌లో ఒక రోడ్డు వేస్తుంటే రోజూ వెళ్లి అజమాయిషీ చేసింది కామాక్షి. కాంట్రాక్టర్‌ను క్వాలిటీగా పని చేయమని దబాయించింది. ‘ఇవాళ్టికి 12 ఏళ్లు. రోడ్డు కొంచెం కూడా చెక్కు చెదరలేదు’ అంటుంది నవ్వుతూ. బెసెంట్ నగర్‌లో, బీచ్ చుట్టుపక్కల ఆక్రమణలు ఏవైనా జరిగితే ఆమె సహించదు. ధర్నాకు కూచుంటుంది.

యూత్ పల్స్

పదిహేను వసంతాల యువసంతకం



భారతదేశంలో పదిహేను వసంతాలను పూర్తి చేసుకున్న యూట్యూబ్ (ఇండియా) పల్లె నుంచి మహా పట్నం వరకు యువతరంలో ఎంతోమందిని కంటెంట్ క్రియేటర్స్‌గా మార్చింది. ఎప్పటికప్పుడు ప్రేక్షకుల నాడిని తెలుసుకుంటూ, యూట్యూబ్ కొత్త టూల్స్‌ను అందిపుచ్చుకుంటూ తమ సృజనాత్మక శక్తులను బలోపేతం చేసుకుంటున్నారు యంగ్ క్రియేటర్‌లు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్ యువత రంగుల కలలను సాకారం చేసే రంగస్థలం అయింది. ప్యారే దోస్తుగా మారింది...

‘మన దేశ డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పదిహేను సంవత్సరాల యూట్యూబ్ ప్రయాణంలో కనిపిస్తుంది’ అంటాడు యూ ట్యూబ్ ఇండియా డైరెక్టర్ ఇషాన్ ఛటర్జీ. డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ మాట ఎలా ఉన్నా యువతరం క్రియేటివ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. యూట్యూబ్ ఎంతోమంది క్రియేటర్‌లను సృష్టించింది. కొత్త కెరీర్ దారులను పరిచయం చేసింది.

చెన్నైకి చెందిన మలర్ సరదాగా యూట్యూబ్‌లో ఇంగ్లీష్–స్పీకింగ్ కోర్సు మొదలుపెట్టింది. ఆ తరువాత ఆఫ్‌లైన్‌లో కూడా సక్సెస్ అయింది. తన యూట్యూబ్ కుకింగ్ చానల్‌తో సక్సెస్ అయిన పశ్చిమబెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన పుష్పరాణి సర్కార్ ‘ఈ చానల్ ద్వారా నలుగురికి నా పేరు తెలియడమే కాదు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకుండా పోయింది’ అంటుంది.

ఎబిన్ జోస్ పాపులర్ యూట్యూబ్ చానల్ ‘ఫుడ్ అండ్ ట్రావెల్’కు 7,00,000 సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

‘అనుకరణతో ఫలితం ఉండదు. ఎవరి సక్సెస్ ఫార్ములాను వారు రూపొందించుకోవాల్సిందే’ అంటాడు జోస్.

2008లో మన దేశంలోకి యూ ట్యూబ్ లోకలైజ్‌డ్ వెర్షన్ అడుగు పెట్టింది. ఈ పదిహేను సంవత్సరాల కాలంలో ఎన్నో అవతారాలు ఎత్తింది. ఎన్నో ట్రెండ్స్‌ను పరిచయం చేసింది. ఈ ట్రెండ్స్‌లో యువతరానిదే పై చేయిగా మారింది.

యూట్యూబ్ ట్రెండ్స్–2023 రిపోర్ట్ ప్రకారం జెన్ జడ్‌లో 69 శాతం మంది ప్రేక్షకులు షార్ట్ ఫామ్, లాంగ్ ఫామ్, లైవ్‌స్ట్రీమ్... ఇలా ఏ ఫార్మట్‌లోనైనా తమ అభిమాన క్రియేటర్ కంటెంట్‌ను చూడడానికి ఇష్టపడుతున్నారు. నిర్దిష్టమైన కంటెంట్, ఆర్టిస్టులు, పబ్లిక్ ఫిగర్స్‌కు సంబంధించి ఫ్యాన్స్ రూపొందించిన వీడియోలను చూడడానికి ఇష్టపడుతున్నట్లు జెన్ జడ్‌లో 48 శాతం మంది చెబుతున్నారు.

పదిహేను సంవత్సరాల కాలంలో యూట్యూబ్ యూత్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్‌గా మారింది.

మహానగరంలో ఉన్నా, మారుమూల పల్లెలో ఉన్నా ఒక చిన్న బ్రైట్ ఐడియాతో అంతర్జాతీయ స్థాయిలో మెరిసిపోయేలా ఈ వేదిక యూత్‌కు ఉపకరించింది. డ్యాన్స్ ట్యుటోరియల్స్ నుంచి హౌ–టు వీడియోల వరకు యువతరంలో ఎంతో మందిని ఫేమ్ చేసింది.

యూ ట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ (2011) లాంచ్‌తో ఎంతోమంది క్రియేటర్‌లకు ఒక వేదిక దొరికింది. ఈ ఫస్ట్ వేవ్ క్రియేటర్‌లు తమ విజయాలతో ఎంతోమందిని ప్రభావితం చేశారు. మ్యూజిక్, సినిమాలు ఆరాధించే మన దేశంలో యూట్యూబ్ వేదికగా యువతరం చేతిలో కంటెంట్ క్రియేషన్ అనేది కొత్త పుంతలు తొక్కింది. కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి యూట్యూబ్ అడ్వాన్సింగ్ టూల్స్‌ను తీసుకువచ్చింది. ఫార్మట్‌లను విస్తరించింది. క్రియేటర్‌లు తమ వీడియోలను ఇతర భాషల్లోకి తీసుకువచ్చే ఏఐ పవర్డ్ డబ్బింగ్ టూల్‌ను తీసుకురానుంది. భవిష్యత్‌లో ఈ టూల్ ద్వారా వాయిస్ ప్రిజర్వేషన్, లిప్ రీ–యానిమేషన్, ఎమోషన్ ట్రాన్స్‌ఫర్... మొదలైనవి చేయవచ్చు. ఫిల్మ్ స్టూడియోలు, మ్యూజిక్ కంపెనీలు కూడా యూట్యూబ్ చానల్స్‌ను స్టార్ట్ చేయడం మొదలు పెట్టాయి. దీని ద్వారా యువతలో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్ ఉన్న ఎంతోమంది వెలుగులోకి వచ్చారు.


‘యూట్యూబ్ తొలిసారిగా పరిచయం అయినప్పుడు అది టైమ్‌పాస్ మాత్రమే. అయితే మన టైమ్‌ను కూడా మార్చుకొని ఎదగవచ్చని ఎంతో మంది నిరూపించారు’ అంటుంది బెంగళూరుకు చెందిన ప్రజ్వల.

స్ఫూర్తినిచ్చే సూపర్‌స్టార్స్

మన దేశంలోని మోస్ట్ పాపులర్ యూట్యూబ్ స్టార్‌ల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ‘ది యూట్యూబ్ స్టార్స్ ఆఫ్ ఇండియా’ పేరుతో పుస్తకంగా తీసుకువచ్చాడు ఢిల్లీకి చెందిన అజితాభ బోస్. ఇది బోస్ నాన్–ఫిక్షన్ బుక్. ఈ పుస్తకంలో సక్సెస్‌ఫుల్ యూట్యూబర్‌ల ప్రొఫైల్‌ను కళ్లకు కట్టేలా రాశాడు. ఆశిష్, అమిత్ బదన, ప్రజక్త కోలి, కునాల్ చాబ్రియ, శృతి, అర్జున్ ఆనంద్‌లాంటి పదిహేను మంది యూట్యూబర్‌ల గురించి రాశారు.

విజయం అనేది ఎంత కష్టపడితే వస్తుంది అనేది వీరి గురించి చదివితే బోధపడుతుంది.

అహ్మదాబాద్‌కు చెందిన హర్ష్ పమ్నానీ వృత్తి పరంగా బ్రాండ్ ఎక్స్‌పర్ట్. ప్రవృత్తి పరంగా స్టోరీ టెల్లర్. ‘బూమింగ్ బ్రాండ్స్’ పేరుతో పుస్తకం రాసి పేరు తెచ్చుకున్న హర్ష్ ‘బూమింగ్ డిజిటల్ స్టార్స్’ పేరుతో సక్సెస్‌ఫుల్ యూ ట్యూబ్ స్టార్స్ గురించి మరో పుస్తకం రాశాడు. క్రియేటర్ ఎకనామీలో భాగం కావడానికి వారి పరిచయాలు పాఠాలుగా ఉపయోగపడతాయని అంటాడు రచయిత. కవితా సింగ్, ఉజ్వల్ చౌరాసియ, యశ్వంత్ ముఖ్తే... లాంటి పదకొండుమంది యూట్యూబ్ స్టార్‌ల గురించి ఈ పుస్తకంలో రాశాడు హర్ష్.





టెస్టులకు గుడ్‌బై చెప్పిన హసరంగ

శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ కెరీర్‌ను సుదీర్ఘంగా కొనసాగించాలనే ఉద్దేశంతోనే టెస్టులకు గుడ్‌బై చెబుతున్నానని 26 ఏళ్ల లంక క్రికెటర్ చెప్పాడు. 2020లో దక్షిణాఫ్రికాతో సంప్రదాయ కెరీర్‌కు శ్రీకారం చుట్టిన అతను కేవలం నాలుగు టెస్టులే ఆడాడు. అయితే ఐపీఎల్‌లో బెంగళూరు ఫ్రాంచైజీతో పాటు విశ్వ వ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లతో అతను బిజీగా ఉన్నాడు. 48 వన్డేల్లో 67 వికెట్లు తీసిన హసరంగ 58 అంతర్జాతీయ టి20ల్లో 91 వికెట్లు పడగొట్టాడు.



భారత్‌తో సిరీస్‌కు సిద్ధంగా వుంటా: కమిన్స్

గాయంతో ఆటకు దూరమైన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భారత పర్యటనకు సిద్ధంగా ఉంటాననే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో అతని ఎడమచేతి మణికట్టుకు ఫ్రాక్చరైంది. దీంతో 6 వారాల పాటు విశ్రాంతికే పరిమితమై దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు భారత్‌తో సెప్టెంబర్ 22, 24, 27 తేదీల్లో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో పున రాగమనం చేస్తానని ఆసీస్ సీమర్ చెప్పాడు.



అన్ని మ్యాచ్‌లు 'ఫ్యాన్ కోడ్' యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు వేళాయె...

- నేటి నుంచి విశాఖలో టోర్నీ
- బరిలో ఆరు జట్లు, 19 మ్యాచ్‌లు
- ఆగస్టు 27న ఫైనల్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్ సమరానికి నేడు తెరలేవనుంది. మొత్తం ఆరు ఫ్రాంచైజీ జట్లు కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్, రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ మెరుపులతో టి20లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్, రన్నరప్ బెజవాడ టైగర్స్‌ల మధ్య బుధవారం జరిగే పోరుతో రెండో సీజన్ మొదలవుతుంది. ప్రతి రోజు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 27న టైటిల్ పోరు నిర్వహిస్తారు. పోటీలన్నీ విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలోనే జరుగుతాయి. తొలి సీజన్‌లో ఆఖరి మెట్టుపై తడబడి టైటిల్ కోల్పోయిన బెజవాడ టైగర్స్ ఈ సారి టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. హిట్టర్ రికీ భుయ్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఈ ఫ్రాంచైజీ రూ.8.10 లక్షలతో అతన్ని రిటెయిన్ చేసుకుంది. ఏపీఎల్‌లో ఇదే అత్యధిక మొత్తం కాగా, ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో నిరూపించుకున్న ఆంధ్ర క్రికెటర్లు హనుమ విహారి, కోన శ్రీకర్ భరత్‌లు


భరత్


విహారి


భుయ్

కూడా ఈ లీగ్‌లో ఆడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. విహారి రాయలసీమ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రూ. 6.60 లక్షలతో కింగ్స్ అతన్ని సొంతం చేసుకుంది. ఈ జట్టులో అతనిదే అత్యధిక పారితోషికం. భారత టెస్టు జట్టు వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ ఉత్తరాంధ్ర లయన్స్ తరఫున స్టార్‌గా బరిలో ఉన్నాడు. అతన్ని రూ. 6 లక్షలకు లయన్స్ కొనుగోలు చేసింది. వీళ్లతో పాటు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అకాడమీలలో రాణించిన కుర్రాళ్లు ఈ లీగ్‌తో ఏసీఏ సెలక్టర్ల కంట పడాలని ఆశిస్తున్నారు. 'మన ఆంధ్ర–మన ఏపీఎల్' అనే నినాదంతో పూర్తిగా స్థానిక కుర్రాళ్లకే అవకాశమిచ్చిన ఈ లీగ్‌ను చూసే ప్రేక్షకులకు కూడా నిర్వాహకులు బంపరాఫర్ ప్రకటించారు. ఏపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించేందుకు వచ్చే ప్రేక్షకులకు లక్కీ డ్రాను ఏర్పాటు చేశారు. విజేతగా నిలిచిన క్రికెట్ అభిమానులకు ఈ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య నవంబర్ 23న జరిగే టి20 మ్యాచ్ టికెట్లను ఉచితంగా బహుకరించనున్నారు.



అర్జున్ ఇరిగేశి విజయం

కార్ల్‌సన్‌కు తలవంచిన గుకేశ్

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ కప్ చెస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ ఆటగాడు అర్జున్ ఇరిగేశి కీలక విజయాన్ని అందుకున్నాడు. మంగళవారం జరిగిన తొలి గేమ్‌లో అర్జున్ 53 ఎత్తుల్లో భారత్‌కే చెందిన ఆర్. ప్రజ్ఞానందను ఓడించాడు. నల్లపావులతో ఆడిన అర్జున్‌కు ఈ విజయంతో ఆధిక్యం దక్కింది. నేడు తెల్ల పావులతో ఆడి రెండో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నా అతను సెమీస్ చేరతాడు. మరో క్వార్టర్స్ పోరులో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) జోరు ముందు భారత ఆటగాడు డి.గుకేశ్ నిలవలేకపోయాడు. నల్ల పావులతో ఆడిన కార్ల్‌సన్ 48 ఎత్తుల్లో గుకేశ్ ఆట కట్టించాడు. మరో రెండు క్వార్టర్ ఫైనల్ సమరాల తొలి గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. విదిత్ గుజరాతీ (భారత్), నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) మధ్య గేమ్ 109 ఎత్తుల్లో... ఫాబియానో కరువానా (అమెరికా), లీనియర్ డొమినెగ్వెజ్ పెరెజ్ (అమెరికా) మధ్య గేమ్ 71 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. మరోవైపు నలుగురు భారత ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరడం పెద్ద విశేషమని దిగ్గజ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్ వ్యాఖ్యానించాడు. 'భారత చదరంలో ఇదో చారిత్రక ఘట్టం' అని ఆనంద్ విశ్లేషించాడు. 'ఒకరు కానీ ఇద్దరు కానీ క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లగలరని నేను అంచనా వేశాను. కానీ నలుగురు ముందంజ వేయగలిగారు. వారి ఆట చూస్తే ఇంకా ముందుకు వెళ్లగల సామర్థ్యం ఉందని నమ్ముతున్నా' అని ఆనంద్ అభిప్రాయ పడ్డాడు.

ఫుట్‌బాల్ దిగ్గజం హబీబ్ కన్నుమూత

70వ దశకంలో మెరిసిన హైదరాబాదీ



సాక్షి, హైదరాబాద్: భారత మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు, 70వ దశకంలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న మొహమ్మద్ హబీబ్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. హైదరాబాద్‌కు చెందిన హబీబ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1970లో మరో హైదరాబాదీ సయ్యద్ నయీముద్దీన్ నాయకత్వంలో బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన భారత జట్టులో హబీబ్ కీలక సభ్యుడు. అయితే హబీబ్ కెరీర్ అత్యుత్తమ దశ కోల్‌కతాలోనే గడిచింది. 1966నుంచి 1984 వరకు దాదాపు 18 ఏళ్లు పాటు ఆయన అక్కడ ప్రధాన ఆటగాడిగా కొనసాగడం విశేషం. మిడ్‌ఫీల్డర్‌గా మూడు ప్రఖ్యాత క్లబ్‌లు మోహన్‌బగాన్, ఈస్ట్ బెంగాల్, మొహమ్మదాన్ స్పోర్టింగ్‌లకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. హబీబ్ కెరీర్‌లో చిరస్మరణీయ క్షణం 1977లో వచ్చింది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఒక ఫ్రెండ్లీ మ్యాచ్‌లో హబీబ్ మోహన్‌బగాన్ తరఫున బరిలోకి దిగగా...ప్రత్యర్థి టీమ్ కాస్మోస్ క్లబ్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ ఆటగాళ్లు పీలే, కార్లోస్ అల్బర్టో ఉన్నారు. మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగియగా, ఇందులో హబీబ్ కూడా ఒక గోల్ చేశారు. మ్యాచ్ అనంతరం పీలే ప్రత్యేకంగా హబీబ్‌ను పిలిచి ఆయన ఆటను ప్రశంసించడం విశేషం. ప్రతిష్టాత్మక డ్యురాండ్ కప్ మూడు వేర్వేరు ఫైనల్



మ్యాచ్‌లలోనూ గోల్ చేసిన ఏకైక ఆటగాడిగా ఇప్పటికీ హబీబ్ రికార్డు నిలిచి ఉంది. జాతీయ ఫుట్‌బాల్ టోర్నీ 'సంతోష్ ట్రోఫీ'ని ఏకైక సారి ఆంధ్రప్రదేశ్ జట్టు 1966లో గెలుచుకుంది. నాడు ఏపీ తరఫున చెలరేగిన హబీబ్...ఫైనల్లో బెంగాల్‌నే ఓడించడం ప్రధాన పాత్ర పోషించడం గమనార్హం. పదేళ్ల పాటు (1965–75) భారత జట్టు తరఫున ఆడిన హబీబ్‌ను కేంద్ర ప్రభుత్వం 1980లో 'అర్జున' పురస్కారంతో గౌరవించింది. ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత టాటా ఫుట్‌బాల్ అకాడమీకి, భారత్ ఫుట్‌బాల్ సంఘానికి చెందిన అకాడమీకి కూడా కోచ్‌గా వ్యవహరించారు.

'ఆసియా' నుంచి తప్పుకున్న వినేశ్

అంతిమ్‌కు లైన్ క్లియర్



న్యూఢిల్లీ: ట్రయల్స్ లేకుండా ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు మినహాయింపు పొందిన మహిళా స్టార్ రెజ్లర్, డిఫెండింగ్ చాంపియన్ వినేశ్ ఫొగాట్ తాజాగా ఈ మెగా ఈవెంట్ నుంచి తప్పుకుంది. మోకాలు గాయం వల్ల హాంగ్జౌ ఈవెంట్‌లో పాల్గొనడం లేదని మంగళవారం ఆమె ప్రకటించింది. దీంతో మినహాయింపు అనుచితమంటూ కోర్టుకెక్కిన అంతిమ్ పంఘాల్‌కు 53 కేజీల కేటగిరీలో లైన్ క్లియరైంది. ఆ విభాగంలో ట్రయల్స్‌లో నెగ్గి ఆసియా ఈవెంట్‌కు అర్హత సంపాదించినప్పటికీ... వినేశ్ బరిలో ఉండటం వల్ల ఆమె స్టాండ్‌బైగా కూర్చోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు వినేశ్ తనంతట తానుగా తప్పుకోవడంతో ఇక ఏ గొడవా లేకుండా అంతిమ్ ఆసియా క్రీడల్లో పాల్గొననుంది. 'ట్రెయినింగ్‌లో ఎడమ మోకాలుకు గాయమైంది. స్కానింగ్‌లో గాయం తీవ్రత దృష్ట్యా సర్జరీ తప్పనిసరని వైద్యులు సూచించడంతో ఈ నెల 17న ముంబైలో ఆపరేషన్ చేయించుకుంటాను. దీనివల్ల జకార్తా ఆసియా క్రీడల్లో (2018) సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవాలనుకున్నా నా ఆశలు ఆవిరయ్యాయి' అని వినేశ్ వాపోయింది. రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై వినేశ్, భజరంగ్, సాక్షి మాలిక్ తదితరులు పలుమార్లు జంతర్‌మంతర వద్ద నిరసనకు దిగారు. డబ్లూఎఫ్‌ఐ అడ్‌హాక్ కమిటీ వినేశ్, భజరంగ్‌లకు నేరుగా ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశమివ్వడం వివాదానికి కారణమైంది. దీనిపై ట్రయల్స్ గెలిచిన అంతిమ్ కోర్టును ఆశ్రయించింది.


ఐర్లాండ్ గడ్డపై భారత జట్టు

డబ్లిన్: మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడేందుకు భారత జట్టు ఐర్లాండ్ చేరుకుంది. రాజధాని డబ్లిన్ శివారులోని మలహైడ్ మూడు టి20లకు వేదిక కానుంది. విండీస్‌తో టి20 సిరీస్ ఆడి ఈ సిరీస్‌కు కూడా ఎంపికైన ఆటగాళ్లు అక్కడినుంచి నేరుగా డబ్లిన్ ప్రయాణించారు. అయితే ఈ సిరీస్ కోసమే జట్టులోకి వచ్చిన కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్, శివమ్ దూబే నేరుగా భారత్‌నుంచి డబ్లిన్‌కు వెళ్లారు. ఈ నెల 18, 20, 23 తేదీల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. సిరీస్ ఫలితంకంటే అందరి దృష్టి ప్రధానంగా బుమ్రాపైనే నిలిచింది. గాయాల నుంచి కోలుకొని దాదాపు సంవత్సరం కాలం తర్వాత అతను మళ్లీ మ్యాచ్ బరిలోకి దిగబోతున్నాడు. కీలకమైన ఆసియా కప్, ప్రపంచ కప్‌కు


బుమ్రా

అతని బౌలింగ్ ప్రాక్టీస్‌తో పాటు మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు ఇది కీలకం కానుంది. బుమ్రా చివరిసారిగా గత ఏడాది సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో టి20 మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టి20 వరల్డ్ కప్ సహా ఇతర సిరీస్‌లతో పాటు ఈ సీజన్ ఐపీఎల్‌కు కూడా అతను దూరమయ్యాడు.

సినిమా


కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతోంది. దేశభక్తి నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం 'ఇండియన్ 2' కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. లైకా ప్రొడక్షన్స్, ది రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

మీ నవ్వులు చూడాలనుకుంటున్నా

– విజయ్ దేవరకొండ



రవిశంకర్, శివ నిర్వాణ, సమంత, విజయ్ దేవరకొండ, గోవర్ధన్, నవీన్ యెర్నేని, హేషమ్ అబ్దుల్ వాహబ్

''నేను ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి నా సక్సెస్‌లో, ఫెయిల్యూర్స్‌లో ఇంత ప్రేమ ఇచ్చిన మీకు(ఫ్యాన్స్) థ్యాంక్స్. జీవితంలో చాలా మారాయి. ఎత్తు, పల్లాలు చూస్తున్నా. నా చుట్టూ మనుషులు మారుతున్నారు.. నా గురించి ఏదో మాట్లాడతారు. కానీ, మీ (ఫ్యాన్స్) ప్రేమ స్థిరంగా ఉంటుంది.. అందుకే సెప్టెంబర్ 1న మీ మొహాల్లో నవ్వులు చూడాలనుకుంటున్నా'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'ఖుషి మ్యూజికల్ కన్సర్ట్' లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''నీ మొహంలో నవ్వు చూడాలని మాత్రమే పనిచేస్తున్నా' అంటూ గత నెల రోజులుగా చెబుతున్నాడు శివ నిర్వాణ. నాక్కూడా నవ్వులు చూడాలని ఉంది. కానీ, నాకంటే ఎక్కువగా సమంత మొహంలో నవ్వులు చూడాలని ఉంది. తను ఈ సినిమా కోసం ఎంతో కష్టపడింది. అలాగే శివ నిర్వాణలోనూ నవ్వులు చూడాలనుంది'' అన్నారు. సమంత మాట్లాడుతూ–''మీ కోసం(అభిమానులు, ప్రేక్షకులు) కష్టపడుతున్నాను.. తిరిగి ఆరోగ్యంగా వస్తాను.. 'ఖుషి'తో బ్లాక్ బస్టర్ ఇస్తానని మీకు మాట ఇస్తున్నాను'' అన్నారు. శివ నిర్వాణ మాట్లాడుతూ–''ఖుషి' చూస్తే మీకు(ప్రేక్షకులు) విజయ్, సమంత కనిపించరు.. విప్లవ్, ఆరాధ్య మాత్రమే కనిపిస్తారు. సినిమా చూసి బయటికెళ్లేటప్పుడు ఈ మూవీని మరోసారి చూద్దామనిపిస్తుంది'' అన్నారు. ''డియర్ కామ్రేడ్' మేము అనుకున్నంత విజయం సాధించలేదు. కానీ 'ఖుషి' పెద్ద హిట్ కాబోతోంది'' అన్నారు నవీన్ యెర్నేని. ''శివ నిర్వాణతో మా బ్యానర్‌లో మరో సినిమా చేయనున్నాం'' అన్నారు వై.రవిశంకర్. ''ఖుషి మ్యూజికల్ కన్సర్ట్'కి విచ్చేసిన విజయ్, సమంతలకి థ్యాంక్స్. ఈ వేడుకని గ్రాండ్‌గా చేసేందుకు సహకారం అందించిన నవీన్, రవిశంకర్, దినేశ్‌గార్లకు కృతజ్ఞతలు'' అన్నారు చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్. ఈ కార్యక్రమంలో మైత్రీ మూవీస్ సీఈవో చెర్రీ, కెమెరామేన్ జి.మురళి, డైరెక్టర్ అనిల్ రావిపూడి తదితరులు పాల్గొన్నారు.

లవ్ ఆల్ అందరికీ కనెక్ట్ అవుతుంది

– పుల్లెల గోపీచంద్



సంజయ్, కేకే మీనన్, గోపీచంద్, సుధాంశు, దిలీప్సోని, ఎం. రమేశ్

''క్రీడాకారులుగా రాణించాలని కల కని మధ్యలోనే వదిలేసేవారు చాలామంది ఉంటారు. 'లవ్ ఆల్' సినిమా చూసినవారు ఇది మన కలే కదా అనుకుంటారు. బ్యాడ్మింటన్ గురించే కాదు.. మొత్తం క్రీడల గురించిన చిత్రం ఇది. ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది'' అన్నారు భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్. కేకే మీనన్ లీడ్ రోల్‌లో, స్వస్తిక ముఖర్జీ, శ్రీ స్వర, సుమిత్ అరోరా, ఆర్క్ జైన్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ డ్రామా 'లవ్ ఆల్'. మహేశ్ భట్, ఆనంద్ పండిట్, పుల్లెల గోపీచంద్ సమర్పణలో సుధాంశు శర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమిది'. దిలీప్సోని జైస్వాల్, రాహుల్ వి. దూబే, సంజయ్ సింగ్ సహనిర్మాతలుగా, ఎం. రమేష్ లక్ష్మీ గణపతి ఫిల్మ్స్ ద్వారా ఈ చిత్రం హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, బంగ్లా, ఒడియాతో సహా ఆరు భారతీయ భాషలలో ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో కేకే మీనన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మెయిన్ స్టార్ బ్యాడ్మింటన్'' అన్నారు. ''ఈ చిత్రం చూశాక బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తిని పెంచుకుంటారని నా నమ్మకం'' అన్నారు సుధాంశు శర్మ.

నిజం షూ లేస్ కట్టుకునే లోపే..!


అజ్మల్

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'వ్యూహం'. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రను అజ్మల్ పోషిస్తున్నారు. దాసరి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న 'వ్యూహం' నుంచి రెండో టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. 'నిజం తన షూ లేస్ కట్టుకునే లోపే అబద్ధం ప్రపంచమంతా ఓ రౌండ్ వేసి వస్తుంది' (అజ్మల్), 'ఎప్పుడో ఒకప్పుడు మీరు కల్యాణ్‌ను కూడా వెన్నుపోటు పొడుస్తారుగా' (ఓ పాత్రధారి), 'వాడికంత సీన్ లేదు. తనను తానే పొడుచుకుంటాడు' (మరో పాత్రధారి) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''వ్యూహం' చిత్రీకరణ 50 శాతానికి పైగా పూర్తయింది'' అన్నారు దాసరి కిరణ్ కుమార్.

సవాల్‌గా తీసుకున్నాం

– నిర్మాత అప్పిరెడ్డి


రవీందర్ రెడ్డి, అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి

సయ్యద్ సోహైల్ రియాన్, రూపా కొడవాయూర్ జంటగా శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ– ''మేల్ ప్రెగ్నెన్సీ' కథ అనగానే.. కత్తి మీద సాములాంటిది, సినిమా చేయొద్దని కొందరు సలహా ఇచ్చారు. కానీ మేం సవాల్‌గా తీసుకుని చేశాం. ఇండస్ట్రీలో సుదీర్ఘమైన ప్రయాణం చేయాలనే ప్రణాళికతో వచ్చాం. ప్రస్తుతం ఐదారు సినిమాల వర్క్ జరుగుతోంది. వీటిలో రెండు సినిమాల చిత్రీకరణ పూర్తయింది'' అని చెప్పారు. రవీందర్ రెడ్డి సజ్జల మాట్లాడుతూ– ''ఈ సినిమాలో సందేశంతో పాటు వాణిజ్య పరమైన అంశాలు కూడా ఉన్నాయి. శ్రీనివాస్ మంచి అనుభవం ఉన్న వ్యక్తిలా ఈ సినిమాను తెరకెక్కించారు'' అన్నారు. ''భావోద్వేగం, వినోదం.. వంటి అంశాలతో ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అన్నారు వెంకట్ అన్నపరెడ్డి.

ఆ రోజు వ్యాక్సిన్ వార్


నానా పటేకర్

'ది కశ్మీరీ ఫైల్స్' (2022) చిత్రం తర్వాత దర్శక–నిర్మాత వివేక్ రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కించిన చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, నానా పటేకర్, సప్తమి గౌడ, పరితోష్ శాండ్, స్నేహ మిలాండ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించడంతో పాటు అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అసోసియేషన్‌తో పల్లవి జోషి నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్లింప్స్‌ను రిలీజ్ చేసి, ఈ సినిమాను సెప్టెంబరు 28న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ''దేశంలో జరిగిన కోవిడ్ – 19 వ్యాక్సిన్ డ్రిల్స్ ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, అస్సామీ, ఇంగ్లిష్‌లతో సహా పదికి పైగా భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

రీల్స్

వాళ్లందరికీ సెల్యూట్

– సాయిధరమ్ తేజ్


'దిల్' రాజు, సాయిధరమ్ తేజ్

''మన రేపటి కోసం తమ నేటి రోజుని త్యాగం చేస్తున్న సైనికులకు సెల్యూట్. సోల్జర్స్‌కి నివాళులర్పిస్తూ 'సోల్ ఆఫ్ సత్య' పాట చేసినందుకు హ్యాపీగా ఉంది'' అని సాయిధరమ్ తేజ్ అన్నారు. నవీన్ విజయకృష్ణ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, కలర్స్ స్వాతి జంటగా రూపొందిన షార్ట్ ఫీచర్ ఫిల్మ్ 'సత్య'. దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్, హన్షిత నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు, తమిళ, హిందీలో 'సోల్ ఆఫ్ సత్య..' మ్యూజికల్ షార్ట్‌ను రామ్ చరణ్ షేర్ చేశారు. ''ఎన్నో కలలు ఉండే అమ్మాయికి మిలటరీ వ్యక్తి భర్తగా వస్తే ఎలా ఉంటుంది? అనేదే 'సోల్ ఆఫ్ సత్య'' అన్నారు 'దిల్' రాజు. మ్యూజిక్ డైరెక్టర్ శ్రుతి రంజని, నిర్మాతలు హర్షిత్, హన్షిత మాట్లాడారు.

ముప్పై కథలు విన్నాం!


శివ ప్రసాద్

సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచిత సాధినేని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. రైటర్ అభిషేక్ మహర్షి దర్శకత్వంలో శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శివ ప్రసాద్ మాట్లాడుతూ– ''సంతోష్, అభిషేక్‌లతో ఓ సినిమా చేయాలనుకుని 30 కథలు విన్నాం. చివరిగా 'ప్రేమ్‌కుమార్' కథను ఎంపిక చేసుకున్నాం. పీటల మీద పెళ్లి రద్దు కావడం, ఆ తర్వాత కథానాయిక దృష్టి కోణంలో సినిమా సాగడం చాలా సినిమాల్లో చూశాం. అయితే ఓ పెళ్లి రద్దయితే ఆ పెళ్లికొడుకు జీవితం ఎలా సాగుతుందనే కోణంలో 'ప్రేమ్ కుమార్' సాగుతుంది'' అన్నారు.

ఎమోషనల్ పిజ్జా


అశ్విన్, పవిత్ర

''పిజ్జా 3' కథ ఆసక్తిగా ఉంటుంది. ఈ సినిమాని ఫ్యామిలీతో కలసి చూడండి.. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు'' అని హీరో అశ్విన్ కాకుమణి అన్నారు. 'పిజ్జా' మూవీ ఫ్రాంచైజీలో రూపొందిన చిత్రం 'పిజ్జా 3'. అశ్విన్ కాకుమణి, పవిత్ర మారిముత్తు జంటగా మోహన్ గోవింద్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్‌ఎల్‌పీపై మురళి, ఆశిష్ వేమిశెట్టి ఈ నెల 18న తెలుగులో విడుదల చేస్తున్నారు. ''పిజ్జా 3' ప్యూర్ హారర్ మూవీ. బలమైన కంటెంట్, ఎమోషన్స్ ఉంటాయి'' అన్నారు మోహన్ గోవింద్. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు ఆశిష్ వేమిశెట్టి.

అందమైన ప్రేమకథ


జయకుమార్, సిరి

జయకుమార్, శీను, స్వీటీ, సిరి రావుల చారి, సునీత ప్రధాన పాత్రల్లో ప్రకాష్ పల్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మదిలో మది'. నేముకూరి జయకుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జయకుమార్ మాట్లాడుతూ– ''క్లయిమాక్స్‌లో ప్రేక్షకులు కంట తడిపెడతారు'' అన్నారు ''అందమైన ప్రేమకథా చిత్రమిది'' అన్నారు ప్రకాష్ పల్ల. తాగుబోతు రమేశ్ అతిథిగా పాల్గొన్నారు.

సాక్షి **బిజినెస్**
బుధవారం
16-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
79	6
65,402	19,435

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,694	▽	94
డోజోన్స్	34,999	▽	308
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,390	▽	118
డాక్స్	15,764	▽	137
షాంఘై	3,176	▽	2
నికాయ్	32,239	▲	179

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

'జీవీకే' ఈక్వల్ ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం జీవీకే గ్రూప్ వైస్ చైర్మన్ సంజయ్ రెడ్డి కుమారుడు కేశవ్ రెడ్డి కొత్తగా ఈక్వల్ పేరిట ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిలాకర్, పబ్లిక్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా స్టాక్ భాగస్వామ్యంతో దీన్ని రూపొందించారు. యూజర్లు తమ డిజిటల్ పత్రాలను భద్రపర్చుకునేందుకు, ఒక్క క్లిక్‌తో సురక్షితంగా, నిరాటంకంగా షేర్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇందులో సుమారు 10 లక్షల బీటా యూజర్లు ఉన్నారని కేశవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి వెంచర్స్, అరాజెన్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఫౌండేషన్ జీవీకే ఏఎంఆర్ఐ బోర్డుల్లో ఆయన సభ్యుడిగా ఉన్నారు.

అదానీ చేతికి క్వింటిలియన్

మిగతా 51% వాటా కొనుగోలుకు ఒప్పందం

న్యూఢిల్లీ: మీడియా దిగ్గజం రాఘవ్ బెహల్ నెలకొల్పిన డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్ క్వింటిలియన్ బిజినెస్ మీడియాలో (క్యూబీఎంఎల్) మిగతా 51 శాతం వాటాను వ్యాపార దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేయనుంది. తమ అనుబంధ సంస్థ ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ (ఏఎంఎన్ఎల్) ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. లావాదేవీ పూర్తయ్యాక ఏఎంఎన్ఎల్‌కు క్యూఎంఎల్ పూర్తి అనుబంధ సంస్థగా మారుతుందని పేర్కొంది. బీక్యూ ప్రైమ్ పేరిట మీడియా ప్లాట్‌ఫామ్‌ను నిర్వహించే క్యూబీఎంఎల్‌లో ఏఎంఎన్ఎల్ గతంలో రూ. 48 కోట్లకు 49% వాటాలను కొనుగోలు చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	460-00
రిటైల్ ధర (డజను)	72.00
15-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

మహీంద్రా నుంచి చిన్న ట్రాక్టర్లు

- ధర రూ. 5,64,500 నుంచి ప్రారంభం
- మూడేళ్లలో రెట్టింపు ఎగుమతులపై దృష్టి


కొత్త వాహనాల ఆవిష్కరణ కార్యక్రమంలో మహీంద్రా ఈడీ రాజేష్ జెజురికర్ తదితరులు

కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా): ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) కొత్తగా మరిన్ని వాహనాలను ఆవిష్కరించింది. చిన్న ట్రాక్టర్లు, కార్లు వీటిలో ఉన్నాయి. చిన్న కమతాల రైతులు, వ్యక్తిగత ఫామ్‌హౌస్‌లున్న వారు మొదలైన వర్గాలకు ఉపయోగపడేలా తేలికపాటి, చిన్న ట్రాక్టర్లను ఫ్యూచర్‌స్కేప్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో కంపెనీ ప్రవేశపెట్టింది. మహీంద్రా ఓజా పేరిట ఆవిష్కరించిన ఈ ట్రాక్టర్ల శ్రేణిలో ఏడు మోడల్స్ ఉంటాయి. వీటి ధర రూ. 5,64,500 నుంచి రూ. 7,35,000 వరకు (పుణె-ఎక్స్ షోరూమ్) ఉంటుంది. తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంటులో తయారు చేసే ఈ ట్రాక్టర్లను దేశీయంగా విక్రయించడంతో పాటు ఉత్తర అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూరప్ తదితర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేయనున్నట్లు సంస్థ ఈడీ (ఆటో, ఫార్మ్ విభాగాలు) రాజేశ్ జెజూరికర్ తెలిపారు. వచ్చే మూడేళ్లలో ట్రాక్టర్ల ఎగుమతులను రెట్టింపు చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో 18,000 పైచిలుకు ట్రాక్టర్లను ఎగుమతి చేసింది. ఓజా ప్లాట్‌ఫాంపై రూ. 1,200 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు జెజూరికర్ వివరించారు. మహీంద్రా రీసెర్చ్ వ్యాలీ, మిత్సుబిషి మహీంద్రా అగ్రికల్చర్ మెషినరీ కలిసి దీన్ని తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

థార్.ఈ, గ్లోబల్ పికప్ ఆవిష్కరణ..

ఫ్యూచర్‌స్కేప్ కార్యక్రమంలో భాగంగా ఎంఅండ్ఎం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'థార్.ఈ'ని కూడా ఆవిష్కరించింది. వినూత్నమైన డిజైన్, ఇంటీరియర్స్‌తో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించినట్లు సంస్థ ఆటోమోటివ్ విభాగం ప్రెసిడెంట్ వీజే నక్రా తెలిపారు. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్ల కోసం గ్లోబల్ పికప్ వాహనాన్ని సైతం సంస్థ ఆవిష్కరించింది. రోజువారీ ప్రయాణ అవసరాలతో పాటు సాహస ట్రిప్‌లకు కూడా అనువుగా ఇది ఉంటుందని నక్రా వివరించారు. అటు, విద్యుత్ వాహనాల శ్రేణి కోసం నెలకొల్పిన మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ (ఎంఈఏఎల్)కి కొత్త లోగోను కూడా కంపెనీ ఆవిష్కరించింది. దీనికి సంబంధించిన 'లే ఛలాంగ్' ప్రచార గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ స్వరపర్చారు.

ఓలా ఈ-స్కూటర్ @ రూ.79,999

- ఎస్1ఎక్స్ సిరీస్ నుంచి మూడు వేరియంట్లు
- ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో పేర్లతో మరో రెండు




న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ ఒకేసారి అయిదు ఈ-స్కూటర్లు విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) సందర్భంగా కస్టమర్ డే-2023 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో వీటిని లాంచ్ చేసింది. తన ఎంట్రీ లెవల్ ఎస్1ఎక్స్ సిరీస్‌లో ఎస్1ఎక్స్ (2కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ), ఎస్1ఎక్స్(3కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ), ఎస్1ఎక్స్ ప్లస్ మూడు వేరియంట్లు ఉన్నాయి. అలాగే ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో పేరుతో మరో రెండు మోడళ్లను తీసుకొచ్చింది. ప్రారంభ ఆఫర్ కింద రూ.89,999గా ఉండే ఎస్1ఎక్స్ 2కిలోవాట్ బ్యాటరీ వేరియంట్‌ను రూ.79,999కే పొందొచ్చు. ఎస్1ఎక్స్ (3కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ) ప్రస్తుత ధర రూ.89,999గా ఉంది. దీన్ని సైతం ఆగస్టు 21 వరకు రూ.10 వేల తక్కువకే అందిస్తున్నారు. వీటి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లో డెలివరీ ఉంటుంది. ఎస్1ఎక్స్ ప్లస్ ప్రస్తుత ధర రూ.99,999 గా ఉంది. వారం తర్వాత రూ.1,09,999కి చేరుతుంది. బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీ సెప్టెంబర్ చివర్లో ఉంటుంది. ఎస్ 1 ఎయిర్ ఎక్స్ షోరూం ధరల రూ.1.19 లక్షలుగా ఉంది. సెకండ్ జనరేషన్ ఎస్1ప్రో ఎక్స్ షోరూం ధర రూ.1,47,499 గా ఉంది. అలాగే ఈవెంట్‌లో డైమండ్‌హెడ్, అడ్వెంచర్, రోడ్‌స్టర్, క్రూయిజర్ నాలుగు మోటార్ బైకులనూ ఆవిష్కరించింది. వచ్చే ఏడాది చివర్లో వీటిని మార్కెట్లోకి తెస్తున్నట్లు తెలిపింది.

45 గిగావాట్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం!

2030 నాటికి అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రణాళిక

న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ పునరుత్పాదక ఇంధన సంస్థ 2030 నాటికి 45 గిగావాట్ల (జీడబ్ల్యూ)పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



ఉద్గారాలను తగ్గించి, భారత్ తన కార్బన్ న్యూట్రాలిటీ లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు సహాయ సహకారాలను అందించాలని సంస్థ భావిస్తున్నట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ వర్గాలు తెలిపాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 8,316 మెగావాట్ల (8.3 జీడబ్ల్యూ) పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రస్తుతం కలిగి ఉంది. మరో 12,118 మెగావాట్ల సామర్థ్యం నిర్మాణ దశలో ఉందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఇన్ఫీకి రూ.13,650 కోట్ల కాంట్రాక్ట్

- లిబర్టీ గ్లోబల్‌తో డీల్..
- అయిదేళ్ల పాటు ఐటీ సేవలు



న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా వీడియో, బ్రాడ్‌బ్యాండ్, కమ్యూనికేషన్స్ సంస్థ లిబర్టీ గ్లోబల్ కాంట్రాక్టు దక్కించుకుంది. దీని కింద లిబర్టీ గ్లోబల్ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, కనెక్టివిటీ ప్లాట్‌ఫామ్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ఐటీ సేవలు అందించాల్సి ఉంటుంది. అయిదేళ్ల పాటు అమల్లో ఉండే ఈ డీల్ విలువ 1.5 బిలియన్ యూరోలు (సుమారు రూ. 13,650 కోట్లు). అవసరాన్ని బట్టి 8 ఏళ్ల వరకు దీన్ని పెంచితే ఇది 2.3 బిలియన్ యూరోల స్థాయికి కూడా చేరవచ్చు. ఇందుకు సంబంధించిన ఒప్పందం ప్రకారం లిబర్టీ గ్లోబల్‌కి చెందిన కొన్ని విభాగాల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, టెక్నాలజీ బృందాలను ఇన్ఫీకి బదలాయిస్తారు. దీనితో దాదాపు 400 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ఒప్పందం కారణంగా వ్యయాలు తగ్గించుకోవడం, టెక్నాలజీపై పెట్టుబడుల పరంగా లిబర్టీ గ్లోబల్‌కు ఏటా 100 మిలియన్ యూరోల పైగా ఆదా కాగలదని ఇన్ఫీ తెలిపింది. 2020 ఫిబ్రవరి నుంచి లిబర్టీకి ఇన్ఫీ సేవలు అందిస్తోంది. మరిన్ని మార్కెట్లకు విస్తరించేందుకు, కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇన్ఫోసిస్‌తో డీల్ ఉపయోగపడగలదని లిబర్టీ గ్లోబల్ సీఈవో మైక్ ఫ్రైస్ తెలిపారు. దీనివల్ల తమకు గణనీయంగా ఆదా కావడంతో పాటు తమ ఉద్యోగులు కెరియర్‌లో పురోగమించేందుకు అవకాశాలు కూడా లభించగలవని వివరించారు. లిబర్టీ క్లౌడ్ విభాగానికి ఇప్పటివరకు తమ కోబాల్ట్ సాధనంతో సేవలు అందించగా.. ఇకపై కృత్రిమ మేథకు సంబంధించి టోపాజ్ సాధనాన్ని కూడా జత చేయనున్నామని ఇన్ఫీ సీఈవో సలిల్ పరేఖ్ తెలిపారు.

ఫాక్స్‌కాన్ హైదరాబాద్ ప్లాంటులో ఎయిర్‌పాడ్స్ తయారీ



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ కోసం వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ (ఎయిర్‌పాడ్స్)ను ఫాక్స్‌కాన్ తమ హైదరాబాద్ ప్లాంటులో తయారు చేయనుంది. 2024 డిసెంబర్ నాటికి భారీ స్థాయిలో వీటి ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ ప్లాంటుపై ఫాక్స్‌కాన్ దాదాపు 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. ఐఫోన్ల తర్వాత యాపిల్ పోర్ట్‌ఫోలియోలో అత్యధికంగా అమ్ముడయ్యే ఉత్పత్తుల్లో ఎయిర్‌పాడ్‌లు రెండో స్థానంలో ఉన్నాయి. ట్రూ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్) మార్కెట్లో 36 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. మరోవైపు, తమ ప్రణాళికలను సక్రమంగా అమలు చేయగలిగితే భారత్‌లో బిలియన్ల కొద్దీ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయని కంపెనీ రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా హోన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్ (ఫాక్స్‌కాన్) చైర్మన్ యంగ్ లియు తెలిపారు. వార్షిక ప్రాతిపదికన భారత్‌లోని తమ విభాగం 10 బిలియన్ డాలర్ల పైగా టర్నోవరు సాధించినట్లు వివరించారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

ప్రధాని ప్రసంగాన్ని 'బ్లూప్రింట్'గా అభివర్ణించిన పరిశ్రమ వర్గాలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే బ్లూప్రింట్ వంటిదని పారిశ్రామిక వర్గాలు పేర్కొన్నాయి. మోదీ ప్రసంగంలో గత దశాబ్దంలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ, 2047 నాటికి భారతదేశం 'వికసిత భారత్' (అభివృద్ధి చెందిన దేశం)గా మారేందుకు బ్లూప్రింట్‌ను రూపొందించిందని పరిశ్రమల సంఘం సీఐఐ తెలిపింది. భారత్‌ను మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న ప్రధాని దార్శనికత వచ్చే ఐదేళ్లలో సులువుగా ఫలించగలదని సీఐఐ విశ్వసిస్తోందని డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తెలిపారు. ప్రధాని తన ప్రసంగంలో వివరించిన విజయాలు, దార్శనికత అమృత్ కాలంలో భారతదేశం అగ్రగామిగా, ప్రపంచ సూపర్ పవర్‌గా ఎదిగేందుకు కావాల్సిన బలం, ధైర్యాన్ని అందిస్తాయి. ఇందుకు తగిన వేదికను ఏర్పాటు చేస్తాయి'' అని ఆయన అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ చేసిన ప్రసంగం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే జాతీయ సంకల్పాన్ని మరింత ముందుకు తీసుకువెళుతుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ అన్నారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 45 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. వివిధ బీడీఎల్ కార్యాలయాలు/యూనిట్లలో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
» **బీడీఎల్ యూనిట్/కార్యాలయాలు:** కార్పొరేట్ ఆఫీస్(గచ్చిబౌలి), కంచన్‌బాగ్ యూనిట్(హైదరాబాద్), భానూర్ యూనిట్(సంగారెడ్డి జిల్లా), ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా), విశాఖపట్నం యూనిట్.
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రానిక్స్)-15, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)-12, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)-04, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కంప్యూటర్ సైన్స్)-01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సైబర్ సెక్యూరిటీ)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(బిజినెస్ డీఈవీ)-01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఆప్టిక్స్)-01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఫైనాన్స్)-02, వెల్ఫేర్ ఆఫీసర్-02, జేఎం(పబ్లిక్ రిలేషన్స్)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 27.07.2023 నాటికి ఎంటీ(ఫైనాన్స్)/వెల్ఫేర్ ఆఫీసర్/జేఎం పోస్టులకు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు ఎంట్రీ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, వెల్ఫేర్ ఆఫీసర్/జేఎం పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష), ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 21.08.2023
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు తేది:** 20.09.2023.
» **రాతపరీక్ష తేది:** డిసెంబర్ 2023/జనవరి2024
» **వెబ్‌సైట్:** https://bdl-india.in

సెయిల్ ఒడిశాలో 202 ట్రెయినీ పోస్టులు

ఒడిశా రాష్ట్రం రూర్కెలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. స్థానిక అభ్యర్థుల నుంచి ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 202
» **విభాగాలు:** క్రిటికల్ కేర్, అడ్వాన్స్‌డ్ నర్సింగ్ ట్రెయినింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మెడికల్ ల్యాబ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్ /జీఎన్ఎం/డిప్లొమా /బీబీఏ/ఎంబీఏ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 35 ఏళ్లు ఉండాలి. » **స్టైపెండ్:** నెలకు రూ.7,000 నుంచి రూ.15,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.08.2023
» **వెబ్‌సైట్:** www.sail.co.in

ఎన్ఐఏలో.. ఏఓ కొలువులు

ప్రభుత్వరంగ బీమా సంస్థల్లో ఒకటైన న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ.. జనరల్, స్పెషలిస్ట్ విభాగాల్లో.. 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఇందులో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకుంటే.. ప్రారంభంలోనే రూ.80వేల వరకూ వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ ఏవో పోస్టుల, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» జనరలిస్ట్, స్పెషలిస్ట్ కేడర్‌లో 450 ఉద్యోగాలు
» న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే నెలకు రూ.80వేల వేతనం



మొత్తం 450 ఏవో పోస్టులు

న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ తాజా నియామక ప్రక్రియ ద్వారా జనరలిస్ట్ కేడర్‌తో పాటు మరో ఏడు స్పెషలిస్ట్ కేడర్లలో 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో జనరలిస్ట్ 120 పోస్టులు, రిస్క్ ఇంజనీర్స్ 36, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 96, లీగల్ 70, అకౌంట్స్-30, హెల్త్-75, ఐటీ-23 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **జనరలిస్ట్ ఏఓ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీలో ఉత్తీర్ణత ఉండాలి.
- **రిస్క్ ఇంజనీర్స్:** 60 శాతం మార్కులతో బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఆటోమొబైల్ ఇంజనీర్:** ఆటోమొబైల్ బ్రాంచ్‌తో 60 శాతం మార్కులతో బీటెక్/ ఎంటెక్ ఉత్తీర్ణత సాధించాలి.
- **లీగల్ ఆఫీసర్స్:** 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం ఉత్తీర్ణత ఉండాలి.
- **అకౌంట్స్ ఏఓ:** బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) కోర్సు పాసవ్వాలి.
- **హెల్త్ ఏఓ:** ఎంబీబీఎస్/ఎండీ/మెడికల్ పీజీ/బీడీఎస్/ఎండీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్‌లలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఐటీ స్పెషలిస్ట్:** కంప్యూటర్ సైన్స్/ఐటీ బ్రాంచ్‌తో 60 శాతం మార్కులతో బీటెక్ లేదా ఎంటెక్ ఉత్తీర్ణత ఉండాలి. లేదా ఎంసీఏలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- అన్ని పోస్ట్‌లకు సంబంధించి రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు సంబంధిత కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 30 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆకర్షణీయ వేతనం

ఏడాది పూర్తి స్థాయిలో కొలువుదీరిన వారికి ఆకర్షణీయ వేతనం లభిస్తుంది. స్కేల్-1 ఆఫీసర్ హోదాలో రూ.50,925-రూ.96,765 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం ఉంటుంది. స్థూల వేతనం నెలకు రూ .80 వేలుగా ఉంటుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి మొత్తం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

ప్రిలిమినరీ.. 100 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు.పరీక్ష సమయం ఒక గంట.

రెండో దశ మెయిన్ ఎగ్జామ్

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశ మెయిన్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 15 మందిని చొప్పున మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను జనరలిస్ట్ కేడర్, స్పెషలిస్ట్ కేడర్ పోస్ట్‌లకు వేర్వేరుగా నిర్వహిస్తారు.

జనరలిస్ట్ ఏఓ మెయిన్

జనరలిస్ట్ ఏఓ మెయిన్ పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి 50 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

స్పెషలిస్ట్ ఏఓ మెయిన్ పరీక్ష

స్పెషలిస్ట్ కేడర్ పోస్ట్‌లకు నిర్వహించే మెయిన్ ఎగ్జామ్ అయిదు విభాగాల్లో 200 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు, సంబంధిత సబ్జెక్ట్ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్ష కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

డిస్క్రిప్టివ్ పరీక్ష

- జనరలిస్ట్, స్పెషలిస్ట్ ఏఓ పోస్ట్‌లకు సంబంధించి మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్‌తోపాటు మరో 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు.
- డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో అభ్యర్థులు లెటర్ రైటింగ్(10 మార్కులు), ఎస్సే రైటింగ్(20 మార్కులు) రాయాల్సి ఉంటుంది.
- పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో 30 నిమిషాల వ్యవధిలో ఉండే ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో అభ్యర్థులు కంప్యూటర్ ద్వారా లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బీమా రంగంతోపాటు తాజా పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వారు దరఖాస్తు చేసుకున్న పోస్ట్, అర్హతలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

వెయిటేజీ విధానం

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు.మెయిన్ ఎగ్జామ్‌లో పొందిన మార్కులకు 75 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కేటాయిస్తారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీకి అనుగుణంగా క్రోడీకరించి.. తుది జాబితా రూపొందించి నియామకం ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

- ఎంపికైన అభ్యర్థులకు ఏడాది పాటు ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. వీరు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే నాన్-లైఫ్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రొబేషన్ పూర్తయినట్లుగా పరిగణిస్తారు. లేదంటే మరో ఆరు నెలలు పొడిగిస్తారు.
- నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులు కనీసం నాలుగేళ్ల పాటు సంస్థలోనే పని చేస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

ఉన్నత హోదాలు

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ఆయా విభాగాల్లో ఉన్నత హోదాలకు చేరుకునే అవకాశముంది. తొలుత అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాక.. పదోన్నతికి అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ మేనేజర్/బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్/డివిజనల్ మేనేజర్; సీనియర్ డివిజనల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, రీజనల్ మేనేజర్; డీజీఎం, జీఎం వంటి హోదాలకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**21.08.2023.
- **ప్రిలిమినరీ(ఫేజ్-1) రాత పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 9, 2023.
- **మెయిన్(ఫేజ్-2) రాత పరీక్ష తేదీ:** అక్టోబర్ 8, 2023.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.newindia.co.in/portal/readMore/Recruitment

విజయం సాధించాలంటే

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ కోసం అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్,అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్,డైరెక్షన్స్,బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్,సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను సాధన చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, తాజా పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్, ప్రొఫెషనల్ నాలెడ్జ్

మెయిన్ పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో మంచి స్కోర్ కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

ఆత్మ నిర్భర్ భారత్ కోసం నిరంతర కృషి

ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తు భారతావని కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ.. వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను స్వావలంబన, స్వాభిమాన్, ఆత్మగౌరవంతో గర్వంగా నిర్వహించే దిశగా పయనించాలని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పిలుపునిచ్చారు. సముద్ర ప్రాంతంలో సెక్యూరిటీ డైనమిక్స్, మేరీటైమ్ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేకుండా, ప్రతి ఒక్కరూ సవాళ్లని ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం 50 మందితో కూడిన సాయుధ దళంతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ తీర భద్రత కోసం అనునిత్యం శ్రమించాల్సిన అవసరం ఉందని సూచించారు. సముద్ర తీర భద్రత సురక్షితంగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ సైతం వృద్ధి బాటలో పయనిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్క నౌకాదళ సిబ్బంది గుర్తెరగాలని చెప్పారు. ఆత్మ నిర్భర్ భారత్ కోసం నౌకాదళం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అంతకు ముందు బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద నౌకాదళాధికారులు స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్నారు. దాయాది దేశంతో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన నౌకాదళ సిబ్బందికి ఘన నివాళులర్పించారు.

సెప్టెంబర్ 18న టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల పంపిణీ

- టీటీడీ చైర్మన్ భూమన



ఇంటి స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న భూమన


తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా): టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం ఆయన టీటీడీ అధికారులతో కలిసి వడమాలపేట సమీపంలో ఉద్యోగులకు కేటాయించిన 310 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఆయనకు మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ ఉద్యోగులు అంతర్గత విభేదాలు విడనాడి కలసికట్టుగా పనిచేయాలన్నారు. సెప్టెంబర్ 18న సీఎం జగన్ చేతుల మీదుగా ఇంటి స్థలాల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. అవసరమైతే మరో 100 ఎకరాలైనా ప్రభుత్వం నుంచి సేకరించి అందరికీ ఇంటి స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సౌరగోళంపై అధ్యయనానికే ఆదిత్య–ఎల్1 మిషన్

బెంగళూరు యూఆర్ఎస్‌సీ నుంచి షార్‌కు చేరుకున్న ఉపగ్రహం

- ఆరు పేలోడ్స్ పరిశోధనలు
- సెప్టెంబర్‌లో పీఎస్ఎల్‌వీ సీ57ద్వారా ఆదిత్య–ఎల్1 ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా) : సౌరగోళం రహస్యాలను ఛేదించే లక్ష్యంతో ఇస్రో పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా 1,475 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహ ప్రయోగాన్ని సెప్టెంబర్ మొదటివారంలో ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు జరుగుతుండగా ఆదిత్య–ఎల్1 ఉపగ్రహం బెంగళూరు నుంచి షార్‌కు చేరుకుంది. ఆదిత్య ఎల్1 ఉపగ్రహం ప్రయోగం ద్వారా సూర్యునిపై దాగి ఉన్న రహస్యాలను పరిశోధనలు చేయనున్నారు. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు ఒక అంచనా వేశారు. దీంతో పాటు కాంతిమండలం (ఫోటోస్పియర్), వర్ణ మండలం (క్రోమోస్పియర్)పై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించాలని ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు పూనుకున్నారు. బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ)లో ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. యూఆర్ఎస్‌సీ సెంటర్‌లో పనిచేస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే శంకర సుబ్రమణియన్ శాటిలైట్ సెంటర్‌లో స్పేస్ ఆస్ట్రానమీ గ్రూపు (సాగ్)కు నాయకత్వం వహిస్తున్నారు. ఈయన ఆధ్వర్యంలో ఆదిత్య ఎల్1 ఉపగ్రహం రూపకల్పన చేశారు. శంకర్ సుబ్రమణియన్ గతంలో ఖగోళ పరిశోధనకు ఉపయోగించిన ఆస్ట్రోశాట్ అనే ఉపగ్రహాన్ని, చంద్రయాన్–1. చంద్రయాన్–2 మిషన్లకు అనేక హోదాల్లో పనిచేశారు.



సూర్యుని కక్ష్యలో ఆదిత్య ఎల్1 ఉపగ్రహం పరిభ్రమించే ఊహాచిత్రం

ఆదిత్య ఎల్–1 ప్రయోగంలో పరిశోధనలకు పేలోడ్స్ ఇవే

1,475 కేజీలు బరువు కలిగిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహంలో ఆరు పేలోడ్స్ బరువు 244 కేజీలు మాత్రమే. మిగిలిన 1,231 కేజీలు ద్రవ ఇంధనం ఉంటుంది. మొదట ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (భూ మధ్యంతర కక్ష్య)లోకి ప్రవేశపెట్టిన తరువాత ఈ ఉపగ్రహాన్ని భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాగ్రేంజియన్ బిందు–1 (ఎల్–1)లోకి చేరవేయడానికి 177 రోజుల సమయం పడుతుంది. అక్కడి నుంచి సూర్యుడిపై జరిగే మార్పులను నిరంతరం పరిశోధించేందుకు వీలవుతుందని అంచనా వేస్తున్నారు. ఆదిత్య ఎల్–1 ఉపగ్రహంలో సూర్యుడిపై అధ్యయనం చేయడానికి యాస్‌పెక్స్, సూట్, వెల్సి, హెలియోస్, పాపా, సోలెక్స్ అనే ఆరు ఉపకరణాలు (పేలోడ్స్) అమర్చి పంపుతున్నారు. సూర్యుడి వెలుపలి వలయాన్ని కరోనా అంటారు. సూర్యగోళానికి వేల కిలోమీటర్ల దూరం వరకు ఇది విస్తరించి ఉంటుంది. అక్కడ ఉష్ణోగ్రత దాదాపు పది లక్షల డిగ్రీల కెల్విన్ వరకు ఉంటుంది. సూర్యుడి అంతర్భాగ ఉష్ణోగ్రత ఆరు వేల కెల్విన్ డిగ్రీలు వరకు ఉంటుంది. కరోనాలో వేడి పెరిగిపోతుండడానికి కారణం అంతు చిక్కడం లేదు. ఈ అంశంపై ఆదిత్య–ఎల్1 దృష్టి సారించి పరిశోధనలు చేయడానికి రంగం సిద్ధం చేశారు. చంద్రుడు, అంగారకుడిపై చేసిన పరిశోధనలు మొదటి ప్రయత్నంలోనే సక్సెస్ కావడంతో సూర్యుడిపై కూడా పరిశోధనలు చేసేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.

ఆదిత్య ఎల్1 నామకరణం..

సూర్యుడికి ఉన్న అనేక పేర్లలో ఆదిత్య అనే పేరుకు ఓ ప్రత్యేకత ఉండడంతో ఈ ఉపగ్రహానికి ఆదిత్య అని నామకరణం చేశారు. ఈ ఉపగ్రహాన్ని లాంగ్రేజియన్ అనే బిందువు వద్ద ప్రవేశ పెడుతున్నారు కాబటి దీనికి ఎల్ అని, సూర్యుడిపై పరిశోధనలు చేసే మొదటి ఉపగ్రహం ఇదే కాబట్టి 1 అని పేరును నిర్ణయించారు. అందుకే దీని పూర్తి పేరును ఆదిత్య–ఎల్1గా నిర్ణయించారు.

ఆదిత్య ఎల్1లో ఆరు పేలోడ్స్ పరిశోధనలు..

సూర్యుడిపై అధ్యయనం చేయడానికి 1,470 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్ 1 ఉపగ్రహంలో ఆరు పేలోడ్స్‌ను అమర్చి పంపుతున్నారు.

- 170 కేజీల బరువు కలిగిన విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్సి) అనే పేలోడ్ ద్వారా సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది. సూర్యుడిలో మార్పులు, అంతరిక్ష వాతావరణం, భూమి యొక్క వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలపై పరిశోధనలు చేస్తుంది.
- సౌర అతినీలలోహిత ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) అనే పేలోడ్ 35 కేజీల బరువు వుంటుంది. 200–400 ఎన్ఎం తరంగదైర్ఘ్యం పరిధి మధ్య సూర్యుడిని గమనిస్తుంది. ఇందులో 11 ఫిల్టర్లను ఉపయోగించడం ద్వారా సౌర వాతావరణంలో వివిధ పొరల పూర్తి డిస్క్ చిత్రాలను అందిస్తుంది. సూర్యుడ్ని నిరంతరం గమనిస్తూనే ఉంటుంది. ఇస్రో ఇతర సంస్థల సహకారంతో పుణేలోని ఇంటర్–యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ నుంచి ఏఎన్ రామ్ ప్రకాష్, దుర్గేష్ త్రిపాఠి నేతృత్వంలో ఈ పేలోడ్‌ను అభివృద్ధి చేశారు.
- ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్ (యాస్‌పెక్స్) అనే పేలోడ్ ద్వారా సౌర గాలి యొక్క వైవిధ్యం, లక్షణాలను తెలియజేయడమే కాకుండా దాని వర్ణపటం లక్షణాలను అధ్యయనం చేస్తుంది.
- ఆదిత్య ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ (పాపా) సౌరగాలి యొక్క కూర్పు దాని శక్తి పంపిణీని అర్థం చేసుకోవడానికి పరిశోధనలు చేస్తుంది.
- సోలార్ ఎనర్జీ ఎక్స్–రే స్పెక్ట్రోమీటరు (సోలెక్స్) సోలార్ కరోనా యొక్క సమస్యాత్మకమైన కరోనల్ హీటింగ్ మెకానిజంను అధ్యయనం చేయడానికి, ఎక్స్–రే మంటలను పర్యవేక్షించడానికి పరిశోధనలు చేస్తుంది.
- హై ఎనర్జీ ఎల్1 ఆర్బిటింగ్ ఎక్స్–రే స్పెక్ట్రోమీటర్ (హెలియోస్) సౌర కరోనాలో డైనమిక్ ఈవెంట్‌లను గమనించడానికి, విస్ఫోటనం సంఘటనల సమయంలో సౌరశక్తి కణాలను వేగవంతం చేయడానికి ఉపయోగించే శక్తిని అంచనా వేస్తుంది.



సూర్యుడిపై పరిశోధనలు చేసేందుకు ప్రయోగించనున్న ఆదిత్య ఎల్1 ఉపగ్రహం

సీసీటీవీ కెమెరాలతో మెరుగైన భద్రత

- నగరాలు, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న పరికరాలు
- సొంతంగా ఏర్పాటుచేసుకుంటున్న కాలనీ వాసులు
- దేశంలో మొదటి మూడు స్థానాల్లో కర్ణాటక, హరియాణా, ఆంధ్రప్రదేశ్
- 'పోలీసింగ్ ఇన్ ఇండియా' నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి : నేరాల నియంత్రణ, మెరుగైన భద్రతకు సీసీటీవీ కెమెరాలు అత్యావశ్యకమని దేశంలోని పట్టణప్రాంత ప్రజలు గాఢంగా విశ్వసిస్తున్నారు. అందుకే దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు మొగ్గుచూపుతున్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇతర నివాస ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవడం ఐదేళ్లుగా భారీగా పెరుగుతోందని ఫోర్బ్స్ సంస్థ 'పోలీసింగ్ ఇన్ ఇండియా–2023' నివేదిక వెల్లడించింది. ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం విస్తతితో భద్రత, వ్యక్తిగత ప్రైవసీ అనే రెండింటిలో ఎటువైపు మొగ్గుచూపాలి అనే అంశంపై ఐదేళ్ల క్రితం వరకు దేశ ప్రజల్లో ఓ సందిగ్ధత ఉండేదని ఆ నివేదిక పేర్కొంది. కాలనీలు, నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం తమ వ్యక్తిగత గోప్యతకు భంగకరమని భావించేవారు. బహిరంగ ప్రదేశాల్లో పోలీసు, మున్సిపల్ శాఖలు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. కాబట్టి తమ నివాస ప్రాంతాల్లో ఇవి వద్దనే భావన ఉండేది. కానీ, నగర, పట్టణ ప్రాంత ప్రజల్లో ఆలోచనా దృక్పథం ఐదేళ్లలో మారిందని ఆ నివేదిక వెల్లడించింది. ప్రజలు తమ నివాసాలకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసుకుంటున్నారని తెలిపింది. నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ..

- దేశంలో నగరాలు, ప్రధాన పట్టణ ప్రాంతాల్లో 51 శాతం మంది ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. నగరాల్లో 61 శాతం, ప్రధాన పట్టణాల్లో 46 శాతం ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి.
- నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని కాలనీల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో కర్ణాటక మొదటిస్థానంలో ఉండగా రెండు, మూడు స్థానాల్లో హరియాణా, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. కర్ణాటకలో 68శాతం, హరియాణాలో 67శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 33శాతం ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేసుకున్నారు.
- ప్రభుత్వం అత్యధికంగా ఈ కెమెరాలు ఏర్పాటుచేసిన వాటిలో ఢిల్లీ మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ 54 శాతం ప్రాంతాల్లో ప్రభుత్వమే వీటిని ఏర్పాటుచేసింది.
- అలాగే, అత్యధిక ఆదాయ వర్గాల ప్రాంతాల్లో 73 శాతం, ఎగువ మధ్యతరగతి వర్గాల ప్రాంతాల్లో 63 శాతం, మధ్య తరగతి వర్గాలుండే చోట 45 శాతం, అంతకంటే తక్కువ ఆదాయ వర్గాల ప్రాంతాల్లో 28శాతం వరకు ఈ కెమెరాలు ఉన్నాయి.
- సీసీటీవీ కెమెరాలతో 'ఫేషియల్ రికగ్నిజేషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టీ) పోలీసులకు అందుబాటులోకి వస్తోంది. దాంతో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు మరింత సమర్థంగా నిర్వర్తించేందుకు ఆ శాఖకు ఇది ఉపయోగపడుతోంది. ఈ కెమెరాలు లేని ప్రాంతాల్లో కంటే ఉన్న ప్రాంతాల్లో నేరాలు 30 శాతం తగ్గినట్లు.. కేసుల ఛేదన 28 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.



'తుంగభద్ర'లో పెరుగుతున్న నీటి లభ్యత

- ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటికే టీబీ డ్యామ్‌లోకి 97.82 టీఎంసీల ప్రవాహం
- గత పదేళ్లలో ఇదే సమయానికి డ్యామ్‌లోకి వచ్చింది సగటున 90 టీఎంసీలే
- సాధారణంగా తుంగభద్ర బేసిన్‌లో అక్టోబర్ రెండో వారం వరకూ విస్తారంగా వర్షాలు
- గత నాలుగేళ్ల తరహాలో ఈ ఏడాదీ నీటి లభ్యత మెరుగ్గా ఉంటుందని అంచనా

సాక్షి, అమరావతి : కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో ఈ నీటి సంవత్సరంలో నీటి లభ్యత క్రమేణా పెరుగుతోంది. జూన్ 1 నుంచి మంగళవారం ఉ.6 గంటల వరకూ టీబీ (తుంగభద్ర) డ్యామ్‌లోకి 97.82 టీఎంసీల ప్రవాహం వచ్చింది. గత పదేళ్లలో సరిగ్గా ఇదే సమయానికి ఈ డ్యామ్‌లోకి సగటున వచ్చిన ప్రవాహం 90 టీఎంసీలే. సాధారణంగా తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో అక్టోబర్ రెండో వారం వరకూ నైరుతి రుతుపవనాల ప్రభావంవల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ నేపథ్యంలో.. గత నాలుగేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ టీబీ డ్యామ్‌లో నీటి లభ్యత మెరుగ్గా ఉంటుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. తుంగభద్ర నదిలో టీబీ డ్యామ్ వద్ద 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం) టీఎంసీల చొప్పున కేటాయించింది. ఏటా పూడిక పేరుకుపోతుండటంతో డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. 2016లో నిర్వహించిన సర్వేలో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. దాన్ని పరిగణలోకి తీసుకుని.. నీటి లభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు నీటిని పంపిణీ చేస్తూ వస్తోంది.



తుంగభద్ర జలాశయం

నాలుగేళ్లుగా భారీ ప్రవాహం..

మరోవైపు.. కృష్ణా ప్రధాన పాయకు దీటుగా తుంగభద్రలోనూ ప్రవాహం ఉంటోంది. టీబీ డ్యామ్ చరిత్రలో 2016–17లో కనిష్ఠ స్థాయిలో 85.71 టీఎంసీల ప్రవాహం వచ్చింది. 2019–20 నుంచి టీబీ డ్యామ్‌లోకి నాలుగేళ్లుగా భారీగా ప్రవాహం వస్తోంది. గత నీటి సంవత్సరంలో డ్యామ్‌లోకి గరిష్ఠ స్థాయిలో 606.64 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ఇది తుంగభద్ర డ్యామ్ చరిత్రలో రికార్డు. ఇలా గత నాలుగేళ్లుగా నీటి లభ్యత గణనీయంగా పెరగడంతో ఆయకట్టులో రైతులు పెద్దఎత్తున పంటలు సాగుచేసి ప్రయోజనం పొందారు. ఈ ఏడాదీ నీటి లభ్యత మెరుగ్గా ఉంటుందని అధికార వర్గాలు వేస్తున్న అంచనాలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

టీబీ డ్యామ్‌లోకి గత పదేళ్లుగా వచ్చిన ప్రవాహాలు.. (టీఎంసీల్లో)

నీటి సంవత్సరం	వచ్చిన ప్రవాహం
2014-15	348.04
2015-16	113.81
2016-17	85.71
2017-18	125.39
2018-19	357.66
2019-20	419.60
2020-21	299.53
2021-22	410.21
2022-23	606.64
2023-24	97.82

(మంగళవారం ఉ.6 వరకూ)

భారత్‌లో 1,353 పక్షి జాతులు

ఇందులో 78 జాతులు మాత్రమే స్థానికమైనవి

పశ్చిమ కనుమలు, అండమాన్ దీవుల్లో అత్యధికంగా స్థానిక జాతులు

జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడి

భారతదేశంలో కనిపించే పక్షి జాతుల్లో కేవలం ఐదు శాతం మాత్రమే స్థానికమైనవని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) వెల్లడించింది. మొత్తం 1,353 పక్షి జాతులకు భారత్ నిలయంగా ఉండగా.. ఇది ప్రపంచ పక్షి వైవిధ్యంలో దాదాపు 12.40 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొంది. ఇందులో 78 జాతులు స్వదేశానివి. వీటిని ఇతర దేశాల్లో ఎక్కడా గుర్తించలేదని జెడ్ఎస్ఐ స్పష్టం చేసింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల సందర్భంగా జెడ్ఎస్ఐ '75 ఎండెమిక్ బర్డ్స్ ఆఫ్ ఇండియా' పేరుతో నివేదికను విడుదల చేసింది.

-సాక్షి, అమరావతి



దశాబ్దాలుగా కనబడని జాతులు

- మూడు జాతులు గత కొన్ని దశాబ్దాలుగా కనబడలేదని జెడ్ఎస్ఐ ప్రకటించింది.
- మణిపూర్ బుష్ పిట్ట (పెర్డికులా మణిపురెన్సిస్) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) రెడ్ లిస్ట్ ఆఫ్ థ్రెటెన్డ్ స్పీసీస్ కింద 1907లో చివరిసారిగా నమోదైంది.
- హిమాలయన్ పిట్ట (ఓఫ్రిసియా సూపర్‌సిలియోసా) 1876 తర్వాత దీని జాడలేదు.
- జెర్డాన్స్ కోర్సర్ (రైనోప్టిలస్ బిటోర్క్వాటస్) 2009 తర్వాత దీని ఉనికి కనబడలేదు.
- వీటిని వేగంగా అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు.
- స్థానిక 78 పక్షి జాతుల్లో 25 జాతులు ముప్పును ఎదుర్కొంటున్నట్టు ఐయూసీఎన్ నివేదించింది.

ఐయూసీఎన్ రెడ్‌లిస్టు ప్రకారం దేశంలో పక్షి జాతుల పరిస్థితి ఇలా..

విషమ పరిస్థితి: మూడు జాతులు (బుగున్ లియోసిచ్లా, హిమాలయన్ క్వాయిల్, జెర్డాన్స్ కోర్సర్).	ప్రమాద పరిస్థితి	దుర్భర పరిస్థితి	ప్రమాదానికి దగ్గర్లో
	5 జాతులు	17 జాతులు	11 జాతులు

పశ్చిమ కనుమల్లో అత్యధికంగా జాతులు..

- దేశంలోని 75 పక్షి జాతులను 11 వేర్వేరు శ్రేణులు (ఆర్డర్), 31 కుటుంబాలు, 55 ఉప జాతులకు చెందినవిగా విభజించారు. ఇవే దేశ వ్యాప్తంగా భౌగోళిక పరిస్థితులను తట్టుకుంటూ పర్యావరణ, వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.
- దేశ జీవ వైవిధ్యానికి కేంద్రకంగా ఉండే పశ్చిమ కనుమల్లో అత్యధికంగా 28 స్థానిక జాతులున్నాయి.
- ఇక అండమాన్ నికోబార్ దీవులు 25 స్థానిక పక్షి జాతులకు ఆవాసం.
- పశ్చిమ కనుమల్లో మలబార్ గ్రే హార్న్‌బిల్ (ఓసిరోస్ గ్రిసెయస్), మలబార్ పారాకీట్ (పిట్టాకుల కొలంబాయిడ్స్), అశంబు లాఫింగ్ థ్రష్ (మోంటిసింక్లా మెరిడియోనాలిస్), వైట్–బెల్లీడ్ షోలకిలి (షోలికోలా అల్బివెంట్రిస్) లాంటి ఆకట్టుకునే పక్షి జాతులున్నాయి.
- అండమాన్ దీవుల్లో మాత్రమే కనిపించే పక్షి జాతుల్లో నికోబార్ మెగాపోడ్ (మెగాపోడియస్ నికోబారియన్సిస్), నికోబార్ సర్పెంట్ ఈగల్ (స్పిలోర్నిస్ క్లోస్సీ), అండమాన్ క్రేక్ (రల్లినా కన్నింగి), అండమాన్ బార్న్ గుడ్లగూబ (టైటో డెరోప్స్టోర్ఫీ) ఉన్నాయి. ఈ నాలుగు జాతులపక్షులు తూర్పు హిమాలయాల, దక్షిణ దక్కన్ పీఠభూమి, మధ్య భారత అడవులకు చెందినవి.

జెడ్ఎస్ఐ ఏం చేస్తోంది

దేశంలోని స్థానిక పక్షుల సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచడంతో పాటు అత్యంత అరుదుగా కనిపించే జాతులను సంరక్షించే ప్రయత్నాలు చేస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రోత్ మోనిటరింగ్ పరికరాలు

- పిల్లల బరువు, ఎత్తుతో పాటు గర్భిణులు, శిశువుల బరువు తూచే యంత్రాలు.. రూ.44.48 కోట్లతో కొనుగోలు
- తద్వారా పోషకాహారాన్ని అంచనా వేసేలా చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం వృద్ధి పర్యవేక్షణ (గ్రోత్ మోనిటరింగ్) పరికరాలను అందిస్తోంది. ఒక్కో కేంద్రానికి నాలుగు రకాల పరికరాల పంపిణీ చేస్తోంది. ఇందుకు రూ.44.48 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ.21,84,48,995 వెచ్చించి 1,42,244 పరికరాలను కొనుగోలు చేసిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేపట్టింది. మిగిలిన పరికరాల కొనుగోలు ప్రక్రియ కూడా త్వరలో పూర్తికానుంది. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని పంపిణీ చేయడం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై మరింత పర్యవేక్షణ పెంచడానికి దోహదం చేస్తుంది. గర్భిణుల ఆరోగ్యం ఎలా ఉంది, పిల్లలు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్నారా అనే అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయి. గర్భిణులు తగిన బరువు లేకున్నా.. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకున్నా వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

పోషకాహార స్థాయిని అంచనా వేసేలా..

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రోత్ మోనిటరింగ్ పరికరాలు త్వరితగతిన సరఫరా చేసేలా సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పరికరాల పంపిణీ ప్రారంభించాం. వీటిద్వారా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్రోడీకరిస్తాం. తద్వారా పోషకాహార లోపాన్ని సరిచేయడంతోపాటు గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. పోషకాహార స్థాయిని అంచనా వేసి పిల్లల ఎదుగుదలకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపడతాం.

– ఎ.విజయ సునీత, డైరెక్టర్, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ

అందజేసే పరికరాలివీ

- అనలాగ్ బరువు పరికరం: గర్భిణి, రెండేళ్ల పైబడి వయసు గల పిల్లల బరువు తూయడానికి ఉపయోగిస్తారు.
- స్టేడియో మీటర్: రెండేళ్ల కంటే ఎక్కువ వయసున్న పిల్లలు, పెద్దల ఎత్తును కొలుస్తుంది.
- ఇన్ఫాంటో మీటర్: శిశువుల పొడవు,ఎత్తును కొలవడానికి ఉపయోగపడుతుంది.
- సాల్టర్ స్కేల్: శిశువు బరువును తూయడానికి ఉపయోగిస్తారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943